ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక


8-6-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు




వార్తాచిత్రాలు




ప్రధానామాత్యుడు పండిత నెహ్రూ మే 29-న శ్రీనగర్‌లోని సిల్కుఫాక్టరీ వీక్షించినప్పుడు షేక్ అబ్దుల్లా ప్రభృతులతో ఛలోక్తు లాడుతున్న దృశ్యం.




ఆఫ్ఘనిస్థాన్ స్వాతంత్ర్యదినం సందర్భంలో ఇండియాలోని ఆఫ్ఘనిస్థాన్ రాయబారి నజీబ్‌ఉల్లా గత శుక్రవారం ఢిల్లీ జింఖానాక్లబ్బులో విందు చేశాడు. ఆ విందుకు అరుదెంచుతున్న జవహర్లాల్ నెహ్రూకు నజీబ్‌ఉల్లా స్వాగత మిచ్చినప్పటి ఫోటో.




ఆటంబాంబు అనేది వచ్చింది. కనుక ఇక యుద్ధవిధానం ఎట్లా వుంటుందో చర్చించేందుకు ఇటీవల గ్రీనిచ్‌లో సమావేశమయిన బ్రిటిష్, అధినివేశ, అమెరికా సైనికాధికారులు.



1951 మేలో జరిగే 'బ్రిటన్ పండుగ' నిమిత్తం ప్రత్యేకం నిర్మింపబడుతున్న కాన్సర్టుహాలు నమూనా. దీనికి 2 66 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుం దని అంచనా వేశారు.



ఇండియాలో ఇథియోపియా ప్రతినిధి ఇరాన్యల్ అబ్రహాం మే 30 న గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి గారికి తన అధికారపత్రాలను సమర్పించినప్పటి ఫోటో.



మిద్దెపైన దిగుతున్న హెలికోప్టర్ విమానం. బ్రిటిష్‌వారి శ్రామికప్రదర్శనంలో ఒలింపియా భవనంపైన దీనిని ఉపయోగించారు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము **41**


సంచిక **38**

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి బుధవారము



శ్రీనగర్‌లోని షాలీమార్ ఆరామంలో ఒక దృశ్యం.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ జూన్ నెల ౮-వ తేది బుధవారము

ఆహారసమస్యాపరిష్కారమార్గం

ఆహారవిషయమున చెన్న రాష్ట్రస్థితి అతి దుర్బలముగ నున్నదని కేంద్రప్రభుత్వ ఆహార శాఖామంత్రి శ్రీ జయరాందాస్ దౌలత్‌రాం మొన్న శనివారము ఆంధ్ర వాణిజ్యమండలి సన్మాన పత్రమునకు సమాధాన మొసగుచు చేసిన ప్రకటనయందు వినూత్నవిషయ మేమియు లేదు. వారా విషయమును క్రొత్తగ ఈనాడు గ్రహించి రని తలంచుటకు వీలులేదు. చెన్న రాష్ట్రము క్రిందటి రెండు దశాబ్దములుగ ప్రధానాహారధాన్యము కొరకు బర్మా, సయాం దేశముల ఎగుమతులపైననే ఆధారపడుచుండెను. 1939 యుద్ధము ప్రారంభమైనప్పటి నుండియు భారత దేశ ఆహారసమస్య "ప్రపంచ ప్రసిద్ధి" కెక్కెను. బర్మా, సయాం, ఇండో-చైనాదేశములు జపాన్ వశమైన తరువాత చెన్న రాష్ట్ర ఆహారస్థితి పూర్తిగ విషమించెను. ప్రజలు, పంటదారులు, అసమాన త్యాగములు చేసి, ఈ పది సంవత్సరములనుండి, కడుపు కట్టుకొనుచు దుర్భిక్షమును, దుర్భరక్షామమును నివారింప గలిగిరి. అలవాటులేని ఆహార పదార్థములను వాడుకొనుచు, ప్రధానాహార ప్రమాణమును తగ్గించుకొనుచు కాలక్షేపము చేసిరి. 1951 సంవత్సరముతరువాత అయినను ఈ రాష్ట్ర ప్రజలస్థితి బాగుపడగలదను ఆశ కన్పించుటలేదు.

రాష్ట్ర ప్రభుత్వ సస్యాభివృద్ధి పథకములు ఆశాజనకముగనే యున్నవని మూడురోజులు మంత్రులతోను, చెన్నపట్టణము పరిసర ప్రాంతముల పర్యటించి, ప్రభుత్వోద్యోగులతోను జరిపిన చర్చలవలన తనకు స్ఫురించినట్లు దౌలత్రాంగారు ఆదివారము సాయంత్రం పత్రికా విలేఖరులతో ముచ్చటించుచు వెల్లడించిరి. ఈ రాష్ట్రమున పథకముల కెన్నడు కొదవ లేదు. ఆ పథకములను, ప్రాజెక్టులను అమలు జరుపుటకు కావలసిన ద్రవ్యమునకు లోపము లేదు. స్వార్థరహితముగ, ప్రాంతీయాభిమానములకు లొంగిపోక ప్రాజెక్టులను అమలుజరుపగల సమర్థులు, దక్షులు మాత్రము కన్పించుటలేదు. తుంగభద్రా ప్రాజెక్టు ఇంతవరకు అడుగున పడియుండుటకు, రామపాదసాగరు ప్రాజెక్టు బుట్టదాఖలగుటకు, మాచ్‌ఖండ్ ప్రాజెక్టు పని ప్రారంభం కాకపూర్వమే ఆగిపోవుటకు ఈ ప్రాంతీయాభిమానములు, దురభిమానములే కారణము.

రాష్ట్రప్రజలకు, మంత్రుల సామర్థ్యము, దక్షత విషయమునను, అధికారుల ప్రజాసేవా నిరతి, నిష్పాక్షిక వైఖరి విషయమున ఇట్టి యనుభవములు నిత్యములైనందున కేంద్ర ఆహారమంత్రికి మూడురోజుల చర్యలవల్ల కల్గిన ఆశ, విశ్వాసము కలుగుట లేదు. నూతుల స్కీము సత్యము చెప్పవలెనన్న పూర్తిగ విఫలమైనదనే చెప్పవలసియుండును. ప్రభుత్వము మంజూరు చేయు ధనమునకు నాలుగైదు రెట్లు వ్యయపరచినగాని సాగుకుపయోగపడగల నూతులు ఏర్పడవు. ప్రభుత్వ గ్రాంట్లతో పని ప్రారంభించి, పూర్తి చేయుటకు అదనముగ ద్రవ్యము లభింపక అనేకమంది రైతులు సస్యాభివృద్ధి కార్యక్రమమును విరమింపవలసి వచ్చెను. అధికారులు కొరవడిన ధనము నిచ్చి పని పూర్తిచేయించుటకు బదులు "మట్టిపాలైన" ప్రభుత్వ గ్రాంటును రాబట్టుకొనుటకు రైతులపై చర్యలు తీసికొన నారంభించిరి. ఈ విధానము రాష్ట్ర రైతాంగమును నిరుత్సాహపరచినది.

ఇక చెరువుల మరమ్మతులు, మైనరు ఇర్రిగేషను పనుల విషయమున ప్రభుత్వాధికారులు ఎట్టి శ్రద్ధ వహించుచుండిరో దౌలత్ రాంగారికి మద్రాసు పరిసర ప్రాంత రైతులు సమర్పించిన విజ్ఞాపనములు స్పష్టము చేయగలవు. పబ్లిక్ వర్క్సు శాఖామంత్రి నియోజకవర్గమున, వారికి విశేష ప్రాంతీయాభిమానముండియు, పరిస్థితు లీవిధముగనున్న రాష్ట్ర మారుమూల గ్రామములందు పరిస్థితు లెట్లుండునో ఊహించుకొనవచ్చును. చెరువుల మరమ్మతులకు కుడిమరమ్మతు హక్కులు ప్రతిబంధకములైనవని ఇర్రిగేషను ఇంజనీరు ఆహారమంత్రికి చెప్పిన సమాధానము సమాధానము గాదు. మలబారులో ఇట్టి ఇర్రిగేషను ప్రాజెక్టులను ప్రారంభించుటకు భూమి అమరకపు శాసనము ప్రతిబంధకము కాగా, ఆ శాసనమును సవరింపగలిగిన రాష్ట్ర ప్రభుత్వము ఈ పరిస్థితిని చక్కచేయలేకపోయెనా? ఎస్టేటుదారుల సర్వహక్కులను హరింపగల ప్రభుత్వము ఈ కుడిమరమ్మతు హక్కులవల్ల ఏర్పడిన ప్రతిబంధకములను అధిగమింపజాలకపోయెనా ?

ఇందువలన ఒక్క విషయము స్పష్టమగుచున్నది. అదే సస్యాభివృద్ధి ప్రణాళికలు ఫలప్రదము కాకపోవుటకు కారణము. అధికారుల దృక్పథము, మనస్తత్వము దేశావసరములకు తగినట్లుగ, కాలానుగుణముగ మార్పు చెందలేదు. ప్రజలకు వారిపై విశ్వాసము, గౌరవము లేదు. వారివలన తమ పనులు నెరవేరగలవను ఆశలు లేవు. మంత్రులును ప్రజలకు కర్తవ్యమును బోధించుటలో ప్రదర్శించుచున్న ఉత్సాహ ఉద్రేకములలో ఏమాత్రము స్వధర్మ నిర్వహణయందు కన్పరచినను నేటి దుస్థితిని నివారింప వీలయ్యెడిది. అధికోత్పత్తిని గురించి వీరు నిరంతరముచేయు విజ్ఞాపనములు, హెచ్చరికలు నిష్ఫలమయ్యెడివి గావు.

ఈ రాష్ట్రమునకే గాక, దాదాపు దేశమందంతట పరిస్థితులు ఒకేవిధముగ నున్నవి. కాని ఇటీవల జరిగిన మంత్రివర్గమార్పులు ఈ రాష్ట్ర ప్రత్యేక సమస్యలను విదితము చేయుచున్నవి. ఆహార,వ్యవసాయ శాఖలను మార్చుటలోనే రాష్ట్ర ప్రభుత్వము ఈ సమస్య కెంతటి ప్రాధాన్యము నిచ్చుచున్నదో స్పష్టము కాగలదు. రెండుసంవత్సరములుగ, ఆహార, వ్యవసాయ శాఖలను నిర్వహించుచున్న డా॥ రాజన్, కె. మాధవమీనన్‌గార్ల నుండి ఆ శాఖలను మార్చుట ఏ విధముగను సమర్థనీయము గాదు. వారిదివరలో ఆ శాఖలను సమర్థతతో నిర్వహించినను, నిర్వహింపకపోయినను, కనీసము అందుకు సంబంధించిన సమస్యలు వారికి అవగతమై యుండును. ఇపుడు రోష్ విక్టోరియా ఎ. బి. షెట్టిగార్ల విషయముల నవగాహనము చేసికొనుసరికి 1951వ సంవత్సరము సమీపింపవచ్చును.

సస్యాభివృద్ధి పథకములు సఫలము కావలెనన్న ఒక ప్రత్యేక ఇర్రిగేషన్ బోర్డును నియమించి, అనుభవము, ఋజువర్తనము, ప్రజాసేవానిరతిగల ప్రవీణుని అధ్యక్షునిగ ఏర్పరచి ఈ కార్యక్రమమును నిర్వహించుట అవసరము. ఇది స్టాచ్యుటరి సంస్థగ వ్యవహరింపవలెను. ఆహార శాస్త్రనిపుణుడు, ఆర్థికప్రవీణుడు సభ్యులుగ నియమించి, ఇర్రిగేషన్, వ్యవసాయ, ఆహారశాఖల అధికారులు ఈ సంఘ నిర్ణయములను అమలు జరపునట్లు చూచుకొనుటే సరియైన మార్గము. దౌలత్రాం గారు "రెడ్ టేప్"ను నిర్మూలించుటకు రాష్ట్రప్రభుత్వ మేమో చర్యలు తీసికొనదలచినట్లు వెల్లడించిరి. కాని అట్టి చర్యలవల్ల అంత ప్రయోజనము ఉండదు. పరిశ్రమల విషయములోవలెనే వ్యవసాయ విషయమున కూడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములు క్రొత్త దృక్పథముతో వ్యవహరింపవలసియుండును.

విషయ సూచిక

ముఖచిత్రం "నిర్లిప్త"
ఛాయాచిత్రణము. పి. రాఘవరావు.

	పుట
నాకబలి (నవల)	5
వేదయుగమునాటి భారతావని	6
ధనానికి విలువ ఎంత ?	7
చీనాలో క్రొత్త పరిపాలన	8
మనరాష్ట్రం, మనదేశం	9
గాజుపరిశ్రమ	10
గాలిమేడ (కథానిక)	11
బాలానందం	12
సినిమా	14
సంగీతము	17
వింతలు - విశేషాలు	19
నేటి ప్రపంచం	21
లేఖలు	22

నవల :

నాతిబులి

వి.ఎడి. ప్రసాదరావు

5

ఇటార్సీ ప్లాటుఫారంమీద మళ్లీ చాలాసేపు జాగారం చేయవలసివచ్చింది. ఈప్రయాణం ఎప్పుడై పోతుందా అని విసుగుపుట్టుతూంది.

ఇందాకటి టిక్కెట్టుకలెక్టరు ఎక్సుప్రెస్ లోనే వెళ్లిపోయాడు. కాని వెళ్లేముందు, ఇంకో టిక్కెట్టు కలెక్టరుచెవివద్ద చేరి, తమ అందరి వంకా చూపిస్తూ పళ్లు కొరుకుతూ, ఏదో రహస్యంగా చెప్పాడు. ఆ రెండో కలెక్టరు, "నే చూస్తాలే!" అంటూన్నట్టు ప్రగల్భంగా ఏ, తమనందరిని ఓరగంట చూసి, ఆ విషయం తరువాతకు వాయిదా వేసినట్లుగా, అప్పటికి అవతలకు పోయాడు. ఏమవుతుందోనని రాఘవరావుకు దిగులుగానే వుంది. తన కన్సెషన్ తనది గాదు. పైగా గొలుసు లాగిన నేరం. సమయానికి వీళ్లంతా ఎల్లా జారుతారో? ఏమో! ఆంజనేయులు ఫర్వాలేదేమో గాని, వెంకట్రావుకూడా మించివస్తే తనకు తను తప్పకొనేరకమే అని అనిపిస్తోంది.

అలహాబాదురైలులో జాగా సరిగ్గా లేదు. తమ ఎక్కేటప్పటికే చాలామంది పక్కలుపరిచి పడకలువేసి ఉన్నారు. తోటివాళ్లంతా ఎవరికి వారు కాస్తకాస్త కూర్చునేందుకు విడివిడిగా జాగాలు సర్దుబాటు చేసుకొంటున్నారు.

ఒకమూల బల్లలమీద విప్పని పరుపు చుట్ట, బుట్టలూ పెట్టి ఉన్నవి. పరుపు నానుకొని, బల్లమీదికి కాళ్లు పెట్టుకొని జేరగిలపడిఉన్న ఆయన తెనుగు కట్టులోనే ఉన్నాడు. కొద్ది ఆశతో అటు కదిలి వెళ్లాడు.

తీరా అక్కడికి వెళ్లాక చూశాడు బల్లల మధ్య పెట్టెలు క్రిందపరిచి, ఒకావిడ బల్లమీద పరుపుచుట్టకు తల అనించుకొని పెట్టెలమీద జేరగిల పడుకొని ఉంది. అక్కడ క్రింద కాళ్లు పెట్టుకొనేటట్లు లేదు. ఆశ నిరాశఅయింది. ఆ చిరాకులో ఆడమొగం చూద్దామన్న కుతూహలంకూడ కలగలేదు. దిగాలుగా అల్లాగే నిలబడి దిక్కులు చూస్తున్నాడు.

ఆంజనేయులు తనను తోసుకుంటూ ముందుకు వెళ్లి, వాళ్లకు ఇవతలగా పడుకొని ఉన్న ఒకమనిషి కాళ్లవద్ద జాగా చేసికొని కూర్చుంటున్నాడు. పడుకొన్న మనిషి ముందు దబాయించాడు. ఆంజనేయులు పైస్థాయిలో తిరిగి దబాయించాడు. ఆ మనిషి కూడా, ఇందాక ఎక్సుప్రెస్‌లో తమ పెట్టిలోవచ్చిన వాడో ఏమో, ఆంజనేయులును గుర్తించాడు. ఇందాకటి అభినందన అతనిలో మిగిలేఉంది కాబోలు. "బైఠియే" అని ఆదరిస్తూ కాళ్లు సర్దుకొన్నాడు. "ఇక్కడ కూర్చుందాం, రావోయ్!" అని ఆంజనేయులు పిలిచాడు.

"మీరూ తెలుగువారేనా అండీ!" అంటూ పరుపు నానుకొని పడుకొన్నాయనకూడా మరి కొంత సర్దుకొని ఇద్దరికీ జాగా యిస్తున్నాడు.

ఆవిడ పెట్టెలమీదనుంచే తల ఎత్తి వీళ్ళను చూసి, కాళ్లు వెనక్కు సర్దుకొని కూర్చోబోతోంది.

"పడుకోండమ్మా! పడుకోండి! మాకు ఇవతలే జాగా చాలునులెండి. కాళ్లు బల్లమీదికే పెట్టుకొంటాం! మీరు పడుకోండయ్యా! ఫరవా లేదు" అంటూ ఆంజనేయులు వాళ్లతో అని రాఘవరావుకు ఇవతల చోటిచ్చాడు.

ఆయనతో, ఊరూ పేరూ కనుక్కొనే కుశలప్రశ్నాదికాలు ముక్తసరిగా గడిపి ఆంజనేయులు, కిటికీలోనుంచి బైటికి తలపెట్టుకొని నిద్రపోతున్నాడు. వాళ్ళదీ తమ జిల్లాలవైపే. ఆయనకు కాశీలోనే ఉద్యోగమట. తమ వచ్చిన ఎక్సుప్రెస్‌లోనే వచ్చారట. కాశీకే వెళ్తున్నారు.

ఆవిడకు ఎన్నో ఏళ్ళు ఉండవు. సామాన్య సంసారి కుండే ఒద్దికమించిన అతిసిగ్గుగాని, అతి ఎబ్బెట్టుతనముగానీ, రెండూ లేవు.

అందము దృష్టికి తగులనంత సరళంగా ఉంది.

కనుముక్కు తీరులో తెలుగువారికి తెలుగు తీరులంటే, అనూహ్యంగానే ఉండే సహజాకర్షణను మించిన విపరీతపు చక్కదనం ఏమీ లేదు పెదవులు, బిగుసుకొని మూతపడినట్లు కాకుండా, సన్నని తెరపిలో పలువరుసను కొద్దిగా ప్రకటించుకొంటూ, చిరునవ్వుకై నిత్యోపక్రమణలో ఉన్నట్లు ఉన్నాయి. కాని కళ్ళల్లో చిరునవ్వు లేదు. కనురెప్పలు నిద్రబరువుతో అర్ధనిమీలితాలైన ట్లున్నయి

నదురుమీదుగా పాయలు బిగదీసి కొండె సిగజుట్టిన తలకట్టులో ముద్దవాగరం, వాడిన మొగలిరేకు, నొసట సగం చెరిగిన పెద్ద కుంకుమ బొట్టు, చెవుల బండదుద్దులూ, ముక్కుపుడకా, అడ్డబాస, మెడలో నానుపట్టెడ, బండకంటె, పైటపైకి పడుతున్న పచ్చతాడున మంగళసూత్రాలు, మెడనుంచీ మోచేతులవరకూ కంచుకము, చేతుల పూర్వీకపు మురుగులూ, మీగాళ్ళ జీరాడే కుచ్చెళ్లు, కాళ్ళకు అందెలూ మొగ్గు కడియాలూ - సంప్రదాయాల వర్తులంలోనే, పెద్దకు తైదు రూపానికి పెరగా పోయినాకూడా నవ్యత్వాన్నిగానీ, నాగరికతనుగానీ అందుకోలేని - ఆ కట్టూ బొట్టూ, మూడు ముళ్ళుపడ్డ మొదటి వసంతాలలోనే, ముత్తైదుతనపు ముసుగులో ఈడు ముంచెత్తినట్లుంది. ఆ దర్శాలకు నిలకకపోయినా, అల్పపరిధిలోని మార్పులతో అంతగా చెక్కుచెదరని ఆ పుంశ్చలీవిరుద్ధవేషం, నవోఢత్వపుటందాన్ని విలాసపురుషుల లాలస దృష్టులకు పాత్రంకాకుండా అనాగరకపు ముసుగువైచి కోటవలె రక్షిస్తున్నట్లుంది. ఆ రక్షను రక్షితవ్యక్తి కోరినా కోరకపోయినా, రక్ష యియ్యటం తన ధర్మమన్నట్లు, ఆ వేషం, కులములను కాపాడుకొంటూ నిలచింది.

ఆమెఒకసారి కొత్త తెలుగుమొగాలవంక కను విప్పి నిశ్చలంగాచూసి, నిద్రకు కప్పుకొంటున్నట్లుగాపై చెరగు తలమీదికి కప్పుకొని, రైలు పెట్టెమూలబల్లకు మొగము మలుపుకొని, జేరగిల పడి నిద్రపోయింది.

రాఘవరావు కిటికీ నిలువకమ్మికి తల ఆన్చుకొని కూర్చున్నాడు. చీకటికి కారణ్యాలను చీల్చుకొంటూ వేగంతో రైలు పోతోంది. కిటికీలోనుంచి బైటికి చూసే సరదా తగ్గిపోయింది. దోవలో ఎక్కడా తిండి సహించలేదు. ఆకలి తప్పిన ఆవేదన, జాగా సర్దుబాటులేక ఒళ్ళు నెప్పులు పెట్టటం, కళ్లు బరువులు తప్ప సరిగ్గా నిద్రరాక పోవటం, అతి చీకాకుగా ఉంది.

కాసేపు కనురెప్పబాటుగా ఆవిడవంక చూస్తున్నాడు. చూడదగ్గ అంద మేమీవ్యక్తంగా కనబడలేదు. ఇందాకటి నిశ్చలపు చూపులో, అమాయకత్వంగానీ, గంభీరతగానీ, ప్రౌఢతనంగానీ, దేని ఆకర్షణా ఏదీ మనస్సుకు తట్టలేదు. జడంగా కనబడే చూపులకుకూడా అర్థాలు స్వయంగా కల్పించుకొనే చురుకుతనమూ మనస్సుకు లేదు. కలగగల సావధానం అప్పటి పరిస్థితిలో అసలు లేదు. కాని, ఆకర్షణ లేకుండానే, తల కిటికీకి కానించిన స్థితినిబట్టి, జడంగానే అటుచూస్తూ కన్నుమూశాడు.

ఒకసారి నిద్ర ఒరువులో తన కాలు ఆమె బొటనవ్రేలికి తగిలింది. ఆమెకాలు కదలలేదు. కన్ను తెరవకే సరిగ్గాకూర్చున్నాడు. కన్ను తెరిచినప్పుడు, కన్నుమూసుకొంటూన్న ఆమె చూపులు కనబడ్డాయి. అటు ఆలోచించకే కన్ను మూశాడు.

అతనిలో కోర్కెలుగాని, కదలికలుగాని ఏమీ కలగలేదు. మనస్సు, ఒకరూప చిత్రాన్ని, ఒక్కక్షణమాత్రానికిగా స్థిరీకరించుకొన్న ఛాయాచిత్రం లాగచేసి, మనస్సులోని సామాను గదులలో, అట్టు అంటించని అనవసరపు ఫొటోను అజాగ్రత్తగా మూలపారవేసినట్లు, అరల మరుగున పారవేసింది. ఆమె భర్త రూపానికి ఆ మాత్రంస్థానంకూడా రాలేదు.

అల్లాగే కళ్లబరువుతో కూర్చునే కునుకుతూ నిద్రపోయాడు.

6

అలహాబాదు చేరేలోపలే, వీళ్ల విషయం బరాతం పుచ్చుకొన్న ఆ రెండో టిక్కెట్టు కలెక్టరుతో రభస తప్పలేదు. తమయందు తప్పేమీ లేదన్న ధైర్యం, ఆంజనేయులు కున్నంతగా వెంకట్రావ్‌కు లేదు. లౌక్యం చేసి, టిక్కెట్టు కలెక్టరును చాటుకు తీసికెళ్లి, వచ్చాక పదిరూపాయలు ముట్టచెప్పానని చెప్పి, లంచం అందరిమీదా పంచాడు. శర్మ ఒక్కడు కులుకుతూ విడిగా ఉండగలిగాడు.

మళ్లీ డబ్బు యిచ్చుకోవలసివచ్చేటప్పటికి చిరాకుగానే ఉంది. రాఘవరావు గొలుసులాగటమే కారణంగా అంతా అదనం డబ్బు ఇచ్చుకోవలసివచ్చిందన్నట్టుగా ఆంజనేయులుమీద మాటపెట్టి వెంకట్రావ్ అనటం, తక్కిన వాళ్లు, నిన్న అభినందించినవాళ్లే, ఆపనిని నిందిస్తున్నట్లు చిడిముడిపడటం, ఆ చిరాకును మరింత మండించింది.

బెనారస్ కాంటక్ మెంటు చేరేటప్పటికి దేహంలో ఓపికా ఉత్సాహమూ ఏమీ మిగిలి లేవు.

"మేము లాడ్జికి వెళ్తున్నాము. మళ్లీ కలుసుకొంటాం, సెలవు" అని చెప్పి వాళ్లంతా ఉమ్మడిగా టాంగాలు చేయించుకొని కదలిపోతున్నారు.

శర్మా, తనూ మిగిలారు.

"ఏమోయ్, నువ్వు ఎక్కడికి? ఇద్దరం ఎక్కా చేయించుకొని యూనివర్సిటీకి పోదామా, లేక ఎవరన్నా బంధువులున్నారా?"

శర్మమాటలో కొద్దిసెటకారం లేకపోలేదు. ఆ తెలుగుదంపతులు అప్పుడే బండీ చేయించుకొని సందు మళ్లి, వెళ్లిపోతున్నారు. తను వాళ్ల వైపుగా రైలులో కూర్చున్నందుకు అంతకన్నా ప్రయాణం పొడుగునా, అతని నుండి వేరైనందుకు, ఈర్ష్యతో అనవసరపు ఈసడింపు ధ్వనిస్తున్నాడు శర్మ. అదేమీ పట్టించుకొనే స్తిమితం లేదు.

"యూనివర్సిటీకే పోదాం."

భగవద్గీత పుస్తకాలమీది రథబొమ్మమాదిరిగా బండిఉన్నా, అనంతశయనం కట్టినట్లుగా ఉన్న ఆ ఎక్కాబండి ఎక్కటానికి మనస్సు చివుక్కుమంది. దేవతార్చన పెట్టిలాగా ఉన్న బండి మధ్య చదరంఅంతా సామానుతో నింపేశారు. ఒకప్రక్క చక్రంవైపుకు కాళ్ళు వేలాడేసి, కమ్మీ పుచ్చుకొని కూర్చుంటూ, శర్మ, "అటుప్రక్క కూర్చోవోయి" అన్నాడు. ప్రక్కతెరలు ముడిచి పైకి కట్టటంలో తలమీదికి రాసుకొంటూ మెడ వంచుకొని కూర్చోవలసివచ్చింది.

బండిమనిషి ముందు కూర్చుని తోలుతున్నాడు. గుఱ్ఱం, బక్కగా కనుపడ్డా, బాహుకుడి గుఱ్ఱంలాగా, మంచి వేగంగానే పోతోంది. గుఱ్ఱపుగాము లతోలుపట్టీలు డక్కుడక్కుమంటూ, గుఱ్ఱండొక్కలలోనుంచి 'వస్తున!' వగుర్పుశబ్దంలాగా వినబడుతున్నాయి.

ఊరంతా గల్లీలూ, గలీజుబజార్లమయంగా ఉన్నట్లుంది. వెడల్పుగాఉన్న సందులలో కూడా కంటికేమీ వైశాల్యం స్ఫురించటం లేదు.

అతి ప్రాచీన నగరమైనందుకు, తగినంత పురాతన పద్ధతులలో పాతకొంపలతో, నిండి అసహ్యంగాఉన్నట్లు ఉంది. మనుష్యులుకూడా చాలా విరుద్ధంగా, మోటుగా ఉన్నట్లు కనబడుతున్నారు.

బండి ఎటు వెళ్తోందో సరిగ్గా తెలియటం లేదు. ఎలక్ట్రిక్ దీపాలు ఉన్నా, రోడ్లమీద కాంతి ఏమీ పడటం లేదు. మేమూ ఉన్నామని ఆత్మతృప్తికోసమే ఉన్నట్లున్నాయి ఆ దీపాలు.

బండిలో సామాన్లు కుదుపులకు కదలి వెనుకవైపున ఉన్న కాషాయ తెరమీదకు బలంగా జారుతూ ఒత్తుకుంటున్నాయి. మెడ త్రిప్పటానికి వీలు లేకుండానే, చెయ్యి వెనుకకు తిప్పుకొని వాట్లను పట్టుకోవలసివస్తూంది.

"ఇంకా ఎంత దూరం ఉంటుంది?" అని అడిగాడు రాఘవరావు.

"ఇడిగో, విజయనగరం పాలెస్ దగ్గరకు వచ్చేశాంగా, చాలావరకు వచ్చేసినట్లే. ఇక రెండు మైళ్లలోపే—".

ఇంకా రెండు మైళ్లు—

"కూర్చోటానికి సరిగ్గా లేదా! పోనీ ఇటు వస్తావా?" అన్నాడు శర్మ.

ఎడమచేతికీ పుఱ్ఱచేతికీ భేదం. ఆ వికరణంలో ఉద్ధరింపు ఏమీ లేదు.

"అబ్బే అక్కర్లేదు. బాగానే ఉంది." అన్నాడు.

యూనివర్సిటీ గేటు!

వచ్చేశామనుకొన్నాడు. తల ముందుకు సారించి చూస్తే, ఎక్కడో ఏవో పెద్ద భవనాలున్నట్లు కనబడుతున్నాయి. గేటు దాటాక కూడా మైళ్లదూరం వెళ్తున్నట్లుంది.

"ఈ ముందుదేనా?"

"కాదు, అది మాలవ్య ఇల్లు. ముందుకు పోతే ఫోర్తు హాస్టలు. తర్వాత ఫస్టు హాస్టలు—".

ఫర్లాంగు ఫర్లాంగు నిడుపున వెనుక భుజంలేని చతురశ్రాలలాగా, మూడంతస్తుల మేడలలో, అడుగడుగునా దీపాలు వెలుగుతున్నట్లు వెలుగుతున్నాయి. అవి దాటిపోతున్నారు.

ఎవరో శర్మను పల్కరిస్తున్నారు. బండి ఆగింది.

"ఏరోయ్ సాంబం!" - శర్మ ఎవరో ఖులాసాగా పల్కరిస్తూ బండి దిగాడు. తనూ బండి దిగి అటు వచ్చాడు.

ఆ సాంబం ఎవరో విచారసూచకంగా మొగంపెట్టి, "పోయిందిరా" అన్నాడు. ఆ సాంబంపరీక్ష కాబోలు ననుకొని ఆ చిరాకులోనూ, కొంత సానుభూతి అనుభవించగలిగాడు రాఘవరావు.

"టోటల్ ఆవరేజ్, తొంభైఎన్మిదిన్నర వచ్చింది. తొంభైతొమ్మిది దలాల్‌ది. ఈ అర మార్కులో పడ్డశ్రమంతా వృథా అయిపోయింది"అని రుద్ధకంఠంతో అంటున్నాడు సాంబం.

మూడురోజులబట్టి తిండి సనిలేక ప్రయాణపు అగచాట్లతో డస్సిపోయి, చేరితే తీరుబడిగా కూర్చున్న కుఱ్ఱవాడు నూటికి తొంభైఎనిమిదిన్నర మార్కులు వచ్చి సానుభూతికి ఆలాపిస్తూంటే, లోపల భగభగ మండిపోయింది.

శర్మమాత్రం పరిపూర్తిగా సానుభూతిని ప్రదర్శిస్తున్నాడు.

"మనం, ఎక్కడికి వెళ్ళాలండి?"అని తొందరపాటుతో, శర్మను అడిగాడు.

"ఇదిగో వెళ్తున్నాం! సాంబం! రూమ్ కొస్తున్నావా ఇప్పుడు?"

"నేను తర్వాత వస్తాను. డూప్లికేట్ తాళం చెవి ఉంది, తీసికో -" అని సాంబం కదలిపోయాడు.

'ఎక్కా' మళ్లీ ముందుకు సాగింది.

ఒక హాస్టల్ భవనం తర్వాత మరో హాస్టల్ భవనం దాటిపోతున్నారు. కొండలలాగే మహాప్రమాణంలో ఉన్న ఆ హాస్టలు భవనాలు అతనికి అడటు కల్గిస్తున్నాయి.

చివరకు బండి ఆపాడు శర్మ. అతనివెంట

(21-వ పేజీ చూడుడు)

వేదయుగమునాటి భారతావని

శ్రీ యద్దనపూడి వెంకటరత్నం

వేదకాలమునాటినుండియు భారత భూమి "భరతఖండ" మని వాడబడుచున్నది.

స్మృతిప్రోక్తమగు సంధ్యావందన కర్మాచరణ సందర్భంలో, "జంబూద్వీపే, భరతవర్షే భరత ఖండే, మేరో ర్దక్షిణదిగ్భాగే" అని సంకల్పించుటలో ప్రదేశనిర్దిష్టము చేయబడినట్లు గానవగును. ఈ వివరణలో, జంబూద్వీప మేదో, భరతవర్ష మెక్కడనో, భరతఖండ మనేదో ప్రత్యేక ప్రత్యేకముగా తెలుసుకొనవలసి యున్నది. "మేరువు" అను పర్వత మొకటి భూమధ్యభాగమం దుండెడి దనియును, దాని చుట్టూ ఏడుద్వీపము లుండెడి వనియును, ఈ ఏడులంకలును, ఒకదానితో మరియొకటి ప్రత్యేక మొక్కొక్క సముద్రముచేత వేరుచేయబడి యుండెడి వనియును, యీ ద్వీపములనే "సప్త ద్వీపము" లనియును వీటిని వేరుచేయు సముద్రములను "సప్తసముద్రము" లనియును వేదములందు, భూగోళపరిమాణ వివరణ సందర్భములో వివరింపబడుతూ వచ్చినవి.

* ఈ సప్తద్వీపములలో జంబూద్వీప మొకటి యనియును, దీనియం దొక "జంబూ" వృక్షముండెడి దనియును, ఆ మహావృక్షము, సదా, అనంతములగు ఫలముల నీనుచుండెడి దనియును, అవి నేలను రాలి అవియుటవలన, వాటినుండి స్రవించు ద్రవము వెల్లువై ప్రవాహవేగమున పారి, సాగరమున గలియుచున్న దనియును, యిట్టి ద్రవముయొక్క ప్రవాహమువలన తడుపబడి, అందు నివసించు ప్రజలు క్షుత్పిపాసలనుండి విముక్తత నొందింపజేసెడి దనియును, ఏతత్కారణమువలన దీనికి జంబూద్వీప మనే నామము కలిగిన దనియును, ఇందులో కొంతభాగమును భరతు డను రాజు పాలించినాడు గనుక, భరతవర్షమను పేరు కలిగినదనుట కూడ స్మృతి సమ్మతమే.

* వీటి వివరములన్నియు శ్రీమదాంధ్రభాగవతముయొక్క పంచమస్కంధమునందు విపులముగా వివరింపబడినవి. దీనినిబట్టి శ్రీ శకుని కాలమునాటికే, భూగోళవిమర్శ యెంత సమగ్రముగా జరుపబడినదో, భారతీయుల విజ్ఞాన మెంత అపూర్వమైనదియును పరిపక్వావస్థ నొందినదో విదితము కాగలదు.

భారతావనియొక్క భూగోళ వివరములను లెస్సగా పరిశోధించి, విమర్శించి, తనచే రచియింపబడిన కావ్యములలో నిక్షిప్త మొనరించిన వారిలో అగ్రగణ్యుడు మహాకవి కాళిదాసు అని పేర్కొనక తప్పదు. ఈతడు, రఘువంశ కావ్యమునందున, అభిజ్ఞాన శాకుంతలయందున, భారత వర్షమును గురించి విపులముగా వివరించియున్నాడు. శ్రీ హర్షుడు కూడ భూగోళవిషయపరిశీలనలో యీతని అడుగుజాడల ననుసరించినాడని, యీయనచే రచియింపబడిన "నైషధ"మను మహాకావ్యమును పఠించినవారికి తేటతెల్లము కాగలదు. వీరుగాక, విఖ్యాతయశోవిశాలురగు ప్రాచీన, సంస్కృత, ఉత్తమకవిసత్తములగు, దండి, భవభూతి, రాజశేఖర, జయదేవ, జగన్నాథ, జగద్ధర, ఉద్భట, కయ్యట, కల్హణ, క్షేమేంద్ర, బాణ, బిల్హణ, భాసమయూర, మమ్మట, మురారి, రత్నాకర, వరాహమిహిర, పతంజలి, నారాయణ, భట్టి, భర్తృహరి, విక్రమ, విశాఖదత్త, శంకర, ఆర్యభట్టాదులు తమచే రచియింపబడిన భూత, భవిష్యద్ వర్తమానముల కుపయోగపడు సాంఘిక, చారిత్రక, అలంకార, సారస్వత, జ్యోతిష, లాక్షణిక, వేదాంతాది విషయములను గురించిన గ్రంథముల రచనలయందు, సందర్భానుసారముగ, వివిధవిషయములను, ఆమూలాగ్రముగ పరిశోధించి, విమర్శించి, వాటివాటి సారములను జొప్పించి, భారతీయులకు చరిత్ర లేదను అపవాదును పూర్వపక్షము గావించి, ధన్యజీవులైనారు. రామాయణ, భారత, భాగవతాది గ్రంథరచయితలగు నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రెగ్గడ, పోతన, మొదలగు ఉత్తమకవిసత్తములుకూడ పూర్వకవుల అడుగుజాడల ననుసరించి, తమ భవిష్యత్ సంతతికి విజ్ఞానధననిక్షేపములను సముపార్జించియుంచినారు గనుకనే, యెట్టి యిక్కట్టుల కెరగావలసివచ్చినను, భారతావని నేటికిని సజీవచేతుస్కులై మనగలిగినది. శ్రీ మహాభారతమునందలి భీష్మపర్వములో, సంజయుడు ధృతరాష్ట్రునకు, భూపరిమాణాది విషయములను గురించి వివరించుటను యించుక సూక్ష్మదృష్టితో విలోకించువారలకు, భారతీయుల పరిశోధన లెంత వీర్యవంతములైనవో, వివరింపబడకనే విశదము కాగలదు. భాగవతమునందు ఒక్క కందపద్యములో, అనగా, "వ్యాప్తింజెందక, వగవక ప్రాప్తంబగు లేశమైన బదివే లనుచుం, తృప్తింజెందని మనుజుడు సప్తద్వీపములనైన జక్కంబడునే?"

ఇట్టి ప్రయోగము లనేకములు గానవగును. అట్టి వన్నియు పౌరాణిక యుగమునాటి 56 దేశముల వివరణమునందు గానవగును.

వర్షము

ఒక్కొక్కద్వీపము, తొమ్మిదివర్షములుగా విభజింపబడినట్లు గానవగును. అవి యెవ్వియన, 1 కురు, 2 హిరణ్మయ, 3 రమ్యక, 4 ఇలావృత, 5 హరి, 6 కేతుమాల, 7 భద్రాఖ్య, 8 కిన్నర, 9 భరత అనునవి అని శిశుపాలవధము కావ్యమునందు వివరింపబడినది.

ఖండము

ఖండ మన నొక ముక్క, వీటినన్నిటిని సమన్వయించి చూచినచో, సప్తద్వీపములలో నొకటియగు, జంబూద్వీపముయొక్క వివిధ భాగములలో నొకటియగు భరతవర్షమునందు, భరతఖండ మొకప్రాంత మని విదితము కాగలదు.

పౌరాణికయుగమునాటి

భరత ఖండము

యీపై ఆరురాజ్యముల సంపుటీకరణ మనియును, దీనిని పాలించెడి చక్రవర్తికి 56 రాజ్యాధీశులును (ఛప్పన్ దేశాధీశులు) సామంతులై కప్పములు చెల్లించుచుండెడివారని, భారత, భాగవత, రామాయణాది పదునెనిమిది పురాణముల గాథలవలనను విదితము కాగలదు - వాటిలో.

1. అంగదేశము—ఇది గంగానదియొక్క కుడిగట్టున వుండెడిది. దీనికి ముఖ్యపట్టణము చంపానగరము. దీనికే అంగపురి యను నామాంతరము కూడ కలదు. గంగానదీ గర్భమం దుండే ఒక రాళ్లగుట్టకు పడమరగా, 24 మైళ్లదూరములో, ప్రస్తుతము భాగల్‌పూర్ అని పిలువబడే గ్రామమున్న చోటునందుగాని, దానిపరిసర ప్రాంతములందుగాని యుండెడి దని, పౌరాణిక గ్రంథములందు వివరింపబడియున్నది.

2 వంగదేశము—ఇప్పటి తూర్పు బంగాళమన్నమాట ఈ రాజ్యములోని, సముద్రము నంటియుండు ప్రాంతము గౌడదేశ మనికూడ పేర్కొనబడేది కొంతకాలమువరకు త్రిపురా (టిప్పిరా)సంస్థానము గోరాజ్ పర్వతశ్రేణియు, వంగదేశాంతర్భాగములై యుండేవి.

3. కళింగ—దీనినే ఉత్కలమని కూడా అంటారు. ఆధునికమునందు ఒరిస్సాయని పిల్చుచున్నారు. ఒకప్పు డిది గోదావరీనది ముఖద్వారమువరకు వ్యాప్తిజెంది ఇప్పుడు ఉత్తరసర్కారు లని వాడెడి జిల్లాలలో కొన్ని కళింగదేశాధీశుని ఆధిపత్యమం దుండెడి దని, దండివిరచితమగు "దశకుమార చరిత్ర" యందు వివరింపబడినది. తూర్పుసముద్రతీరమునకు అనతిదూరమునం దుండే రాజమహేంద్రవరము దీనికి రాజధానినగరముగా నుండెడి దని ప్రతీతి.

4. ఓఢ్ర—తామ్రలిప్తనదికి దక్షిణముగా, కలేననదివరకు వ్యాప్తిచెందియుండెడిదని మహాకవి కాళిదాస విరచితమగు 'రఘువంశ' కావ్యమునం దుల్లేఖింపబడియున్నది దీనికి ముఖ్యపట్టణము పూరిలోనియును, ఇందు సుప్రసిద్ధ జగన్నాథాలయ మున్నది.

5. ఆంధ్రదేశము—గోదావరి కృష్ణానదులకు ఉత్తరదక్షిణ దిశలందును, పడమరనైపున కనుములను, కళింగదేశమునకు సరిహద్దుగాను వుండెడి భూభాగమును ఆంధ్రదేశ మనెడివా రని దశకుమార చరిత్రయందు వర్ణింపబడినది. వేంగీనగరము దీనికి ముఖ్యపట్టణము దీనినే వేగి అని కూడ పేర్కొనుట కలదు.

6. అవంతి—నర్మదానదీతీరమునకు వుత్తరదిశయం దుండేది-దీని ముఖ్యపట్టణము ఉజ్జయినీనగరము. దీనినేఅవంతీపురమని గూ, విశాలయనియు, మహాకవికాళిదాస విరచితమగు మేఘదూతయను కావ్యమునందు వర్ణింపబడినది. ఒకప్పు డిది "సిప్రా" నదీ పరిసరములవరకు వ్యాప్తజెంది యుండెడి దనియును, మాలవదేశమునకు పశ్చిమముగా నుండెడిదనియును, మహాభారత యుద్ధమునాటి, నర్మదానదిలగాయితు, మాహానది ఒడ్డువరకు వ్యాపించియుండెడి దని వర్ణింపబడినది.

7. కామరూప—'సదానర' అను నదీతీరము లగాయతు అస్సాం సరిహద్దునుండి తూర్పుగా హిమవత్ పర్వతములను దాటి చీనాదేశమువరకూ వుండే ప్రదేశము. ఈ దేశాధిపతి, చీనావారును, యితర ఆటవికులును గల యొక సైనిక నివహమును తర్ఫీయతుజేసి, కురుపాండవ యుద్ధములో, దుర్యోధనునకు సహాయముగా పంపెంచినాడని, శ్రీ మహాభారతమునందు వివరింపబడినది. దీని ముఖ్యపట్టణము ప్రాగ్జ్యోతిషి నగరము. బ్రహ్మపుత్రానది కొలిగట్టున వున్నది.

8 ఇంద్రప్రస్థము—దీనినే "హరిప్రస్థ" "శక్రప్రస్థ" అని కూడా అందురు. యమునానదియొక్క కుడి, ఎడమ తీరములనంటియుండు ప్రదేశము ప్రస్తుతము దీనినే "ఢిల్లీ" ప్రాంతమందురు.

9. కాంభోజ—బాక్ ప్రాంతము గిల్గిటు మైదానమునుండి వేరు చేసే, హిందూకుష్ పర్వతప్రాంతము - చిన్న టిబెట్—లాడక్ వరకు వ్యాప్తిచెందియుండేది. ఈరాజ్యము ఉన్నిశాలువలకును, గుర్రములకును ప్రసిద్ధి. ఈదేశపు ప్రజలు, గొర్రెలయొక్కయు, కుక్కలయొక్కయు, ఎలుకలయొక్కయు ఉన్నితో శాలువలు తయారుచేసెడివారని, మహాకవి కాళిదాసు రఘువంశ కావ్యమునందు వర్ణించియున్నాడు

10 కుంతల—హైద్రాబాదునకు ఆగ్నేయముగాను, చోళదేశమున కుత్తరముగానుండు భూభాగము. దీనికి ముఖ్యపట్టణం కల్యాణదుర్గము.

11. కురుక్షేత్రం—ప్రస్తుతపు ఢిల్లీకి సమీపమం దుండెడి విశాలప్రదేశము - కురుపాండవుల రణరంగము - సరస్వతీనది దక్షిణమునుండి, దృషద్వతీనదియొక్క ఉత్తరతీరమువరకూ వ్యాప్తిజెందియుండెడిది దీని ఉత్తరముగా థానేశ్వర మను పట్టణ మున్నది.

దీనిని, శమంతపంచక మనికూడా కవులు వర్ణించినారు. పరశురాముడు క్షత్రియజాతిని హతమార్చి వారి రక్తముతో అయిదు కోనేరులను నింపె పితృదేవతలకు తర్పణమువిడిచినాడని పురాణగాథ యొకటున్నది.

12. కేరళ—కావేరినదికి ఉత్తరమునను, పడమటి కనుమలకును సముద్రతీరమునకును మధ్యన వున్న సన్నని చీలిక. ఇందు వేత్రవతి సారవతి, కాళీనది, దీనిగుండా ప్రవహించుచున్నవి. రఘువంశ కావ్యమునందు వర్ణింపబడిన మురళీ నదీ. కాళీ నదీ - ఉత్తర రామచరిత్రయందుకూడా దీని చరిత్రవర్ణింపబడినది. ప్రస్తుత మీ ప్రాంతమును కనరా యని సంబోధించుచున్నారు. బహుశా యిప్పటివలెకూ, కావేరినదిపైకికూడా వ్యాప్తి నొందియుండి యుండవచ్చును.

13. కోసల—సరయూనదీప్రాంతము - ఇప్పటి గోగ్రాప్రదేశమై యుండవోవును - ఇది అప్పటిలో ఉత్తరకోసల - దక్షిణకోసల, అని ద్విభాగములుగా వుండేది - ఉత్తరకోశలను గౌడదేశ మనికూడ అనేవారు - ఇది అయోధ్యకు ఉత్తరమం దుండేది.

శ్రీరాముని అనంతరము అతని కుమారులగు కుశలవులు, కుశావతిలో నివసించుచూ దక్షిణకోశలదేశమును కుశుడును, శ్రావంతిలోవుండి, ఉత్తరకోశలను లవుడును పరిపాలిస్తూ యుండేవారని శ్రీమద్రామాయణమునందు గానవగును. ఇది వింధ్యారణ్యప్రాంతమం దుండెడి దనికూడా వివరింపబడినది

కుశావతీ లేక కుశసథలి - దక్షిణకోశలము - నర్మదానదికి ఉత్తరముగాను, వింధ్యపర్వతములకు దక్షిణముగానువుండు ప్రదేశము - ఇప్పటి బండుల్‌ఖండుదేశముయొక్క మధ్యభాగ యుండవోవును. ఏలనన, కుశస్థలిరాజును, రాజశేఖరకవి, "మధ్యదేశనరేంద్రా" యని సంబోధించియున్నాడు.

14 కులూత—జలంధర్ డిల్లా ప్రదేశమునకు ఈశాన్యదిశయం దుండెడిది - శతద్రు అనగా యిప్పుడు, సట్లెజ్ అనే నదీతీర మన్నమాట. ఇప్పు డీ ప్రదేశమును "కుట" యని పేర్కొందురు.

15. కేకయ—కేకయులకు నివాస స్థానము-సింధుదేశము నానుకొనియున్నది.

16 జనస్థాన—దండకారణ్య ప్రాంతమందొకభాగము - ప్రస్రవణపర్వతారణ్యప్రాంతము - నాశికకు రమారమి 2 మైళ్ళదూరమందుండి, పంచవటి అని వాసిగాంచిన ప్రాంత మిదే.

17. తామ్రపర్ణి—ఈ నదీనీరముచే తడుపబడు ప్రాంతము. ఇది మలయపర్వతములలో పుట్టి, తిరునెల్వేలిజిల్లాగుండా ప్రవహించి మన్నార్ సింధుశాఖలో కలియుచున్నది. దీనికి తామ్రవారి అనే నామాంతరముకూడ కలదు.

18. కౌశాంబి—దీనినే మత్స్యదేశ మనికూ అంటారు అలహాబాదునకు 30 మైళ్ల ఎగువ దున్న కొసాం దేశము.

19 జలంధర—శతద్రు - (సట్లెజ్) నిపాశ (బియాస్) నదుల నీటిచే తడుపబడుచున్న ప్రదేశము.

20 కౌశికి—ఇదియొకనది పేరు. దర్భంగాకు తూర్పుగాను. భాగల్‌పూరుకు ఉత్తర దిశగాను, పూర్ణియాకు పడమర దిక్కుగాను, ప్రవహించు జలభాగముల మధ్యప్రదేశము. ఇందు విఖ్యాతయశుడగు ఋశ్యశృంగుని ఆశ్రమము వుండెడిది.

21 చేది—ఈదేశమునందలి ప్రజలను దేశస్థు లని పేర్కొనెడివారు. వీరికి దేవలు లనియు, త్రిపుర లనియుకూడ నామాంతరములు కలవు - ఒకప్పు డీ దేశపు ముఖ్యపట్టణము త్రిపురి. సెంట్రల్ యిండియాలోని బండుల్ ఖండు దేశము యిందులోనిదే యనివాడుక - జబ్బల్‌పూర్‌కు చేరువగానున్న దేరాఘర్ ప్రాంతము అనగా వింధ్యపర్వతములకును, రిక్ష పర్వతములకును మధ్యగావుండు రాజ్యమును, మాహిష్మతీపట్టణమును రాజధానిగా జేసికొని, హయహయులు పాలించినా రని, చరిత్రపరిశోధకులు వ్రాసియున్నారు.

22. చోళ—కావేరినది యొడ్డును చెంత మైసూరు రాజ్యముయొక్క దక్షిణభాగము, కొన్నిచోట్ల కావేరినదిని దాటిన్ని వుండెడి దనిన్ని 2వ పులకేసియను రాజు, కావేరినది అవతలి యొడ్డు నంటియున్న ప్రదేశమును జయించి పాలించినట్లు చరిత్రపఠనమువలన గానవగును. ఇటీవల దీనినే కర్నాటకమని పేర్కొనచున్నారు.

23. త్రిగర్త—ఇదియొక నిర్జల ప్రదేశము, శతద్రు (సట్లెజ్)నదికి తూర్పుగాను, సరస్వతి - సట్లెజ్ నదులకు మధ్యగాను, లూధియానా పాటియాలా పట్టణములకు నడుముగాను వుండు యెడారి ప్రదేశము.

24. దశార్ణవ—దశార్ణవనది ప్రవహించు దేశము. మాలవదేశమునకు తూర్పు దిశయందున్నది - దీనికి ముఖ్యపట్టణము విదిశ. ఆధునికులు దీనినే భిల్సా అని పేర్కొనుచుందురు. వేత్రవతీనదీతీరమం దున్నది - మహాకవి కాళిదాసు మేఘదూత యను కావ్యమునందు చేట్వానదీ బియాస్‌నదితో కలియుచోటనుంచి ప్రవహించిన నదిని విదిశగా వర్ణించియున్నాడు. బాణుడు కాదంబరియందుకూడ దీని ప్రసక్తిని దెచ్చియున్నాడు.

25. ద్రవిడ—కృష్ణానదికిని పోలేరు నదకును మధ్యగానుండే అరణ్య ప్రదేశము - గోదావరి నదికి, దక్షిణంగా వుండే తూర్పుసముద్రతీర ప్రదేశము - కావేరినదే సరిహద్దు - దీనికి ముఖ్యపట్టణము కాంచీనగరము - దీనినే కంజీవరమని కూడా అంటారు - ఇది మద్రాసు నగరమునకు 42 మైళ్ళ దూరమునం దున్నది.

(19-వ పేజీ చూడుడు)

ద్రవ్యానికి ధరఎంత?- మీరు కట్టగలిగినంత!

[ఐ. ఏ. ఆర్. వైలీ]

సకల అనర్థాలకీ మూలం ధనం అన్నారు. సత్యం ఏమిటంటే, మనలో చాలామంది ధనార్జనకోసే జీవితమంతా వెచ్చిస్తారు ధనార్జనలోనే వారి మనస్సు లగ్నమై ఉంటుంది. కొందరు ధనంకోసమే ప్రాణాలు తీస్తారు. కొందరు తమ ప్రాణాలు తీసుకుంటారు.

వాస్తవానికి మనం ధనాన్ని ఎలా వినియోగిస్తున్నామో, ధనార్జన కేమి చేస్తామో అదే తెలుపుతుంది మన మంచిచెడ్డలు. మన ఔదార్యం, లోభం, నీతి, అవినీతి, వివేకం, అవివేకం, మన విచక్షణజ్ఞానం దాన్నిబట్టే తెలుస్తాయి.

అయితే నిజంగా మనం ధనంవల్ల పొందగోరే దేమిటి? సౌఖ్యం, భవిష్యత్తులో నిశ్చింత, మనం కోరగల వనుకుంటాను.

కాని సౌఖ్యం అనేది మాయాపరిష్కృతమైనది. అందీ అందకుండా ఉంటుంది. భోగవిలాసాల విషయం వేరు. వానిని కోరి ఆర్జించవచ్చును. అనుభవించడానికి వీలైనవి. వాస్తవ సౌఖ్యంమాత్రం విచిత్రమైన వస్తువు. వివేకవంతులే దాని నాహ్వానించి అనుభవించగలరు. కొందరికది అయాచితంగా లభిస్తుంది. నాజీవితంలో ఎన్ని అత్యంతసౌఖ్యవంతమైన క్షణాలు కీసం పరిశ్రమ లేకుండా లభించాయి


ఒకప్పుడు నేను చాలా చిక్కుల్లో పడ్డాను. నాకష్టాలు వినిపింపుకునే ఒక మిత్రుని ఇంటికి వెళ్లాను. అతనూ నాలాగే కష్టాల్లో ఉన్నాడు. అతని ఇంట్లో సన్నని మెట్లెక్కి పైకి వెళ్లాను. మెట్లవద్ద నిలబడి చూశాను. ఎదురుగా ఒక పెద్ద కిటికీ ఉంది. అందులోనుంచి దానిమ్మమొక్క కొమ్మ ఒకటి కనపడింది. కొమ్మనిండా ఎర్రని దానిమ్మపువ్వు లున్నాయి. గాలికి కొమ్మ మెల్లిగా ఊగులాడుతోంది. అంటే అది చూస్తూ నిలబడిపోయాను. ఈ నిరాడంబర సహజ సౌందర్యాన్ని చూసి ముగ్ధుడ నయాను. నాలో ఆనందాలు ఉబికాయి. అప్పు డనుకున్నాను నాలో, "వాస్తవంగా ఆనందం అంటే ఏమిటో ఇప్పటికి తెలిసివచ్చింది. ఇంకెప్పుడూ అసౌఖ్యం నన్ను పీడించదు." నాఆర్థికసమస్యలన్నీ ఏమూలపడ్డాయో తెలియదు. ఆ చిక్కులన్నీ అలా నిర్లక్ష్యం చేసిన తరువాత వాటంతట అవే విడిపోయాయి.

పుట్టుకలోనే గ్రుడ్డి, చెవుడు, మూగ అయిన ఒక బాలికకు ఒక స్త్రీ ఈవిధంగా తెలియ చెప్పింది. "ప్రపంచంలో ఉత్కృష్టవస్తువులు, అత్యంతసుందరవస్తువులు కంటికి కనిపించవు. తాకడానికి కూడా వీలుండదు. అవి హృదయానికి మాత్రమే అనుభవైకవేద్యాలు."

మనలో వచ్చిన అనర్థకం ఏమిటంటే మన పెంపకంలో ధనార్జన, ఆస్తిపాస్తుల సంచయం జీవితలక్ష్యాలనీ సార్థకాలనీ మనకి నేర్పిపెట్టారు. ఇటువంటి పాఠంబోధించడం, అలవరించుకోవడం కూడా సులువే. ఒక ఇల్లు, ఒకతోట సంపాదించుకుని చక్కని దుస్తులు ధరించి సుఖంగా ఉండమని పసిబిడ్డలకి చెప్పడానికి పెద్ద శ్రమ అనవసరం. ఆ బిడ్డల మనస్సుకి సులువుగా పట్టుతుంది. కాని జీవితానికి పరమావధి సౌఖ్యమే కాబట్టి, ఆ సౌఖ్యం ప్రాపంచికసంపదలపై ఆధారపడి ఉండదనీ, ద్రవ్యం సౌఖ్యాన్ని కొనిపెట్టలేదనీ బోధించడం కష్టం.

సౌఖ్యం ఉపహార మిచ్చి తెచ్చుకోవాలంటే రాదు. హృదయాన్ని విప్పి ఒకరిని ఆదరించినప్పుడే లభిస్తుంది ధనం విలువ తెలుసుకోలేక దుర్వినియోగపరచడంలో, ఆదరం చంపుకోడం అభిరుచిపెట్టు. మన సంపదను మనకే అట్టే పెట్టుకుని తలుపులు బిగాయించి కూచుంటే, అతి ఆకలితో దీనంగా మన ఇంటివైపు చూసి నిట్టూర్పు విడిచి వెళ్లిపోతాడు. భాగ్యవంతునికి స్వర్గం దుర్లభం అని క్రీస్తు ప్రభువు చెప్పాడు. అంటే భాగ్యవంతునికి సౌఖ్యం అనుభవించే సామర్థ్యం ఉడిగిపోయిదని ఆమాటల అర్థం. ప్రాపంచిక సుఖాల్ని కూడా అనుభవించలే, ఆ సామర్థ్యాన్ని అతను సంపదకి బలివేశా డన్న మాట. అల్పసంపాదాయంలో దారిద్ర్యం అనుభవిస్తూ, కుటుంబానికి కావలసిన కనీసావసరాలని కొన్నిటిని తలచి, వానిని పొందలేక నిత్యం విచారంలో మునిగిపోయినవా రనేకమందిని మనం చూస్తాం వారు విచారంలో మునిగిపోయి దానిమ్మకొమ్మని గమనించలేరు. సమీపంలో సంచరించే మిత్రుల మందహాసం చూడలేరు.

ఈమధ్య ఒకసారి బస్తీ వెళ్లాను అక్కడ ద్రవ్యానికి విలువ జొత్తిగా పడిపోయింది అక్కడ ధనానికి కొనే శక్తి తరిగిపోయింది. కలవారికి ఉన్నదానితో కోరినంతా కొనుక్కోడానికి రాదు. ఏది చూసినా కరువుగానే ఉంది. తిండీ బట్టాకూడా కోరినంతగా లభించవు. వినోదాలలో కూడా తృప్తి కలగదు.



రక్షణమంత్రి బలదేవసింగ రాజపుటానా రెజిమెంటులో 62 ఏండ్ల వయస్సు గల వాడగు సుబేదార్ జస్వంతసింగుతో కరచాలనము చేస్తున్నారు.

ద్రవ్యానికి లేని మూల్యాన్ని కట్టి ఊహించుకోడంలో అలౌక రీతీ అవలంబిస్తారు. నదిలో మునిగి చచ్చిపోయిన ఇద్దరి కథ మనకి తెలుసును. ఇద్దర్నీ నదిలోంచి ఒడ్డుకి తీసినతరవాత చూస్తే ఇద్దరిదగ్గరా నెరొక వెయ్యిరూపాయిలనోట్ల కట్టా కనిపించాయి. ఇద్దరిలో ఒకడు కడు పేదవాడు. అకస్మాత్తుగా లాటరీలో వెయ్యిరూపాయలు లభించింది. ఆనందం భరించలేక తప్పతాగి తూలుతూ, నదిఒడ్డుకి వచ్చి, ప్రమాదవశంవల్ల నదిలో పడి మరణించాడు. రెండోవాడు లక్షాధికారి అకస్మాత్తుగా సర్వం నష్టపడ్డాడు. మిగిలిన వెయ్యిరూపాయలతో సహా నదిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకరికి వెయ్యిరూపాయలూ అత్యధిక మయింది. మరొకరికి అతిస్వల్పమయిపోయింది. అకస్మాత్తుగా ధనం లభించడం, అకస్మాత్తుగా ధనవిహీను డవటం వారి మనస్థితుల్నీ చెదరగొట్టి చివరికి దుర్మరణానికి హేతువులైనాయి. ద్రవ్యం వారికి మృత్యువు తెచ్చిపెట్టలేదు. ద్రవ్యాన్ని గురించిన వారి ఊహాలూ, ప్రమాణాలూ మృత్యువును తెచ్చిపెట్టాయి. ఏవస్తువులైతే లేకలేక అలమటించాడో అవి లభ్యంకానున్న సమయానికి ఒకడు, ఏవస్తువుల నికనుంచి లేకుండా గడపాలో అవి తల్చుకుని ఒకడూ మరణించారు.


ధనంకోసం ఈ తాపత్రయానికి మూలకారణం భవిష్యత్తును గురించిన చింత. అదృష్టదేవత చంచలబుద్ధినుంచి మనల్ని ధనమే కాపాడుతుం దని భావిస్తాం. ఉవ్వెత్తున వచ్చే వరదల్ని అరికట్టడానికి ఇసుకమూటలు అడ్డువేసినట్లు, ధనాన్ని పేర్చడానికి తాపత్రయపడతాం.

నాకు అప్పు పేరు చెప్తే విపరీతమైనభయం. నాతండ్రి ధనాన్ని వెర్రిగా వెచ్చించేవాడు. అనుభవించినప్పుడు ఇంద్రభోగం అనుభవించేవాళ్లం. తరువాత అమీను వచ్చి ఇల్లు చక్కబెట్టి జప్తుచేసేవారు. ఇంట్లో ఏమీ మిగిలేదికాదు. చిన్నతనంనుంచీ దీనివల్లనే అప్పుఅంటే నాకు చాలా భయం పట్టుకుంది. పదహేడో ఏటనే జీవనోపాధికి వెతుక్కునే అవసరం నాకు కలిగింది. చిన్నజీతంతో మాష్టరుపనికి కుదిరాను. అది సరిపెట్టుకోడానికి వీలయేది. కాని వ్యయం తగ్గించుకుని ద్రవ్యం కూడబెట్టాలా, లేక ఉన్నదానిని భోగాలకు వెచ్చించాలా అనే సమస్య చాలకాలం బాధించింది. రెండూ కాని మధ్యమార్గం అవలంబించాను. కొంత కూడబెట్టి మిగతాది ఖర్చుపెట్టాను. ఇంకా కూడబెట్టాలి. ఇంకా కూడబెట్టాలనే వెర్రిలో పడలేదు ఏక్షణానికైనా ఏవస్తువుపైనా మనసు కలిగితే కోరిక తీర్చుకున్నాను కాని, లోలోన అణిచిపెట్టుకోలేదు. సుఖభోగాల్ని చంపుకోలేదు. అప్పటినుంచీ నేను చిక్కుల్లో పడలేదు. ఒక్కొక్కప్పుడు భోగవాంఛ, ఒక్కొక్కప్పుడు ధనం కూడబెట్టాలనే లోభం నన్ను ముప్పిరిగొనేవి. కాని రెండింటికీ పూర్తిగా లొంగలేదు. రెండింటినీ దూరాన ఉంచి మధ్యమార్గం అనుభవించడం మొదట కొంత కష్టంగానే ఉంది. కాని ఉత్తరోత్తరా అలవాటయింది.

జీవితం నిజానికి ఎప్పుడూ భద్రంగా ఉండదు. అందరం ఒక విధంగా భాగ్యవంతులమే. ఒక విధంగా దరిద్రులమే. ధనం కూడబెడుతున్నామనే భావం, కూడబెట్టినందువల్ల కలిగే అహంకారం కృత్రిమమైనవి. అప్పుడు ధనానికి లేని మూల్యం కట్టబెడతారు. కానీ, జీవితంలో ద్రవ్యానికి ఉచిత స్థానాన్ని ఇచ్చి, దాన్ని అంతమూరంలో ఉంచితే - దానంతదానికి విలువ లేదనీ, కేవలం ప్రమాణం పెద్దదనిపించడానికే దాన్ని కూడబెట్టకూడదనీ, అది కేవలం మారకంమాత్రమేననీ గ్రహించగలిగినప్పుడు—అది అధికంగా ఉన్నా, లేక అల్పంగా ఉన్నా వివేకంతో, మనస్థైర్యంతో పరిస్థితిని గ్రహించి తగినట్లు ప్రవర్తించగలుగుతాం. అప్పుడు సౌఖ్యానికి భంగం కలగదు.



మోటారులో దంతవైద్యశాల :—ఆరుగురు రోగులకు చాలిన వెయిటింగ్ గది, సర్జరీ, యక్సరే యంత్రపరికరాలూ, సర్వసాధనాలతో సంపూర్ణమయిన ఈమోటారు దంతవైద్యశాలను, బ్రిటన్ కెంటురాష్ట్రంలో పిల్లలకు ఇళ్ల సమీపంలోనే వైద్యం చేసేందుకు వీలుగా తిప్పుతున్నారు. చిత్రంలో డాక్టరూ, నర్సూ, పిల్లలను ఆస్పత్రిలోకి పంపుతున్నారు.



చౌ. ఎ. న్. లై. మొసే-టుంగ్ చూ-టే.

చీనాలో కొత్త పరిపాలన

ఆర్థికంగా ఇతర రాజ్యాలపై ఆధారపడకూడదని కమ్యూనిస్టుల నిర్ణయం

చీనాలో కమ్యూనిస్టుల విజయం దాదాపు పూర్తిఅయినట్లే. ఇంక దేశపరిపాలనలో వారు పెద్దపెద్ద మార్పులు చెయ్యడానికి నడుము కట్టారు. కొత్త పరిపాలనగురించి స్టేట్స్మన్ పత్రిక విలేఖరి యీక్రిందివివరాలు తెలుపుతున్నాడు.

ఈ శతాబ్దంలో చీనాలో సంభవించిన ప్రతి విప్లవం అనంతరం, పరిపాలనలో ప్రతిమార్పు అనంతరం. పాశ్చాత్యవిధానాల ననుసరించాలనే ధోరణి పరిపాలకులలో కానవస్తోంది. పాశ్చాత్యదేశాల్లో అమలు జరిగిన కార్యక్రమాలనే ముఖ్యం, నలభైఏళ్లతరువాతచీనాలో అమలు జరుపుతున్నారు. పాశ్చాత్యదేశాల్లో అనుభవాల్ని అర్థం చేసుకొని వారి పొరపాట్లను దిద్దుకోవాలనే యత్నం చీనాలో కనుపించదు. ఇప్పటి కమ్యూనిస్టుల విధానంకూడా అంతే. రష్యాలోని అనుభవాలను చీనా కమ్యూనిస్టు లంతగా గమనించినట్లు కనిపించదు. రష్యన్లు 1917 లో ఎక్కడనుంచి కార్యక్రమం ప్రారంభించారో ఇప్పుడు చీనాకమ్యూనిస్టులు సరిగ్గా అక్కడే ప్రారంభిస్తున్నారు.

ప్రొలిటేరియట్, పీడిత కార్మికవర్గం పరిపాలనాధికారంలోకి వచ్చినట్లు ప్రజ లందరికీ సుస్పష్టంకావడానికి పైపై ఆడంబారాలన్నీ ఉండాలనే చాదస్తపు పట్టుదల కనిపిస్తోంది. దానికి చీనాలో పేరు న్యూడెమోక్రసీ. చలికాలంలో సామాన్యంగా వాడే నీలిరంగూ నల్లరంగూ కాని మధ్యరంగు ముతకబట్టలు ధరించడం న్యూడెమోక్రసీలో ఫేషన్. సన్నని మెత్తని దుస్తులు ధరించడం పీపింగ్‌లో ఇదివరలో ఫేషన్. ఇప్పు డది మారిపోయింది. మాసిన ముతకబట్టలు కట్టుకు తిరుగుతున్నారందరూ.

పీపింగ్ నగరం:

తిరిగి రైళ్లునడవడం ఆరంభించగానే వానిలో తరగతిభేదాలు రద్దుపరిచారు. ఇప్పుడు రైళ్లలో అన్నిపెట్టెలూ ఒకటే తరగతి. పైతరగతి పెట్టెల్లో పరుపు లూడతీసేశారు. భాగ్యవంతుల భాగ్యం హరించి చాలకాలమైనప్పటికీ చక్కని మోటారుకార్లు వీధుల్లో కనిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ప్రజల సొత్తు. ప్రజల ప్రతినిధు లని చెప్పుకునేవా రిప్పుడు ఆ కార్లు ఉపయోగిస్తున్నారు. పీపింగ్‌లో భోగవిలాసాలకు తావైన రెండు పెద్దహోటళ్లు ఇప్పుడు కమ్యూనిస్టుఆఫీసర్లకి ఉపయోగపడుతున్నాయి.

పూర్వచక్రవర్తుల రాజభవనాలలో ఆధునిక సౌకర్యాలన్నీ ఏర్పాటుచేస్తే పీపింగ్‌లో రెండో క్రెమ్లిన్ తయారు కాగలదు.

ఇప్పుడు అధికారుల ఉపన్యాసాలలోనూ, పత్రికల్లో వ్యాసాల్లోనూ ప్రజాస్వాతంత్ర్యం, దాస్యవిముక్తి అనే మాటలు తరుచు వస్తున్నాయి. పీపింగ్, టీంట్సిన్ నగరాల ప్రజల్ని బంధవిముక్తుల్ని చెయ్యడం ఆ ప్రజల అదృష్టమనే విషయాన్ని పదేపదే చాటుతున్నారు. ఇప్పుడీ నగరాలు ప్రజలవి. ఫాక్టరీలు కార్మికుల సొత్తు. విశ్వవిద్యాలయాలు విద్యార్థులకి చెందుతాయి. ప్రభుత్వం ప్రజలది ఇప్పుడు ప్రభుత్వం ఏది చేసినా ప్రజల హితంకోసమే. పూర్వస్వేచ్ఛాభావప్రకటన విధానం నిలుపుకోడానికి యత్నించిన ఒక పత్రికను కమ్యూనిస్టు ప్రభుత్వం తోసివేసింది. ఈ సందర్భంలో ప్రభుత్వ ప్రచారం చేసే ఒక పత్రిక ఈ విధంగా విచిత్రవ్యంగ్యంతో వ్రాసింది. ప్రజల పత్రికల్ని ప్రజలభావప్రకటనా స్వేచ్ఛను కాపాడే నిమిత్తం, ప్రభుత్వం విపవ వ్యతిరేకులభావప్రకటనా స్వేచ్ఛను అరికట్టి వారి పత్రికను మూసివేసింది."

విజ్ఞాన విప్లవం:

పత్రికలు, రేడియో, సినిమాలు అన్నీ కమ్యూనిస్టుల ఇష్టానికి లోబడుతున్నాయి. వానిని అధికారులు తమ కనుకూలంగా నిర్వర్తింపచెయ్యడానికి తగు రీతిని సంస్కరిస్తున్నారు. పూర్వవార్తాపత్రికల్లో చాలా మూసివేయబడినయ్. ప్రభుత్వప్రచారానికి ఇప్పుడు ప్రధానాంగమైన "పీపుల్స్ డెయిలీ" అనే దినపత్రిక నిండా ఇప్పుడు కేవలం ప్రచారంతప్ప ఇంకోటి కనిపించదు. ప్రచారవ్యాసాలు నాయకుల ఉపన్యాసాలు వివరాలు, ఆనందముగ్నులైన రైతులు కూలీల అభినందనవాక్యాలు తప్ప ఈ పత్రికలో పీపింగ్‌నగరంలో పరిస్థితి ఎలా ఉందో, చీనాలో ఇతర ప్రదేశాల్లో పరిస్థితి ఎలా ఉందో, ప్రపంచ వార్తలేవో ఏమీ ఉండవు. రష్యానుగురించీ, టాస్ వార్తాసంస్థ తంతివార్తలూ తప్ప ఇతర వార్తలేలేవు. దీనికి ఫలిత మేమిటంటే ప్రజలు వార్తాపత్రికలు చదవడం మానేశారు. అయినా అధికారపత్రికకి ఇంకా అమ్మకం అధికంగా ఉందంటే కారణం సంస్థలూ సంఘాలూ అన్నీ విధిగా కొనితీరాలని ప్రభుత్వం నిర్బంధించడం, ఎవ్వరైనా కొంటే, దాన్ని ఇంట్లో బాగా ప్రదర్శించదగినచోట పెట్టిఉంచడానికి మాత్రమే.

అమెరికన్ సినీమాల్నీ, అమెరికన్ సంగీతాన్నీ పూర్తిగా నిషేధించారు. సోవియట్ సినిమాల్నే ప్రదర్శించాలి. దీనివల్ల సినీమా హాల్స్‌కి రాబడి పడిపోయింది ప్రచార నాటకాల్ని విధిగా వెయ్యాలనే నిర్బంధం విధించబడినందువల్ల, పూర్వం జనంతో కిటకిటలాడే నాటకమందిరాల్లో కూడా ప్రేక్షకుల సంఖ్య పడిపోయింది. పీపింగ్‌లో పూర్వం ప్రఖ్యాతి పొందినవి రాత్రి నృత్యాలు ఏర్పాటు చేసే పెద్ద రెస్టారెంటులు. ఇప్పు డవి మూసివెయ్యబడినాయి ఇప్పుడు పీపింగ్ నగరంలో రాత్రి నృత్యాలు నిలిచిపోయాయి. కొమింటాంగ్ అధికారులు వీనిని నిషేధించినందువల్ల కాబోలు తెరువవచ్చునని కమ్యూనిస్టులు అనుజ్ఞ ఇచ్చారు. అయినా అక్కడ సామాన్యప్రజలకి నిషేధం ఉండకూడదని ఆజ్ఞఉన్నందువల్ల వాని అందచందాలు పోయాయి.

ఆర్థిక పరిస్థితి:

ఉత్తరచీనాలో అంతర్యుద్ధం అంతరించి మూడుమాసాలుపైగా గడచినప్పటికీ అక్కడ ఆర్థికపరిస్థితి చక్కపడలేదు. ఇంకా జీవనం కష్టంగానే ఉంది. ఇన్ఫ్లేషన్ ఇంకా ప్రజల్ని పీడిస్తూనే ఉంది. ధరల పెరుగుదల నింక అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మున్సిపల్ వాణిజ్య సంస్థ ఒకటి స్థాపించింది. ఈ సంస్థ స్థాపించే శాఖల్లో అవసరవస్తువుల్ని మార్కెట్ ధరలకి కొద్ది తక్కువగా అమ్ముతారు. అయినా పరిస్థితి చక్కబడలేదు.

వాణిజ్యం స్తంభించిపోయింది. దుకాణాలన్నీ ఖాళీగా ఉన్నాయి. దాదాపు వర్తకం అంతా వీధుల్లో తిరిగేవారివల్ల జరుగుతోంది. పెద్దదుకాణాదార్లు కూడా తమ సరుకుల్ని కూలీల కిచ్చి వీధుల్లో తిప్పి అమ్మిస్తున్నారు.

ఇప్పుడు కమ్యూనిస్టుల అధీనంలోని ప్రాంతంలో రాకపోకలపైన నిషేధం తొలగిపోయింది. విదేశీయులుతప్ప చీనాదేశీయులంతా స్వేచ్ఛగా ప్రయాణాలు చేయవచ్చును. ఉత్తరంనుంచి అనేకమంది పీపింగ్, టీంట్సిన్ నగరాలకి వస్తున్నారు. ఎవరు చెప్పినా ఒకటే కథ. మొదట కొంత పరిస్థితి మారుతుంది. అప్పుడు కొంచెంమేలుగానే ఉంటుంది. తరవాత వ్యాపారం చప్పబడుతుంది. చివరికి ఫాక్టరీలు మూసివేస్తారు. ముడిపదార్థాలు లేక పరిశ్రమలు మూతపడతాయి. జీతాలు పెంచాలని కార్మికు లడుగుతారు. పన్నులు హెచ్చుతాయి.

ముఖ్యంగా ఆహారం కొరత బాధిస్తోంది. రైతులు ధాన్యాన్ని ఇతర అవసరవస్తువులకి మారకంగా ఇస్తారే కాని ధనానికి అమ్మరు. కొన్నిప్రాంతాల్లో దీపాలకి వేరుసెనగనూనె, నువ్వుల నూనె ఉపయోగిస్తున్నారు. చీనాభాషలో కిరసనాయలుకి "విదేశీనూని" అనే పేరుంది కాబట్టి అది ఉపయోగించకూడదట. కిరసనాయిల్ పరప్రభుత్వదాస్యానికీ సూచనలు. ప్రస్తుతపరిస్థితుల్లో కిరసనాయిలు కరువై ప్రభుత్వం ఈప్రచారం చేస్తోంది

ఉత్తరచీనాలో జొన్న ముఖ్య ఆహారమయింది. పెద్ద నగరాల్లో కూడా జొన్నే తింటున్నారు. గోధుమకావాలంటే వారు దిగుమతి చేసుకోవలసిందే. అందువల్ల జొన్నపైనే ఉత్తరచినాలో ప్రజలు ఆధారపడవలసివస్తోంది జొన్నల్ని మారకంగాకూడా వాడుతున్నారు. కూలీల కూలీ, ఉద్యోగుల జీతాలు విద్యార్థులు చెల్లించే జీతాలు, అధ్యాపకులికి జీతాలుకూడా జొన్నల్లోనే చెల్లిస్తున్నారు. వారు జొన్నల్ని తీసుకోవచ్చును. లేదా తీసుకుని కరెన్సీనోట్ల కింద ఆరోజు నున్నధరప్రకారం మార్చుకోవచ్చును డిపాజిట్లు వృద్ధికావాలనే ఉద్దేశంతో వేతనాల్ని బాంకు చిట్టాల్లో గోధుమపిండి లెక్కనో వస్త్రంలెక్కనో చేరుస్తారు. డిపాజిట్ చేసేవారు ఏ రూపంలో డిపాజిట్ చెయ్యాలని కోరతారో ఆరూపంలోనే చేరుస్తారు. అప్పటి మార్కెట్ రేటుతో వ్రాస్తారు. డిపాజిటర్లు ఆ ధర ప్రకారం విలువకట్టుకుని కావలసినప్పుడు బాంక్‌లోనుంచి ధనం తీసుకోవచ్చును.

తరుచు సమావేశాలు సభలు జరుగుతాయి. ఈ సభలకి నాటకకర్తలు, నటకులు, వ్యాసకర్తలు మొదలైనవారంతా వస్తారు. అక్కడ న్యూడెమోక్రసీ, న్యూకల్చర్ (నూతన విజ్ఞానం) అంటే ఏమిటో వారందరికీ నూరిపోస్తారు. ఉన్నత విద్య అంతా పూర్తిగా సంస్కరించబడుతోంది. పూర్వకళాశాలలు, విశ్వవిద్యాలయాలు రద్దవుతున్నాయి. అవన్నీ రాజకీయ, మిలిటరీ, వైజ్ఞానిక శిక్షణ కేంద్రాలుగా మారుతున్నాయి ఇవన్నీ చివరికి ప్రజావిప్లవవిశ్వవిద్యాలయంలో ఐక్యం కాగలవు.

కార్మికులు:

పీపింగ్ నగరంలో కార్మికులంతా కమ్యూనిస్టులకోసం తహతహ లాడారు. ఉత్తరచీనాలో భూమిఅంతా రైతుల కేవిధంగా పంచారో విని, నగరంలోని పెద్దపరిశ్రమల పెట్టుబడి, ఫాక్టరీల్ని కూడా అదేవిధంగా కార్మికులకి ఒప్పగిస్తారని ఆశపడ్డారు. కాని కమ్యూనిస్టులు వచ్చిన తరవాత వారి ఆశ నిరాశ అయింది. భూమిని పంచితే ఫలం వృద్ధిఅవుతుకదిగాని, పెద్ద పరిశ్రమల పెట్టుబడిని పంచిపెడితే ధనం నిరర్థకం అవుతుందని కమ్యూనిస్టులు కార్మికులకి చెప్పారు.

టీంట్సిన్‌లో ఒక ఫాక్టరీలో కార్మికులు తమ పరిస్థితి మరీ అర్థాన్నంగా ఉందని కమ్యూనిస్టులికి చెప్పుకున్నారు. ఇదివరలో గోధుమపిండి దొరికేది. ఇప్పుడు జొన్నపిండి ఇస్తున్నారు. ఇప్పుడు కార్మికుల్ని దాస్యవిముక్తుల్ని చేశారు. కాబట్టి ఫాక్టరీ ఇకనించి వారిదేననీ, అందువల్ల ఫాక్టరీలో పరిస్థితుల్ని గురించి ఫిర్యాదు చెయ్యకూడదనీ వారి అధికారులు సమాధాన మిచ్చారు. అయితే ఫాక్టరీని యజమానులకే ఇచ్చివేసి తిరిగి గోధుమపిండినే ఇవ్వవలసిందని కోరుతున్నట్లు కార్మికులు చెప్పారట.

ఈ మార్పులు ప్రజలకి తృప్తికరంగా ఉన్నాయని చెప్పలేం. ప్రచారాన్ని విశ్వసించేవారు బహు కొద్దిమంది. అధికారుల్తోగాని, కార్మికయజమానుల్తోగాని తగవులు రాకుండా చేసుకోడానికి వారు సభలకీ, సమావేశాలకీ, మిలిటరీ శిక్షణకీ వెడతారు. దుకాణదార్లు, చిల్లర వర్తకులు నిత్యం భయంతో కృశించిపోతున్నారు. ఇతర ప్రదేశాలనుంచి వచ్చిన వార్తల్ని బట్టి, ఇంకా పీపింగ్‌లో కమ్యూనిస్టుల అసలు వైఖరి బయలుపడలేదని వారికి తెలుసును. ఇప్పటి మిలిటరీ అధికారం

(21-వ పేజీ చూడుడు)

మన రాష్ట్రం మన దేశం

★ దేశంలో ఆహారపరిస్థితి: ప్రభుత్వకార్యక్రమాలు

మన రాష్ట్రంలో ఆహారోత్పత్తివృద్ధికార్యక్రమాలను గురించి రాష్ట్రప్రభుత్వంతో చర్చించడానికి భారతప్రభుత్వ ఆహారశాఖామంత్రి శ్రీ జయరాందాస్ దౌలత్ రాంగారు ఈ వారం చెన్నపట్నం వచ్చారు. 1951 వ సంవత్సరంతో ఆహారం విషయంలో మనదేశం స్వయంపోషకం కావడానికి కేంద్రప్రభుత్వం రెండు సంవత్సరాల ప్రణాళికలు, అయిదు సంవత్సరాల కార్యక్రమాలు తలపెట్టింది. 1951 వరకూ ఈ కార్యక్రమాలకోసం ధనం పెట్టుబడికి కేంద్రప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. ఆ తరవాత రాష్ట్రప్రభుత్వాలే ఈ కార్యక్రమాల నిర్వహణకు బాధ్యత పూర్తిగా వహించవలసిఉంటుందని దౌలత్ రాంగారు ఇదివరలోనే స్పష్టంగా చెప్పారు.

1951 సంవత్సరానికి దేశాన్ని స్వయంపోషకం చెయ్యడానికి రాష్ట్రప్రభుత్వాలతో చర్చలు జరిపి కేంద్రప్రభుత్వం కొన్ని కార్యక్రమాలు నిర్ణయించింది. ఈ కార్యక్రమాల్లో బీడుగాపడిఉన్న భూముల్ని ఆయకట్టులోకి తేవడం ముఖ్యమైనది. ఉన్న నీటివసతుల్ని వృద్ధిపరిచీ, కొత్తగా చెరువులు, బావులు తవ్వీ, ఖుల్ డోజర్లు, ట్రాక్టర్లను రైతులకు అద్దెల కిచ్చి కొత్తగా భూమిని సాగుచెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమం సక్రమంగా అమలు జరిపితే, రెండేళ్లలో మన ఆహారంకరువు తీరిపోతుందని దౌలత్ రాంగారు ఇదివరలో చెప్పారు.

ఆహారోత్పత్తి విషయంలో చెన్నరాష్ట్రమే అన్నిరాష్ట్రాలకంటె చాలా వెనుకపడి ఉందని దౌలత్ రాంగారు చెన్నపట్నంలో చెప్పారు. అందువల్ల చెన్నరాష్ట్రంపట్ల దౌలత్ రాంగారు ఇతరరాష్ట్రాలకంటె అధికశ్రద్ధ వహిస్తున్నారని తలచవచ్చును.

మన కార్యక్రమం ఇదేనా?

ఈ ఇన్నిలక్షల ఎకరాల్ని కొత్తగా సాగులోకి తెస్తే ఇన్నిలక్షుల టన్నుల ధాన్యం అధికంగా పండించవచ్చును. కాబట్టి మనదేశంలో నిత్యం ఉంటున్న ఇన్నిలక్షల టన్నుల కొరత రెండేళ్ళలో తీరిపోతుదన్నారు. ఇదంతా కేంద్రప్రభుత్వ ఆహారశాఖవారు తయారుచేసిన లెక్క. తీరా మొన్న దౌలత్ రాంగారు చెన్నరాష్ట్రప్రభుత్వ కార్యాలయంతో చర్చలు జరిపినప్పుడు చూస్తే లెక్కంతా తప్పని చల్లగా చెప్పారు, మన ఆహారశాఖా కార్యదర్శి.

చెన్నరాష్ట్రంలో చిన్నచిన్న నీటివసతులు కొత్తగా కల్పించి, ఉన్నవి బాగుచేసి వేలైన విత్తనాలు రైతుల కందుబాటులో అమ్మి, ఎరువులు కూడా సప్లై చేస్తే, పదైనిమిది, పందొమ్మిది కోట్ల రూపాయల ఖర్చుతో అదనంగా 20లక్షల టన్నులు బియ్యం పండించవచ్చునని అంచనా వేశారట. ఆ తరవాత "సెక్రటరీలు" పరిశీలించి చూస్తే పదిపన్నెండుకోట్ల రూపాయలు వచ్చినా ఒకటిన్నర లక్షల టన్నుల బియ్యంమాత్రం అదనంగా పండించడానికి వీలవుతుందని తేలిందట. ఎక్కడ 20 లక్షలు, ఎక్కడ ఒకటిన్నర లక్షలు!

ఇదేనా ప్రభుత్వ విశ్వాసం?

"కేంద్రప్రభుత్వ కార్యక్రమాలు చూసి రాష్ట్రప్రభుత్వాలకు ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. రాష్ట్రప్రభుత్వాల ఈ దృఢవిశ్వాసం వల్లనే మన ఆహారసమస్య రెండేళ్లలో పరిష్కారమైపోతుంది." అన్నాడు దౌలత్ రాంగారు. అదనంగా పండించగలిగేది ఒకటిన్నరలక్షలో, 20 లక్షలో సరిగ్గా చూడలేని ప్రభుత్వోద్యోగుల కార్యక్రమాల్లో ప్రజలకెలా నమ్మకం కలుగుతుంది? అసలు రిక్లమేషన్ కార్యక్రమాల్ని పరిశీలించి నిర్ణయించలేదనీ, కేవలం ఊహపై ఆధారపడి నిర్ణయించారనీ సెంట్ జార్జికోటలో చర్చలో ప్రభుత్వోద్యోగులు తెలిపారు. తరవాత "సెక్రటరీల అంతస్తులో" విషయాన్ని పరిశీలించగా ఊహంతా ఊహమాత్రమేగాని వాస్తవపరిస్థితులకి అనుగుణంగాలేదని తేలిందట.

అయితే పకోధన జరుపుతూనే కార్యక్రమాన్ని అమలు జరపవచ్చునని దౌలత్ రాంగారు సూచించారు. అప్పుడు ఛీఫ్ఇంజనీరు అసలు కార్యక్రమాన్ని అమలు జరపడానికి గల ప్రతిబంధకాలేమిటో వివరించారు. జీపులు చాలవు, యంత్రాలు చాలవు, సిబ్బంది లేదు వగైరా. అన్నిటికీ పైన కుడిమరమ్మతు పద్ధతి పెద్ద ప్రతిబంధకం. చివరి చిక్కునైతే రాష్ట్రప్రభుత్వం తొలగించగలదుగాని, మిగతావి సాధించడం దుర్ఘటం.

చివరికి దీనిమీద ఈ సమావేశం చేసిన నిర్ణయం—ఒకటిన్నరలక్షల కంటె అధికంగా పండించలేరు కాబట్టి సిబ్బందిని, యంత్రపరికరాల్ని పాత అధికాహారోత్పత్తి కార్యక్రమాల్ని విడిచిపెట్టి చెరువుల మరమ్మతులికి పంపవలసిన అవసరం లేదని.

పంట చెరువులు:

చివరికి మైనర్ ఇరిగేషన్ కార్యక్రమాల్లో చెరువుల మరమ్మతులు వెనకపడ్డాయి. డెల్టాలు కాక ఇతర ప్రాంతాల్లో నదులలోనుంచి కాలువలు తవ్వడానికి ఎక్కువ ప్రాధాన్య మిసారు. తరవాత వాగులుకి, ఆ తరవాత పంట చెరువుల ఆయకట్టులో నూతులు తవ్వడానికి, ఆఖర్ని మంచి నీటిచెరువులకి ప్రభుత్వం గ్రాంట్లు ఇవ్వడానికీ నిర్ణయించారు. ఈకార్యక్రమం పేరు పంటచెరువుల కార్యక్రమం. ఈకార్యక్రమంలో రాయలసీమ కెంత లబ్ధి ఉంటుందో తెలియదు.

అధికాహారోత్పత్తి కార్యక్రమం:

తరవాత అయిదు సంవత్సరాల అధికాహారోత్పత్తి కార్యక్రమం గురించి చర్చించారు. పబ్లిక్ వర్క్సుశాఖకి సంబంధించినంతవరకూ 1951 సంవత్సరాంతానికి రెండున్నర లక్షల ఎకరాల్ని కొత్తగా ఆయకట్టులోకి తేవచ్చును ఇందులో మొదట్లో అనుకున్న 50 వేల టన్నుల కంటె పైన ఇంకా 65 వేల టన్నుల ఆహారం పండించవచ్చుట.

వ్యవసాయశాఖకి సంబంధించిన కార్యక్రమం చర్చకు వచ్చేసరికి విత్తనాల పెంపకంలో కష్టాలన్నీ ఉద్యోగులు తెలిపారు. రాష్ట్రంలో మంచి భూములన్నీ ఇదివరకే సాగులో ఉన్నాయనీ, విత్తనాలకోసం మళ్ళీ వెయ్యాలంటే మనరాష్ట్రంలో భూములసారం చాలా తక్కువనీ చెప్పారు. దౌలత్ రాం గారికి మన రాష్ట్రంలో పంటబావుల స్కీముగురించి వివరాలు తెలిపారు. ఈస్కీము నిర్వహణపైన అజమాయిషీకి పెద్ద సిబ్బంది ఉందని చెప్పారు. అజమాయిషీ ఎంతచక్కగా నడుస్తోందో కిందటి సంవత్సరం లెక్కలు చూస్తే తెలుస్తుంది. సబ్సిడీలివ్వడంలో కాంగ్రెస్ మురారాజకీయాలవల్ల పని సక్రమంగా నడవడంలేదని రైతులంటారు. ఉద్యోగుల జాప్యంగురించి అందరికీ తెలిసిందే. రైతులు సబ్సిడీ ధనాన్ని దుర్వ్యయంచేస్తున్నారని ఉద్యోగులంటారు. ఇవన్నీ నిజమేనని అనుభవంవల్ల తెలుస్తున్న విషయం.

రామపాదసాగరం:


రామపాదసాగరం గురించి పత్రికావిలేఖరులడిగినప్పుడు, ఈ ప్రాజెక్టుని ఇప్పుడు నిర్వహించడం అసాధ్యమన్నారు. అయితే ఆహారసమస్య పరిష్కారమైనప్పుడు ఈ ప్రాజెక్టు నిర్మించే విషయమై ఆలోచించగలరట. పెద్ద ప్రాజెక్టులవల్లగాని మనకి ఆహారసమస్య పరిష్కారం కాదని కేంద్రప్రభుత్వం గ్రహించడానికి ఇంకా కాలం పట్టుతుంది. ప్రత్తి, వేరుసెనగ, చెరుకు మొదలైనవన్నీ వృద్ధిచెయ్యవలసిన అవసరం ఉందని గ్రహించడానికి ఒక సంవత్సరం పట్టింది. దేశవిభజన తరవాత ముడిపదార్థాలన్నీ మనకి లోపమైనాయి. ఇప్పుడు వరి గోధుమ పంటలు వృద్ధిచెయ్యాలంటే ప్రత్తి మొదలైనవి తగ్గించుకోవలసిన అవసరం కలుగుతుంది. తగ్గించవచ్చుననుకున్నారు. పొగాకు మొదలైనవాటిని తగ్గించడానికి ప్రయత్నం చేశారు. ప్రత్తిపంట ప్రమాణాన్ని నిర్ణయించి ధాన్యపుపంట హెచ్చించాలని చూశారు. అప్పుడు కాని ప్రత్తిపంటని తగ్గించడానికి వీల్లేదు సరిగదా, వృద్ధిచేసుకోవలసిన అగత్యం ఉందని తెలిసిరాలేదు. దేశవిభజనవల్ల మన పరిశ్రమలు, పంటలు, ఖనిజోత్పత్తి మొదలైన వేరీతిగా మారాయో ఇంకా పూర్తిగా తెలియడం లేదని ప్రభుత్వోద్యోగులు, మంత్రులు ఒప్పుకుంటూనే ఉన్నారు.

చెన్నరాష్ట్రంలో పరిశ్రమాభివృద్ధి క్రమాన్ని చూస్తే విద్యుచ్ఛక్తి అవసరం తెలుస్తుంది. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి బాగా వృద్ధిఅయిన తమిళ జిల్లాల్లో వస్త్రపరిశ్రమ బాగా వృద్ధిఅయింది. గనుల్లో కోలార్ బంగారు గనితప్ప దక్షిణాదిని పెద్ద గనులే లేవు. ఆంధ్రదేశంలో ఖనిజపరిశ్రమ అభివృద్ధి కావడానికి అపారమైన అవకాశాలున్నాయి. అయితే వీటికి విద్యుచ్ఛక్తి అవసరం.

తరవాత మనరాష్ట్రంలో వ్యవసాయానికి విద్యుచ్ఛక్తి ఎంత అవసరమో ఇంకా ప్రభుత్వం గుర్తించలేనట్లుంది. తమిళజిల్లాల్లో విద్యుచ్ఛక్తి నూరింట పదివంతులు మాత్రమే వ్యవసాయానికుపయోగిస్తున్నారు. వ్యవసాయానికి విద్యుచ్ఛక్తిని ఉపయోగిస్తేగాని రాయలసీమలో నీరు లభించడం దుర్ఘటం.

పంటచెరువులున్నా, కాలువలు తవ్వినా తాత్కాలిక ప్రణాళికల్లో కూడా పంట కావలసినంతగా వృద్ధికావడం అసంభవం. మన రాష్ట్రంలో నీటివసతి కి పంటకాలువలు, ఇప్పుడున్నవానికి రెండురెట్లైనా వృద్ధికావాలి. అప్పుడే వాన దేవుడికోసం చూస్తూ కూర్చోడం తప్పుతుంది. పంటకాలువలు వృద్ధికావడానికిగాని, వ్యవసాయానికి విద్యుచ్ఛక్తి లభించడానికిగాని, ఆంధ్రదేశంలో పరిశ్రమలు అభివృద్ధి కావడానికి గాని, రామపాదసాగర ప్రాజెక్టు అవసరం. రామపాదసాగర ప్రాజెక్టునిర్మాణం కావిదే ఆహారసమస్య పరిష్కారంకాదని నిక్కచ్చిగా చెప్పవచ్చును. ఆహార సమస్యా పరిష్కారం ముందో, రామపాదసాగరనిర్మాణం ముందో

(21వ పేజీ చూడుడు)



భారత ప్రభుత్వ ఆహారశాఖామంత్రి గా. శ్రీ జయరాందాసు దౌలత్రాంగారు చెంగల్పట్టు జిల్లాలోని పోరూరు చెంబరంబాకం చెరువులను తనిఖీ చేయుచున్నారు.

గాజుసరకు-దాని చరిత్ర, ఉపయోగాలు

శ్రీ వి. పాల్‌ప్రసాదరావ్

గాజుసామాను త్వరగా పగిలిపోతుంది: చూడ్డానికి సున్నితముగా కనుపిస్తుంది. వాడటానికి శోభనుగా ఉంటుంది; తుప్పు పట్టదు, మైలా పేరుకోదు. మందూ త్రాగుట కుపయోగిస్తుంది; మజ్జిగ పుచ్చుకుంటానికీ 'శేష్'గా ఉంటుంది. పట్టుకుంటే కాఫీ వేడనిపించదు. వేసిన ఐస్ డ్రింక్‌తో చేయీ వణకదు. అందుకనే కొద్ది నష్టం ఉన్నా, లాభాలు మించినయ్ గనకనే, చాలమంది ఈ గాజు గ్లాసులూ, పాత్రలూ, లోటాలూ, పళ్లాలూ వాడుతున్నారు. మరి ఆడవాళ్ల సంగతి ఇక చెప్పనక్కర లేదు గదా! చదువునుబట్టి, ఫ్యాషన్ రీతిగా, రంగుకు సరిపోలేటట్టు, కోకకు కన్ను మార్చేటట్టు, రంగు గాజులూ, రవ్వగాజులూ, మెలికెగాజులూ, మెరిసేగాజులు, ముద్దగాజులూ మురిసేగాజులూ, మట్టిగాజులూ, లొట్టగాజులూ, ఫ్యాషన్ గాజులు, పగిలిపోయే గాజులు, ప్రేమగాజులూ వలపుగుత్తులూ, పందెపుగాజులు, అందెలగాజులు.. ఎన్నో వాడుతారు. రసాయనిక శాస్త్రజ్ఞులు, రసాల్ని పచ్చడిపట్టడానికి, ఆమ్లాల్ని అదుపులోనుంచడానికి, గాజుపాత్రలకు, జాడీలకు మించిన మేటీలు లేనంటారు. భౌతికశాస్త్రజ్ఞులు, కర్ణాలకూ, కటకాలకూ, గొట్టాలకూ గోమేధికాలకూ ఇవే వాడుతారు. శాస్త్రపరిశోధనలో, బట్టిలపాత్రలకు, లంకెగొట్టాలకూ, వంకమెడబుడ్లకు, సరిపోయే సీసాలకు, తబుకులకూ తట్టలకూ అన్నిటికీ ఇదే సాటించారు. ఇంత విరివిగా వాడుతున్నామే ఇదంతా మనదేశములో తయారుచేస్తున్నామా అంటే, "లేదు" అని కఠినంగా చెప్పవలసివస్తుంది. సంయుక్తపరగణాల్లో, బెంగాలులో, బొంబాయిలో మైసూరులో గాజు ఫ్యాక్టరీలున్నా, లక్షలకొలది టన్నులు బరువులుగల గాజు సామాన్ని, విదేశాలనుండి తెప్పించుకుంటూనే యున్నాము.

దేని సంగతన్నా ఎత్తితే దాని పుట్టుపూర్వోత్తరాలు, ముందువెనకలూ చెప్పవలసిన విధానం మన దేశంలో ఉంది. యూఫ్రేటీస్ నదీ ప్రాంతాన్ని త్రవ్వి పురాణశాస్త్రతత్వజ్ఞులు 4500 సంవత్సరముల నాటి గాజుఫ్యాక్టరీని బయటకు లాగారట. ఈజిప్టుదేశంలో 3500 సంవత్సరములక్రితమే, "అమర్నా" అను ప్రదేశములో గాజుఫ్యాక్టరీ పనిచేసిందట. మూడు వేలసంవత్సరములకు పూర్వమే గాజును మూసలో వేసి పోతపోసేవారటగాని ఊపిరి ఊది గుండ్రటిపాత్రలు తయారుచేసే బ్లోపైప్ అప్పటికే వాడుకలో లేదట. అస్సీరియాదేశస్థుల ఇటుకరాతిశాసనాలను పరీక్షించి, వాటిలో గాజుచేసే విధాన ముదాహరింపబడ్డదని పెద్దలు చెప్పారు. గ్రీసుదేశస్థులు, వారి తరువాత రోము దేశస్థులూ, ఈజిప్టుగాజునే చాలకాలము వాడినట్టుంది. మొదటిశతాబ్దము వచ్చునప్పటికి, రోము ప్రాంతములో గాజుతయారీ మొదలెట్టింది. రోమను సామ్రాజ్య అంత్యకాలమునకు, ఫ్రాన్సు, స్పెయిన్, రైను ప్రాంతములకు, ఈపరిశ్రమ ప్రాకినట్లగపడును. మొదటి లేక రెండవ శతాబ్దమున చేసిన గాజుపాత్రయొకటి ఇప్పుడు, లండను వస్తుప్రదర్శనశాలలో ఉందట. ఏదో గోరీలో దొరికిందట. దీనిపేరు పోర్టులెండ్ వేస్ అంటారట. మూడవశతాబ్దమునుండి ఈపరిశ్రమ ఏమైనదో ఎవరికీ తెలియదు. తర్వాత 11-14 శతాబ్దాలలో అరబ్బు ఎనామెల్ గాజు, త్రాగే పాత్రలకూ, ముఖ్యంగా మసీదులలో వెలిగించు దీపాలకూ ప్రఖ్యాతి గాంచింది. 13-18 శతాబ్దాలలో నకిలీకళ, వెన్నిస్ పట్టణస్థులదగ్గర యభివృద్ధిగాంచి, యల్లికపని, యంటుపని, పూతపని, యెనామెల్ పనితో కూడా మెరుగు పెట్టిన, గాజుకుసామానూ, కిటికీలకు వేయు గాజు, కటకములు మొదలైనవి తయారైనవట. 16-17 శతాబ్దములలో అద్దముల యుత్పత్తి యతిలాభకరంగా పరిణమించింది. బ్రిటిష్‌వారు కట్టెలపొయ్యి యలవాటుల త్రోసిపుచ్చి రాతిబొగ్గుకొలిమిని వాడ మొదలెట్టారు. మూస పాత్రలనూ వాడుకలోకి తెచ్చారు. పరిశోధన చేసి 1670 లో సీసపు గాజు "ఆంగ్లేయ స్ఫటికగాజు" తయారు చేయగలిగారు. ఈ మార్పులవలన స్వచ్ఛమైన గాజు లభించింది. హెచ్చు లావుగ పోయ వీలైంది; కోరిన నమూనా చెక్కుటకు వీ లేర్పడింది. చూచుట కందంగాను, రానురాను చౌకగాను లభించుటవలన వెన్నిస్ గాజు వ్యాపారం పడుకుంది. జర్మనీలో సోడాగాజు బదులు పొటాసియమ్ గాజు తయారీలో కొచ్చింది. దీనితో, వీరు కటకముల తయారీలో, చూపుకు సంబంధించిన యుపకరణములలో నుత్తీర్ణులై విజ్ఞాన సంబంధ పరికరముల యుత్పత్తిలో లోకములో నగ్రస్థానము వహించగలిగారు. యుద్ధానంతరం ఈ స్థానం కోల్పోయారు. అమెరికా సంయుక్త పరగణాలలో గాజు పరిశ్రమ యభివృద్ధి గాంచింది. వీరు గాజు ఫ్యాక్టరీలలో పని, యంత్రసహాయాన చేయ మొదలెట్టి, అధికోత్పత్తికి మార్గము చూపారు. ఒకన్న మంత్రంతో బుడ్లు పోతపోయడమే కాక, కరగించుయంత్రాలను, మూసకట్టు యంత్రాలనూ, ఊపిరిపోసే యంత్రాలనూ, చెక్కుడు, నొక్కుడు యంత్రాలనూ ఉపయోగించి, అన్ని సరకు లతిశీఘ్రముగ, సునాయాసముగ, విరివిగ చేయు పంథా తొక్కారు. విజ్ఞానశాస్త్రములో "చూచు" యంత్రములకు సంబంధించిన కటకములు, దూరదర్శిని, సూక్ష్మదర్శిని, కాంతివిశ్లేషిణి పరికరములు, పరిశ్రమలో వినియోగించు కొలతమానములు నిర్ణీతగాజు సామానులను రసాయన శాస్త్ర వినియోగార్థ ముపయోగించు సరకునూ ఎగుమతి చేస్తుందీ దేశం. గాజు తయారొనరించు యంత్రాలను, జపాన్, చైనా, ఆస్ట్రేలియాకూ, దక్షిణ అమెరికాకు అమ్ముంది. ఇంగ్లాండుదేశమూ ఈ అధికోత్పత్తి పద్ధతులను వినియోగిస్తుంది. బెల్జియము మేలైన అద్దములనూ కిటికీగాజునూ తయారుచేస్తుంది. జెకోస్లావేకియా రంగురాళ్లను రంగూను వజ్రాలనూ తయారుచేస్తుంది.

మన దేశంలో, సింహళంలో 2300 సంవత్సరములకు పూర్వమే రాజు ఊరేగేటప్పుడు ముందద్దనుండే ఉత్సవం ఉండేదట. శిథిలమైన బౌద్ధ మఠప్రాంతాలలో గాజు ముక్కలు కనుపిస్తవి. 16-17 శతాబ్దములనుండీ మన దేశమున గాజుపరిశ్రమ మొదలిడింది. ముందు స్త్రీల గాజులూ, సీసాలు చేయ మొదలెట్టారు. కాని రెండుమూడు శతాబ్దములు స్తంభించి, గృహపరిశ్రమగానే ఉంది. 1890 నుండి నవీనపద్ధతుల నవలంబించి కొంత గృహపరిశ్రమగాను, మరికొంత ఫ్యాక్టరీ పరిశ్రమగానూ తయారై, సంయుక్త పరగణాలలో, ఫిరోజాబాద్ ప్రాంతాన నాటుకుపోయింది. బెనారస్ విశ్వవిద్యాలయమున గాజుపరిశ్రమ పరిశోధన శాఖ పెట్టిన తరువాత, ఆ ప్రాంతాల ఫ్యాక్టరీలలో సున్నితపు పనిచేసే, నవీనయంత్రాలను పొందుపరచారు. దీనివల్ల రసాయన శాస్త్ర సంబంధ గాజు సామానలు, పరిశోధనకు సరిపోవు గాజు సామానలూ తయారులోనికి వచ్చినవి ఇదివరకు జెకోస్లవేకియానుండి దిగుమతి చేసికొనే, మెరుపుగాజులు, గీతగాజులు, వంకీ గాజులు, లంబాడీగాజులు, చిత్రవిచిత్ర రంగు గాజులూ ఇక్కడే తయారగుచున్నవి. జపాను సరకూ వచ్చుట క్షీణించిపోయింది. మన ఇండియాలోని తక్కిన ప్రాంతాలలో చిమ్నీలు సీసాలు, బల్లమీద పెట్టుకునే బరువులు, సిరాబుడ్లు, కిటికీగాజు తయారగుచున్నది. చీరాల దగ్గర తెల్లఇసుక ఈ పరిశ్రమకు పనికివస్తే, త్వరలో ఒక గాజుఫ్యాక్టరీ మన ప్రాంతంలోనూ వెలుస్తుంది. చేతితో చేసే గాజు సామనలో, అతి సున్నిత చెక్కుడు, శిల్పనైపుణ్యము, అంతులేని భేదములూ చూపెంప వీలున్నది. ఫ్యాక్టరీ గాజుతో, స్వచ్ఛమైన గాజు, నవీనాకారాలతో విరివిగా లభించే గ్లాసులు లభిస్తున్నవి. ఏ రోడ్డున చూచినా గాజు సామాను విక్రయమే. కంచు, వెండి పాత్రలతో పాటు గాజుపాత్రలు వాడని నవనాగరికకుటుంబమే లేదుకదా! నిమ్మరసానికి, డ్రింకులకు కాఫీకి, హోటల్సులో ఏదో ఒకసారైనా ఉపయోగించని దెవరూ? ఇండ్లు పెద్దవైనవి. కిటికీలు పెద్దవైనవి - ఎక్కువ వెలుతురూ కావాలి, గనక కిటికెగాజు, ఫొటోఅద్దాలు విరివిగ వాడుతున్నాము. ఏమూలన చూచినా కండ్లద్దాల్! సాపువే. చత్వారమెక్కువైనదో, చదువెక్కువైనదో, చూపు తక్కువైనదో, చురుకెక్కువైనదో అంచనాలు కుదరలేదు. వీధులలో అమ్మే కెంపులు గోమేధికాలు, మాణిక్యాలు వజ్రాలూ సీసము, యిసుకా కరగిన గాజు గుజ్జుతో తయారైన రాళ్లే! వెండిరంగున బంగారురంగున మెరిసే గాజుసామానుని (టిఫెనీతళుకుసరకును) రాగి, వెండి, బిస్మత్, అభ్రకమూ వాడి ఆ మెరుపు తెస్తారు. ముందునూరేళ్ళు రోకళ్లు, సరిగా పాకానికి రాని గాజే! "పగలని" గాజును మోటారుడ్రైవరుముందుండు గాజుకు ఉపయోగిస్తున్నారు. ఇప్పటి ప్లేస్టిక్ వచ్చి గాజును కొద్దిగ పడత్రోసింది. గడియారపు అద్దాల బదులు ప్లాస్టిక్ వచ్చింది. గాని గాజంత స్వచ్ఛం లేదు. గాజుని వేడినూనెలో పెట్టి, వత్తిడితో నొక్కి బిరుసెక్కించి, పడవలకు కిటికీసందులుగ ఉపయోగిస్తున్నారు. ఈ గాజును కోయుటకు వీలులేదట! బరువులు మోయగలగు గాజు యిటుకలతో ఇండ్లు కడుతున్నారట. ముక్కలచుట్టూ, గాజుపూత పూసి చిన్న చిన్న పురుగు లెక్కి చెట్లను పాడుచేయకుండ చేస్తున్నారట. గాజు సన్నగ తీసి బట్టలు నేస్తున్నారు. సిల్కువలె ఉంటుందట. బట్టలారవేసే తాళ్లు పేనుతున్నారు. చెక్కపనిమీద గాజు కప్పవేసిన నిప్పు ప్రమాదముండదు. కోడిగుడ్లమీద పూస్తే, గుడ్లు త్వరగా చెడదట. గాజు కుంచెలూ చేస్తున్నారు. గాజురద్దును వేడి లేక చలి ప్రాకకుండునట్ల ఇంజనులలో పెడతారట. గాజుగుజ్జుతో బరకకాగితాలు చేస్తారని అందరికీ తెలిసిందే; గాజుగుడ్లను బొమ్మకండ్లకూ ఉపయోగిస్తారు. వస్తుప్రదర్శనశాలలోని పిట్టల గుడ్లు, ఇండ్లలోని ఫలితలలోని కండ్లూ, లొట్టపడ్డ మనిషి నేత్రాలూ దీనితో తయారైనవే. కొన్నిచోట్ల సర్కస్‌గుడారాల గుడ్డగా ఉపయోగించారట. రాత్రి చేయు ఫీట్సుతోపాటు గగనమండలి తారలూ కనుపడేవట. కనిపించని గాజు, వేడిని రానివ్వని గాజు, అల్ట్రావైలెట్ కిరణాలను రానిచ్చే గాజు, పగలని గాజు, వంగని గాజు, భవిష్యత్తులో విరివిగ లభిస్తవట. చూచారా మానవ తెలివితేటలు, పరిశోధన, ముందంజ?

పెండ్లి-ప్రేమ

శ్రీ జోస్యుల సూర్యనారాయణమూర్తి

పెండ్లి సంతతి సంబంధమును అవిచ్ఛిన్నంగా ఉంచటానికి సాధనం. తల్లిదండ్రులు చేసికొన్న పెండ్లివల్ల పుత్రుడు జన్మించాడు. అంటే తండ్రి పుట్టాడన్నమాట. అందుకే భార్యకు జాయ అని పేరు. ఆ పుత్రుడు మళ్లీ తల్లిదండ్రుల్ని పున్నామ నరకంలోంచి తప్పిస్తాడు. అందుకే వాడికి పుత్రుడని పేరు. మళ్లీ ఇదే కార్యక్రమం అతనికి కూడా జరగనై యుంటుంది. ఇదీ ఆ వివాహము యొక్క ఆశయం. ఈ మాదిరిగా అది ఆ సంబంధానికి అవిచ్ఛిన్నత్వాన్ని కల్పిస్తోంది. ఇట్టి వివాహం పవిత్రమైన సంబంధం అని, పూర్వులూ అన్నారు, మనం అంటున్నాము. ఇంక ఈ మధ్య మనకి ప్రేమ అనే మాట ఒకటి వచ్చిపడింది. ఇది తరచుగా అన్నిటిలోనూ వాడతాం. కాని దీని ఆచరణ రూపం కామంగా ప్రత్యక్షమవుతోంది. పూర్వానికీ ఇప్పటికీ తేడా అది. అందుచేతనే మన ఆధునిక నాగరికతా ప్రపంచంలో వివాహం దుష్టసంస్థగా మారింది. అయితే ప్రేమ అనేది అప్పుడూ ఉంది ఇప్పుడూ ఉంది. ఇంక పెండ్లికి ముందా వెనకా అనేదాని మీద చర్చలు సాగుతున్నాయి. ఇక్కడ కాస్త నిదానించాలి. పూర్వం పెండ్లికి తరువాత ఏర్పడీదది ఇప్పుడు ముందది ఏర్పడ్డాకే పెండ్లి చెయ్యాలనీ మన ఊహ. అది కాదని కొందరూ. ఇది ఒక మాదిరిగా ప్రమాదకరం. అది ఒక మాదిరిగా ప్రమాదకరం. ఇది ఒక రీతిని లాభదాయకం; అది ఒక రీతినీని. మరెల్లాగ?

అంటే—ప్రేమ అనేది ఒకసారి కల్పించుకుంటే ఏర్పడదు. మనం అనుకొనే ప్రేమ యథార్థంలో కామం. యథార్థమైన ప్రేమ పసిహృదయాలకి తెలియదు. ఆ బాధ్యత మనది. అంటే మనం ప్రేమించాలని కాదు. పెండ్లి చేసేటప్పుడే వాళ్లు ప్రేమ కలిగి ఉండే వాతావరణం కల్పించాలి. అల్లాంటి సంబంధం చెయ్యాలి అని అర్థం. అన్యోన్యం వాళ్లు చూచుకుంటే తప్పు లేదు. అల్లా చెయ్యాలి కూడా. మన పిల్లవాడి యొక్క లేక మన పిల్ల యొక్క అభిరుచులు మనం గుర్తించే స్థితిలో ఉండాలి. ఆ విషయంలో మన యిష్టం వచ్చినట్టు వాళ్ల అభిరుచులు కల్పించ కూడదు. సహజంగా మన అభిరుచులే పిల్లలకీ ఏర్పడతాయి. అదే సంప్రదాయం అంటే. అట్టి సంప్రదాయాన్నే గుర్తించి సంబంధం కుదర్చటానికి ప్రయత్నించాలి. మార్పులుంటే గుర్తించాలి. తిరస్కరించ కూడదు. తెలియ జేయాలి. అది వినికిడివల్ల ఏర్పడ్డదీ కృత్రిమమైనదీ కాకూడదు. అంతా యథార్థ జగత్తులో ఉండాలి. అట్టి సంప్రదాయాలు ఏకమార్గంలో ఉన్న వాళ్లకి పెండ్లి చెయ్యాలి. ఇందులోనే శ్రద్ధా కార్య చాతుర్యం చూపించాలి. అంతేగాని 'నూరు కల్లలాడి ఒక పెండ్లి చెయ్యమన్నారు' అనే వాళ్లని విశ్వసించకూడదు. పూర్వపు ఆచారాలను అర్థంచేసుకొని వాటిని కాలానుగుణంగా మార్చుకోవటంలో తెలివి ఉంది. అంతేగాని కాలానికి క్రొత్త సంప్రదాయమే కల్పించ నక్కరలేదు. పిల్లలు ప్రేమించుకుంటున్నారు. కాని అది ఎల్లాటిది? అని వివేచన చేస్తే ముప్పాతిక మూడువీసాలు వాళ్లప్రేమ కామం. కనకనే వాళ్ల సంబంధంకూడా ముందు ముందు విచ్ఛిన్నమై పవిత్రప్రేమను ధ్వంసం చేస్తున్నట్లు కనిపిస్తోంది. నిజానికి అది ప్రేమ కాదుగా!

'సమాన శీలవ్యసనేషు సఖ్యం' అనే సూక్తి గుర్తించాలి. "ఇంతకీ వాళ్ల రాత" అనేది నిజమేమో? అయినా ఆ రాతకి మనం కారకులం అవుతున్నాం. చెడ్డచేసినా మంచిచేసినా మనమే. కనుక ఆ విషయాల్లో తప్పు వాళ్లది రెండు పరిస్థితుల్లోనూ కాదు. కట్నాలకీ మన కున్న ముఖమాటాలకీ లొంగి వాళ్లని పాడుచేయటం బహిరంగంగా కనిపిస్తోంటే, "వాళ్లు ప్రేమించుకున్నారు, పెండ్లి చేస్తున్నాం" అని చేసే పెళ్లిళ్లు ఆంతరంగికంగా వాళ్ల జీవితాలని పాడుచేస్తున్నాయి. వాళ్ల ప్రేమ ఎల్లాంటిదో అర్థంచేసుకొనే బుద్ధి మనకి లేకపోవటం దీనికి కారణం. ప్రేమ పెండ్లిఅయిన తర్వాతే వాళ్ల పరస్పర సాన్నిహిత్యానురాగాలవల్ల పెంపొందుతుంది. దాని సంపూర్ణరూపం ఎప్పటికి వస్తుంది? పెళ్లి నాటికి కాదు. పెళ్లయిన కొద్దినాళ్లకీ కాదు. క్రమక్రమంగా పెరుగుతూనే ఉంటుంది. వాళ్లకి కలిగిన సంతానంద్వారాకూడా అది వృద్ధిపొంది సంపూర్ణత్వాన్ని వహిస్తుంది. అయితే ముందు ప్రేమించడం ఎల్లాగ? అసలు దాని స్వరూపం అప్పటికి ఏర్పడదే!



కథానిక:

గాలి మేడ

శ్రీ పి. శ్రీనివాసరావు

ఆడవాళ్లందరూ అంతే!!

డబ్బు, కులం, వర్గం లాంటి విషయాల్లో వాళ్లల్లో విభిన్నత్వ మున్నా, వొక్క విషయంలో మాత్రం ఆడవాళ్లందరూ వొకటే— తన పాపాయి నెవరైనా హేళన చేసినా, అసహ్యించుకున్నా, నిరసించినా, యే స్త్రీ సహించలేదు! తమ పిల్లలు సరిగా పెంచబడలేదనే నిందను స్త్రీలు వోర్చుకోరు. కమల కూడా అలాంటిదే! ఆవిడకు బొద్దుగా వుండే ఆరుగురు పిల్లలున్నారు. విశాలమైన బంగళా వుంది. పైగా స్థానిక స్త్రీల క్లబ్బుకు ఆమె కార్యదర్శిని. ఐనా ఆ రోజు క్లబ్బు కెళ్లకుండా, ఆ విషయంగురించి తీవ్రంగా యోచిస్తూ కూర్చుంది.

ఆ విషయం జరిగి నెల రోజులై వుంటుందేమో! పెళపెళలాడే ఎండలు కాస్తున్న రోజులవి. సాయంత్రంపూట అందరూ క్లబ్బులో టీ పార్టీ జరుపుకుంటున్నారు. సాధారణంగా ఆడవాళ్లకు ప్రియమైన ముచ్చట్లే జరుగుతున్నాయి. ఫలానా అమ్మాయి, అబ్బాయి ఉడాయించారనీ, ఫలానావారింట్లో పెళ్లి దర్జాగా జరగబోతోందనీ......హఠాత్తుగా యెవరిదో కటువైన కంఠం వినిపించింది. తమ పిల్లల మంచి చెడ్డలు మాట్లాడుకొంటున్నవాళ్లు ఆ కంఠాన్ని గమనించలేదు. ఐనప్పటికీ ఆకంఠం ఆగలేదు. పంతంగా స్థాయి హెచ్చించ సాగించింది. యిక వాళ్లు ఆ కంఠాన్ని ఆలకించడంనుంచి తప్పించుకోలేక పోయారు. శిథిల యౌవన లక్షణాలు కలిగిన వొక నడివయస్సు స్త్రీది ఆ కంఠం. కబుర్లన్నీ వొక్క పాటున ఆగిపోయినై. ఆవిడ మాట్లాడుతోంది. అందరూ వింటున్నారు మౌనంగా.

వినడం తప్ప వారి కే గత్యంతరమూ లేదు. "పిల్లలగురించి మాట్లాడుతున్నారా? మీలో యెవరన్నా నా కొడుకును చూశారా? నిజంగా దేవుడిలాంటి పిల్లాడు! అబద్ధం గాదు! చైనా మనుష్యులకుమల్లే చిన్న కళ్లు, యింగ్లీషు పిల్లవాళ్ల కుండే యెర్రటి జుత్తు, యెంతో చక్కటి ముఖం...అసలు మీ రెవరూ వూహించనేలేరు వాడెంత దర్జాగా వుంటాడో! వాడి తెలివి తేటలు చూస్తే మీ గుండెలు చప్పగా ఆగిపోతాయి. పెద్దవాళ్లుకూడ వొకో సమయంలో అంత గంభీరంగా వుండలేరు. అబ్బ! వాడి నవ్వు ముఖ్యంగా చూడాలి. సర్వం గ్రహించినవాడిలాగే నవ్వుతాడు. యిక మాటలు వింటే వాస్తవంగా మనకు మతి పోతుంది. అంత దివ్యంగా వుంటాయి వాడి ముద్దు పలుకులు...!"

ఆవిడ అనర్గళంగా మాట్లాడేస్తోంది...ఆమె ధోరణీ, మాట్లాడేప్పుడు ఆమె కళ్లల్లోని అదో విధమైన మెరుపు, టీపార్టీకి వచ్చిన ఆడవాళ్లనందరినీ గారడీ లాగా, వొక "సస్పెన్స్" సినీమాలాగా, మంత్రముగ్ధుల్ని చేసేసింది. ఆవిడ వాక్యాలు యెంతో ఆవేశపూరితంగా వున్నయ్...కొన్నికొన్ని పదాల్ని పట్టి పట్టి పలకడం, చేతులు యెగరవేయడం, మొదలైన హంగామా ఆమెకు తక్కువలేదు.

"యెన్నడూ దెబ్బలాడి యెరగడు. తన నెవరైనా కవ్వించినా శాంతంగా వుంటాడు. యెవరన్నా కొడితే నా దగ్గర కొస్తాడు వెంటనే! 'నువ్వెందుకు దెబ్బలాడలేదూ? దురాక్రమణకు లొంగకూడదు!' అని నే నంటే వెంటనే జవాబిస్తాడు 'మన మెందుకని దెబ్బలాడాలీ? అంతకంటె తెలివితక్కువ పని లేదు.' అంటాడు. బుద్ధుడు, గాంధీజీలా మాట్లాడుతుంటే నేనే దిగ్భ్రమ చెందేదాన్ని. అయితే వాడు పిరికివాడనుకుంటారేమో?...వుహుఁ...బలంగల పిలవాడెవడన్నా, వూపిరిలేని పిల్లవాడిని హింసిస్తుంటే వెంటనే బలహీనుడికోసం దెబ్బలాటకు దిగి, బలవంతుడికి శాస్తి చెప్పేవరకూ శాంతించడు...మళ్లీ వీడు చూస్తే వొఠ్ఠి బొమికలే!...గొప్ప పురుషులకు మల్లే మా వాడు తన వేషం, ఆహారం విషయాల్లో అంత శ్రద్ధ కనపర్చడు...తన చొక్కా చిరిగి వుండనీ, జుత్తు రేగి వుండనీ, వాడి కావిషయమే పట్టదు— త నేం తింటున్నాడోకూడా వాడు గమనించడు ...వొకో సారి భోజనం చేయడం మర్చిపోయి రోజుల తరబడి అలాగే వుంటాడు! అల్లరి అన్నమాటే లేదు...వాడి మాటల్లో యెంత వివేకం వుంటుం దనుకున్నారు? - అంత గ్రహింపు, ఆ నెమ్మది, దేవతల పిల్లలకే కద్దు! అంత అపురూపమైన కుర్రాడు!..."

ధారా ప్రవాహంగా ఆమె మాట్లాడేస్తోంది... కిక్కురు మనకుండా అందరూ వింటున్నారు. తర్వాత తర్వాత ఆ ప్రసంగం అర్థంలేనిదిగా తోచినా, వింటున్నంతసేపూ యెంతో ఆనందకరంగా, ముగ్ధంగా తోచింది వాళ్లకు... ఆప్రసంగం అయిపోతూనే ఆ "అపురూపమైన కుర్రాడి" తల్లివిషయం యింకా తెలుసుకోవాలని వొకళ్లకు మించిన కుతూహలం వొకళ్లకు కలిగింది. ఆవిడ క్లబ్బుకి రావడం యిదే మొదటి పర్యాయం. అవిడపేరు శశి అనితప్ప ఆమెనుగురించి యితర వివరాలెవ్వరికీ తెలియవు. ఆ "దేవతల పిల్లవాడిని" గురించి యింకా తెలుసుకోవాలనే వారి కుతూహలం. అందుకని వాళ్లందరు అడిగేరు-యేమేమో చెప్పింది ఆమె అన్నీని. అడుగుతున్నారు, ఆమె చెబుతున్నది... చీకటిపడింది యింతలోగా. వొక వేపుచింత, మరో వేపు అసూయా పోగవుతుంటే, అందరూ యిళ్లదారి బట్టారు... అయితే ఆమె మళ్ల రేపు రావాలని ఆహ్వానించడం మరిచిపోలేదు వాళ్లు!

యింటికి వస్తూ కమల ఆ అబ్బాయిగురించే ఆలోచిస్తోంది. యిలాంటి అపురూపమైన పిల్లలు యెలా పుడ్తారు?... తన పిల్లలు! వొఠ్ఠి మొద్దు వెధవలు... యెప్పుడూ అల్లరి, కీచులాట... తన ప్రాణాలు తోడేస్తుంటారు అస్తమానం! అయ్యో దేవుడా! యేంపిల్లలో! తనభర్త బాగా సంపాదిస్తున్నాడు గనక పిల్లలకు ప్రత్యేకంగా వో వేష్టరు... చదువుకోనడం.యూరోపియన్ మిషనరీస్కూల్లో... అయితే యేం! వాళ్ల అవతారాలు వాళ్లచేష్టలు... వొఠ్ఠి రాక్షసి పిల్లలు... ఛీ!... యిలాంటి దరిద్రులకు తల్లి అవడం తన దౌర్భాగ్యం...ఔను! తనని తప్ప యింకెవర్ని అసహ్యించు కోగలరూ?...

* * *

కమల యిల్లు జేరుకుని మెట్లెక్కుతున్నదో లేదో, కీచులాడుకుంటున్న పిల్లల కేకల్తో చెవులు గింగురుమన్నయ్. యింట్లో పనివాళ్లెవరూ లేరు. యిల్లంతా పిల్లల రాజ్యంగా వుంది. యింట్లో భర్తకూడా లేడు. ఆమెను చూస్తూనే అందరూ ఆమెను ముట్టడించారు. బొమ్మలు కావాలని వొకడు, తనని రెండోవాడు గిల్లేడని వొకడు, యేడుస్తో యింకొకడు ... కమలకు పిచ్చెత్తినట్టయింది. యేం మాయదారి పిల్లలురా భగవాన్! అని నిట్టూర్చింది—సామానులన్నీ చిందర వందరగా పడివున్నాయి. గాజు సామానులన్నీ ముక్కలుగా విరిగి చెల్లాచెదరుగా పడివున్నాయి. కమల భరించలేక పోయింది. అందరికీ చురకలు తగిలించి విసుగుతో సోఫాలో కూలబడింది. తిట్టినా, కొట్టినా తనపిల్లలు మారరని తనకు తెలుసు! ఐనా ఏం చేయగలదూ? యీ మూకనంతా యెవరికైనా యిచ్చేసి, శశి కున్న పిల్లవాడి నెక్కడైనా సంపాదిస్తే!...అల్లరిచేయకండా, చెప్పిన మాటలు వింటూ, ముద్దుమురిపెం తీర్చేవాడు లభిస్తే!... వో...! శశి కంటె తను యింకా దర్పంతో కబుర్లు చెప్పవచ్చు!...

* * *

ఆడవాళ్లలో వో విచిత్రలక్షణ ముంది... తమ యిరుగు పొరుగు వాళ్ల విషయాలు తెలియనివంటూ వుండవుగదా వాళ్లకు!... కమలపిల్లలు వొట్టి మొద్దు స్వరూపులనీ, వంతలనీ, నోటి కేది వస్తే అది అనేసేవాళ్లనీ, ఆవీథిలోనివాళ్లందరకూ తెలుసు. అందుకని కమల యెంతో కృంగిపోయేది సిగ్గుతో... మథనపడేది లోలోన... అయినా యితరపిల్లలుగూడా తన పిల్లలాగే అల్లరి వదవలే గదా అని తృప్తిపడేది...ఆవీథిలో ఆమె కున్నంత సంతానం యెవరికీ లేదు. పైగా తక్కిన పిల్లలకంటె తనపిల్లలు మెరుగు గాకున్నా, అంతకంటే మరీ అన్యాయంగా లేరుగా!... కానీ...యీ శశి యెక్కడ దాపరించిందో తన అపురూపమైన బిడ్డడితో! ... అక్కడే వచ్చింది చిక్కు!

* * *

రెండోరోజు క్లబ్బుకి కొస్త ఆలస్యంగా వెళ్లింది. మళ్లీ యథాప్రకారం శశి కుర్రవాడి గురించిన స్తోత్రపాఠాలు అందరూ శ్రద్ధగా వింటున్నారు.

..."నాభర్త చనిపోయినా యిప్పుడు నా కంత దిగులుగా లేదు... యెందుకంటే నాకొడుకు త్వరగా పెద్దవాడై నా కష్టాలు తీరుస్తాడు తప్పక! పేరు ప్రఖ్యాతులు గడించి తీర్తాడు... అప్పుడు అలాంటి కొడుకును కలిగిన ఘనత నాకే తప్ప యింకెవరి కొస్తుంది? అసలు యింతెందుకు? వాడికి వాడే సాటి... వాడితో పోల్చదగ్గవాళ్లెవరూ నాకు కనిపించలేదు..."

తన కొడుకు భవిష్యత్తు గూర్చి ఆవిడ జోస్యం చెబుతోంది...చేతులు యెగర వేస్తూ,కనుబొమ్మలు యెగర వేస్తూ, ఆ భవిష్యత్తు స్వరూపం వివరించడంలో వొక ప్రత్యేకత లేకపోలేదు.

శశి ప్రసంగం ఆగలేదు. వినేవాళ్ల ఆసక్తి తగ్గలేదు.

"...ప్రపంచమంతా నా కొడుకుని గురించి గర్వించే దినం రాకపోదు. నాకు తెలుసు వాడు మంచి ఖ్యాతి గడిస్తాడని... సందేహం లేదు. ఆ బిడ్డముఖం చూస్తునే ఆ విషయం చెప్పెయ్యొచ్చు."

ఆమె యథార్థమే చెబుతోందని ఆక్షణాన వాళ్లు నమ్మారు... తమ మనస్సుల్లో ఆ కుర్రవాడు పెద్దవాడై, కీర్తిగడించి, అందరిమన్ననకు పాత్రుడవుతున్న దృశ్యం చిత్రించుకున్నారు. ఆ కుర్రవాడు జన్మించిన ఘడియ చాల గొప్పదని శశి చెబుతుంటే కాదని యెవరూ అ...

కమల మాత్రం ఆ ప్రసంగం, ఆ ... సహించలేకపోయింది. తన బిడ్డలేగాక గూడ అవమానించబడుతున్నట్టు ... తోచింది. ఐతే శశిలాగా తను వొక అపురూ... మైన బాలుడి తల్లి కాలే దనేనా ఆ... కమల మండిపోయే హృదయంతో ... చర వెళ్లి పోతుంటే గమనించినవా రట్టే ఆ సమయంలో...

మెట్లెక్కుతుంటే యథాప్రకారం పిల్లల కేకలు, పెడబొబ్బలు... ఛీ! ... వొక్కసారి గంగలో పారవేస్తే పీడ వద... దనుకునేంతటి కోపం వచ్చింది కమల... వాళ్లతోబాటు ఆ శశినిగూడా గంగ... నెడితే బాగుణ్ణు—! మనస్థిమితం చెదిరిన... ఆవస్థలో కమల ఆలోచన అలాగే వెళ్ల... జేస్తుంది?... తన హృదయం తన లో... బాటులో లేదు... రాత్రింబగళ్లు ఆ ... బాలుడి" గురించే ఆమె ఆలోచన... వా... పెరగడం, పెద్దవాడై పేరు ప్రఖ్యాతు... గడించడం... అదే యోచన!...రోజులు గ... కొద్దీ ఆ వీథిలోని వాళ్లంతా ఆ కుర్ర... గురించే వింతగా చెప్పుకుంటున్నట్టు, తన... వాళ్లను గూర్చి అసహ్యించుకుంటున్నట్టు, ... తెలుసుకున్నది. యెక్కడ నుంచి ... గాని ఆ విచిత్రపు పిల్లవాడు క్లబ్బు... జీవితాల్లో యెంతో మార్పు తీసు... యిప్పుడు ప్రతి రోజూ శశి తప్పక వ... గావలసిందే! తన ముద్దుల కొడుకు చరి... రంగులు తీర్చి దిద్ది ఆమె చెప్పడం, మిగతా... ళ్లందరూ విని మైమరవడం... యిదీ వర... యిదంతా చూస్తున్న కమల హృదయ... మెల్లి మెల్లిగా కార్చిచ్చు రగుల్కొ సాగి... లోలోన తపిస్తోంది వరస బెట్టి అందరికీ...

ఈ శశి రాకపూర్వం యెన్నడూ ఈ ... లేదు.తనేమో,తన పిల్లలేమో,... యెన్నడూ ... తుంటరిపనుల్ని అసహ్యించుకునేది కా... తన వాత్సల్యంకొద్దీ, అవన్నీ లెక్కచే... గాదు... యిప్పుడు వాళ్లని కఠోరంగా ... డించుతున్నది... పిల్లలు బెదిరి ఆమె ... రావడం మానేశారు. అయినప్పటికీ వా... ... మార్చుకుటుకునా స్తి... పైపెచ్చు ... పటికంటె యిప్పుడు తుంటరితనం ... నైంది వాళ్లల్లో...

వొకరోజు మరీ విసుగెత్తి కర్ర పుచ్చు... అందరూ సొమ్మసిల్లి పోయేవరకు బాది, ... శంతో క్లబ్బు కెళ్లి పోయింది. ఆరోజు ... రాలేదు! కమల కొంచంసేపు. ఆకబుర్లు ... కబుల్లో చెప్పుకుని వొక స్నేహితురాల్ని ... స్యంగా అడిగింది: "నువ్వెప్పుడన్నా ఆ ... కొడుకుని చూశావా?"

"వుహుఁ... అయితే ఆ పిల్లాణ్ణి చూ... కెళ్లినవాళ్లు వాణ్ణి చూసి యెంతో ముచ్చ... తనివితీరా ము ద్దెట్టుకుంటూ రని శశే చెప్పింది అంతే!" అంటూ స్నేహితురాలు చెప్పింది.

అలాగే తన స్నేహితురాళ్ల నందరినీ వొక... క్కరినే అడిగింది, యెవరన్నా శశికొడు... చూశా రేమో అని... లేదు... అందరూ ... ప్రఖ్యాతచరిత్ర విన్నవారే గాని, చూసి... రెవరూ లేరు. కమల కొక్కసారి వొళ్లు ... పోయింది వాళ్ల వాలకం చూసి... యిక ... చూసి రావా లని నిశ్చయించుకున్నది.

* * *

కొద్దిగా చినుకులు పడుతున్నాయి... ఐ... కమల పట్టుదలతో వెళ్తున్నది. సాధారణం... కమల వర్షంలో బయటకు వెళ్లి యెరగదు ... యీరోజు మటుకు ఆకుర్రవాడిని చూచి తీ... లనే పంతంతో, వర్షపు చినుకుల్ని నిర్లక్షి... ఆవేశంతో నడిచిపోతోంది. తను ... చూచితీరాలి... యెవరితోనూ దెబ్బ... అల్లరిచేయక, వయసుకి మించిన తెలివి కలిగి వున్నాడని ప్రచారం పొందిన ఆ ... స్వయంగా చూచితీరాలి... అదే ఆమె ... కోరిక... చూచిగానీ తను ఆ కుర్రవా... ప్రేమిస్తున్నదో లేక వాడిలక్షణాల కనూ... పడుతున్నదో, వాడంటే తన కిష్టమో, అ... ష్టమో నిర్ణయించుకోవాలి.

మేఘాలు దట్టంగా అలుము కుంటున్న... అలా అరగంట నడిచి శశిబంగళా చేరింది.

(17-వ పేజీ చూడుడు)



'మారుతల్లి మాయ'

మూలం : 'హాన్స్ ఆండర్సన్' అనువాదం : 'శ్రీ ఆచార్య భార్గవ'

అదేదో వూరు. పేరు జ్ఞాపకం లేదు. ఆ వూరు ఏలే రాజుకు పదిమంది కొడుకులూ, ఒక్క కూతురూ వుండే వారు. ఆ అమ్మాయిపేరు సౌదామిని. వాళ్లు చాల మంచి పిల్లలు. ఎప్పుడూ సంతోషంగా వుండేవాళ్లు. ఆ పిల్లలకు ప్రత్యేకంగా ఒక సుందరభవనం ఉండేది. ఆయింట్లో బీరువానిండా వాళ్లకు కావలసినన్ని కథల పుస్తకా లుండేవి. జిగినా జలతారీ దుస్తులు పెట్టెలనిండా కిక్కిరిసి వుండేవి. వాళ్ల కే కొఱతాలేదు. దర్జాబతుకు. వాళ్ళకు వ్రాసుకోడానికి, బంగారుకాగితాలూ, రత్నాల పేనాలూ వుండేవి. వాళ్ళ యింటి చుట్టూ నాలుగు వైపులా నాజూకైన పూలతోట వుండేది.

కాని ఇలా ఎంత కాలమో జరగలేదు. వాళ్ళకు దుర్దశ దాపరించింది. వాళ్ళ తల్లి చనిపోయింది. అది మొదలు వాళ్ళకు పీడ పట్టుకుంది. రాజు ఇంకో ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఆమె చాలా చెడ్డది. అతి కోపిష్ఠి; అసూయ విపరీతం. ఆమె పేరు మాయాదేవి. పిల్లలకు మారుతల్లి (చవతితల్లి మాయాదేవి) స్వభావం త్వరగానే తెలిసిపోయింది. 'ఇక మనం హాయిగా బతకలేం. మన బతుకు నరకప్రాయమే' అనుకున్నారు.

మాయాదేవివివాహము రోజున ఆ యింట్లో అనేక రకాలైన పిండి వంటలూ అవీ రాసులు రాసులుగా కనబడేప్పటికి పిల్లలకు నోరూరింది. తినాలని తోచింది. వాళ్లు చవతి తల్లి వద్దకు పోయి "మాకేదైనా తిండానికి పెట్టవూ?" అని అడిగారు. దానికి బదులుగా ఆమె రాళ్లూ రప్పలూ వాళ్లో పోసి "ఇకమీద మీ కిదే గతి. మీ కివే నేనిచ్చే పంచ భక్ష్యాలు" అని కసిరింది.

అదేం గ్రహచారమో కాని, తల్లి లేని ఆ బిడ్డలమీద కొత్త రాణీగారికి చెప్పలేని అసూయ, ఆగ్రహం. రాజుకు ఆ పిల్లలమీద మమకారం అధికంగా వుండడం ఆమె సహించలేకపోయేది. లేనివీ, పోనివీ చాడీలు చెప్పి రాజుకూ, ఆ పిల్లలకూ కాకుండా చేయాలని ఆమెఊహ. వేషాలేసి నటించి రాజుగారివద్ద మంచిపేరు సంపాదించుకుంది. ఆమెమాటల్లో రాజుకు అమిత విశ్వాసం. ఆమెయందతి ప్రీతి. ఆమె ఉత్తమురాలనుకున్నాడు. ఆమె దే ఆ యింట్లో రాజ్యం!

ఆమె తంత్రాల ఫలితంగా చాలా దూరాన వుండే ఓ పూరి గుడిసెలో వుండమని సౌదామినిని పంపించేశాడు రాజు. అంతటితోనే కొత్త రాణిగారికి తృప్తి కలుగుతుందా? ఇంకా పదిమంది కొడుకులున్నారు గా? వాళ్ళనూ తరిమేస్తే పీడ విరగడౌతుంది. ఓనాడామె రాజుతో "మీ పిల్లలు చాలా చెడ్డ పోకిరి పిల్లలు! వాళ్ళ నెక్కడికైనా పంపించేయాలి. ఏమంటారు?" అని అడిగింది.

కొత్తమోజు గదా; రాజుగారికి ఈ కొత్తరాణీగారిమీద అపారమైన ప్రేమ. ఆమెలో దుర్గుణాలా తని దృష్టిలోకి రాలేదు. చాలా ఉత్తమురాలనుకుంటున్నాడు. ఐనా బిడ్డల్ని పంపించేయమనడంవల్ల అతని మనస్సు చివుక్కుమన్నది. ఐనా, "వాళ్లు మన వద్ద ఉండతగరు అని తోచినట్లయితే తప్పక అలా చేయాల్సిందే" అని అన్నాడు రాజు.

అంతట మాయాదేవి తన కోరికలు ఫలిస్తున్నందుకు సంతోషిస్తూ వాళ్ళను పది తెల్లపిట్టలకింద మార్చేసింది. "ఇంకో దేశాని కెక్కడికైనా దూరంగా పొండి. మీరు పిట్టలుగా మారి పోయారు. మాటా మంతీ ఆడలేరు. మీ పొట్ట పోసుకుంటూ ఎక్కడైనా యాతనలు పడండి" అని చెప్పి వాళ్ళను తరిమేసింది.

రాజకుమారు లిప్పుడు తెల్ల పక్షులు. అవి ఆకాశంలోకి ఎగిరి ఎంత దూరమో తిరిగాయి. నదులూ, కొండలూ, దేశాలూ, నగరాలూ దాటి పోయిపోయి చిట్ట చివరికి సముద్ర ప్రాంతంలో వుండే ఒక అరణ్యానికి చేరాయి.

పాపం సౌదామిని పూరి గుడిసెలో పేదతనంలో ఒంటరి జీవితం అతి కష్టంమీద గడుపుతోంది. దీనికి తోడు తన తోబుట్టువుల్ని చూడాలనే ఉత్కంఠ చాలా జాస్తిగా వుంది. ఎప్పుడూ వాళ్ళ స్మరణే. ఆ దుఃఖ తీవ్రతలో పిట్టలకూ పుట్లకూ, పూలకూ ఫలాలకూ, చెట్లకూ చేమలకూ తన కష్టాలన్నీ చెప్పుకునేది. సోదరులను చూడాలని బెంగగా వుండనేది. కాని అవి పలుకుతాయా? వాళ్ళను తలుచుకుంటూ కుమిలిపోతూ వుండేది.

ఇలా ఎలాగో మూడు సంవత్సరాలు గడిచాయి. మూడు సంవత్సరాలైంతర్వాత సౌదామిని యింటికి రావచ్చని రాజు చెప్పాడు. ఆకాలంలో ఆమె వయస్సుతోబాటు ఆమె సౌందర్యమూ బాగా వృద్ధిపొందింది. ఆమె చక్కని దేవతాకన్యలా వుందిప్పుడు. సోదరులను చూడొచ్చని ఆత్రంతో యింటికి చేరుకుంది. రాణీ చూచిందీమెను. సౌదామినిసౌందర్యం చూచేసరికి ఆమె కళ్లు బిగేలుమన్నాయి. మాయకు కళ్లు కుట్టాయి. ఈమెను కూడా ఓ పిట్టగా మార్చేస్తే బాగుంటుంది అనుకున్నది. కాని రాజు భయంవల్ల అలా చేయలేదు. వేరే ఏదైనా ఉపాయం ఆలోచించాలనుకుంది.

సౌదామిని చాలా దూరప్రయాణం చేసివచ్చింది. ఆమె దుస్తులనిండా, మొహంనిండా దుమ్మూ ధూళీ నిండివుంది. "సౌదామినీ, కాస్త మొహం కడుక్కుని దుస్తులు మార్చేసి, మరీ నాన్నను చూడ్డానికి వెళ్లు" అని చెప్పింది మాయ. సరేనంది సౌదామిని. పాపం, అమాయకురాలు నాన్నకు ముచ్చటగా, శుభ్రంగా కనిపించాలనుకుంది.

సౌదామిని చవితితల్లి వెంట స్నానాల గదిలోకి పోయింది. అక్క నీళ్లు సిద్ధంగా తోడిపెట్టి ఉన్నా రహస్యంగా ఆ నీళ్లలో రాణీ ఏదో మందుపొడి పోసింది. ఈ మోసం తెలుసుకోకుండానే ఆ నీటితో మొహం కడుక్కుంది. సౌదామిని మొగం ఎర్రగా అసహ్యంగా తయారయింది. ఆగదిలో ఒక అద్దమైనా లేదు. మొహం చూచుకోకుండానే తండ్రి వద్దకు వెళ్లింది.


రాజు దూరంనుంచే చూచి "ఛీ ఛీ ఈమె నా సౌదామిని కాదు. ఇంత అసహ్యంగా వుండదు నా బిడ్డ పొమ్మను" అని అరిచాడు.

సౌదామినిఆశలన్నీ అడుగంటి పోయాయ్. ఒక్క క్షణం అక్కడ నిలవకుండా ఇల్లు విడిచి బయలు దేరింది, ఎక్కడికో! తనకు జరిగిన అవమానానికి కుమిలి కుమిలి ఏడవసాగింది. తనను కడుపార కన్న తండ్రే తనను అవమానించినప్పుడు తన గతి యేమి? తన సోదరులుకూడ రాజుగారింట్లో వుండరనీ, వాళ్లనుకూడ మాయ తరిమేసి వుంటుందని నిశ్చయించుకుంది. అలా బయలుదేరి ఆమె గమ్యస్థలం లేకుండానే ఎక్కడికో నడిచిపోతూనే వుంది. ఇలా పోతూ వుంటే ఏదో వొకనాడు సోదరులను చూడలేకపోతానా అనుకునేది. చాలా బెంగగా వుంది.

సౌదామినికి సోదరులందుండే పక్కల్మష ప్రేమే కడకు ఆమెను ఆ సముద్రప్రాంతంలోని అడవికి తీసుకుపోయింది. ఆమె అలా పోతుండగానే పొద్దు గూకింది. రాత్రైంది. కటిక చీకటి. కళ్లు కనబడవు. అందువల్ల ఆమె ఆ రాత్రికి ఓ చెట్టుకింద పండుకుంది. ఆ కలతనిద్రలో కలలు కన్నదామె. తన సోదరులు కనబడ్డారు. వాళ్లు వందల కొలదీ కథల పుస్తకాలు పెట్టుకుని చదువుకుంటున్నారు. కాని ఒక వింత! ఆ కథల్లోని రాజులూ, రాణీలూ అందరూ ప్రాణంతో ఉన్నారు. వాళ్లు ఆ పుస్తకంలో కాగితాలమీద అటూ యిటూ పచార్లు చేస్తున్నారు. దేవతలూ, మాంత్రికులూ మాట్లాడుతున్నారు. కొంతసేపటికి మళ్లీ వాళ్ళంతా గబుక్కున పుస్తకాల్లోకి దూరారు. పుస్తకాలు మూయబడినయ్. సౌదామిని మేలుకుని చూచింది. ఏమీ లేదు. అంతాకలే.

బొమ్మల కథ.





త నెక్కడుందో చూచుకుంది. ఆమె నడిఅడవిలో పడుకుని ఉంది. సూర్యుడు గగనాన ప్రకాశిస్తున్నాడు. చుట్టూరా పండ్ల చెట్లూ, పూల మొక్కలూ ఉన్నాయి. ఎదురుగుండా చిన్న యేరు జలజలమని పారుతోంది.

సౌదామినికి దప్పికైంది. ఆ ఏటికి వెళ్లింది దాహం తీర్చుకోడానికి. తన మొహం ఏటి నీళ్ళలో కనపడింది. తండ్రి ఎందుకు తన్నవమానించాడో, మాయాదేవి చేసిన మాయ ఏమిటో ఆమెకంతా అప్పుడు బోధపడింది. శుభ్రంగా మొహం కడుక్కుంది. ఇప్పుడు ఆమె మొహం మామూలుగా ముద్దుగా వుంది. అందులో స్నానం చేసికొని మళ్లీ ప్రయాణం కట్టింది. ఏం ప్రయాణమో అంతూ పొంతూ, దోవా తెన్నూ, అర్థపర్థం లేని ప్రయాణం! అదెక్కడికో! దేవుడికే తెలియాలి. పగలల్లా గడిచింది. రాత్రిపడింది. ఓ చెట్టు మొదట్లో పడుకుంది. ఆ రాత్రి ఆమెను ఏ క్రూరమృగాలైనా చంపేస్తాయేమోనని దేవతలే ఆమెకు కాపలా కాశారు.

ఉదయమైంది. మళ్ళీ ప్రయాణం కాబోతోంది. ఆకలి ప్రళయంగా వుంది. కాని దాన్ని ఆమె అంతగా లక్ష్యం చేసినట్లు కనబడదు. అప్పుడెవ్వరో ఒక ముసిలామె ఆమె కెదురుపడి కొంచెం ఆహారం ఇచ్చింది. అది ఆమె ఆప్యాయతతో తింటోంది.

"ఈ భయంకర కీకారణ్యంలో ఏం చేస్తున్నావమ్మా!" అని అడిగింది ముసిలామె.

"నా పదిమంది సోదరులను వెతుక్కుంటూ తిరుగుతున్నాను. అవ్వా, నువ్వేమన్నా గుర్రాల మీద స్వారీ చేసుకుంటూ పోయే రాజకుమారుల్ని ఈ అడవిలో చూచావా?" అని అడిగింది సౌదామిని.

"పదుగురు రాజకుమారులా! లేదు. కాని, ఇవ్వాళ పొద్దున్న ఓ పది తెల్ల పిట్టల్ని చూచా. వాటి తలలమీద కిరీటాకారంలో బంగారు గీతలున్నాయ్. అందువల్ల అవి రాజకుటుంబానికి చెందినవిగా కనబడినయ్. అవి ఒక ఏటివద్ద కనబడినవి." అని చెప్పి ఆ ముసిలామె సౌదామినిని ఏటి వద్దకు పిలుచుకుపోయింది. ఏటి గట్టునే పోయి పోయి సముద్రంవద్దకు పోయింది సౌదామిని. ఇంతలో అవ్వ కనబడలేదు. మాయమైంది. సూర్యుడస్తమిస్తూ వున్నాడు. అప్పటి ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ స్తబ్ధంగా నిలబడి వుండి సౌదామిని. అమె తలకు సూటిగా ఆకాశంలో కలకల ధ్వని వినబడింది. తలెత్తి చూసేసరికి పది తెల్ల పిట్టలు! సౌదామిని భయపడి తటాల్న పరిగెత్తి పోయి, ఓ పొదమాటున దాక్కుంది. ఆ పక్షులూ ఆ పొదవద్దకే వెళ్లి కాచుకుని ఉన్నయ్.

ఇంతలో సూర్యుడు పూర్తిగా మాటుపడినాడు. ఆమె మెల్లగా తొంగి చూచింది. బలే వింత! పది పిట్టల స్థానంలో రాజకుమారులు నిలబడి వున్నారు. వాళ్ళను చూచి సౌదామిని ఆనందంతో "అన్నల్లారా!" అని ఒక్కపాలి కేక పెట్టి వాళ్ల చేతుల్లోకి వాలిపోయింది. సంతోషాతిశయంలో వాళ్లెవళ్లూ కొంతసేపు మాట్లాడలేకపోయారు. ఆ సంతోషం వాళ్ళ కళ్లల్లో మెరిసి పోతోంది. "నీ వెంతగా ఎదిగావు సౌదామినీ. నీ విప్పుడు మునుపటికంటే ఎన్నో రెట్లు అందంగా వున్నావు! నీవు మా సౌదామినివే కదూ?" అంటూ ఆమెను సోదర వాత్సల్యంతో ఓ వందసార్లైనా ముద్దు పెట్టుకున్నారు.

"మే మిక్కడే వుండి పోకూడదు. ఉదయాన్నే బయలుదేరి పక్షుల పట్నానికి వెళ్లి పోవాలి. సంవత్సరానికి మూడు రోజులు మాత్రమే మే మిక్కడికి రాగలం. ఈ రోజు కడపటి రోజు" అన్నారు రాజకుమారులు.

"ఎలాగైనా నన్ను మీతో తీసుకుపోలేరా?" అని అతిదీనంగా వేడుకుంది సౌదామిని.

సోదరులంతా కలిసి ఒక ఉపాయం చేద్దామనుకున్నారు. "ఈ రోజు రాత్రంతా కష్టపడి ఒక వల నేసేస్తాం. నీవు దాంట్లో కూర్చో. మేం మా ముక్కులతో ఆ వలను పట్టుకుని సముద్రంమీదుగా తీసి కెళ్తాం. కాని మేం చాల వేగంగా ఎగరాలి. సూర్యాస్తమానంతో మేం మళ్లీ మనుష్యుల మౌతాం. అప్పుడు మనమంతా సముద్రంలో పడి పోతాం. అందువల్ల సూర్యాస్తమయంలోపునే నిన్ను జాగ్రత్తగా వూరు చేర్చాలి" అని వాళ్లు తమ చెల్లాయితో చెప్పారు.

రాజకుమారులు పదిమందీ రాత్రంతా కష్టపడి పని చేసి ఉదయమయ్యేలోపునే ఒక వల తయారు చేశారు. సూర్యోదయమయింది. పిట్టలుగా మారిన రాజకుమారులు తమ ముద్దు చెల్లాయిని మోసుకుంటూ ఆకాశాన సముద్రంమీద ఎగర సాగారు. సౌదామిని కిందికి చూస్తుందేద్ధి మధ్య మధ్య. కొంతసేపు నిద్ర పోయేది. మధ్యాహ్నం అయేటప్పటికి వాళ్ల ప్రయాణానికి అడ్డంగా వాన తగులుకుంది. పక్షులు వేగంగా ఎగరలేక పోతున్నాయ్. రాత్రిలోగా పిట్టల పట్నానికి చేరలేక, అంతా సముద్రంలో పడి మునిగి చావాల్సి వస్తుందో, ఏమో!

పగలు గడిచిపోతోంది. పోవలసిన

(15 వ పేజీ చూడుడు)



పిల్లలమండీ ...!

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు

పిల్లలమండీ—
పిల్లలమూ!
తలంపు నిచ్చిన
తలోటి తెచ్చి

ఎక్కెదమూ!—పై
కెక్కెదమూ!
ఆకాశంలో
మకాము వేసీ

చందమామతో
పందెము వేసీ
నవ్వెదమూ!
నవ్వించెదమూ!
— పిల్లలమండీ, పిల్లలమూ!

తారకలతో
తారంగం
మెరుగుబాలతో
పరుగుడు పందెం

గడగడ ఉరుముతో
గుడుగుడు గుంచెం
తెప్పలమాటున
దాగుడుమూత

ఆడెదమూ!
ఓడించెదమూ!
—పిల్లలమండీ పిల్లలమూ!

ఇంద్రధనువుతో
వుంగిడిపూసి
మంచు ముత్తెముల
సంచుల నింపుతు

వానచేరులను
పట్టుక కిందికి
పాకెదమూ!
పాకించెదమూ!
—పిల్లలమండీ పిల్లలమూ!







'మేళా' హిందీ చిత్రంలో నర్గీస్



'పరాయీ ఆగ్' హిందీచిత్రంలో ఉల్హాస్, మధుబాల

చలనచిత్ర సమీక్ష

మేళా

నర్గీస్, దిలీప్‌కుమార్ మొదలైన వారు నటించిన వాడియావారి హిందీ చిత్రం. దర్శకుడు యస్. యు. సున్నీ, సంగీత దర్శకుడు నౌషద్.

ప్రేమగీతాలు టుమ్రీలతో నిండిన చిత్రం. శైశవంనుంచీ ప్రేమించుకుని, ప్రేమ జీవనం గురించి తియ్యని కలలు కని, విధివైపరీత్యంవల్ల చివరికి ప్రేమ భగ్నమై ప్రాణాలు పోగొట్టుకున్న ప్రేమికుల గాథ చిత్రానికి ఇతివృత్తం. మంజు (నర్గీస్) గ్రామపాఠశాలోపాధ్యాయుని కూతురు. మోహన్ (దిలీప్‌కుమార్) మిఠాయి దుకాణదారు కొడుకు. గ్రామంసమీపంలో కొండచరియను పురాతన శివశిలాప్రతిమ దాపున మొండిగోడలు వీరి ప్రేమవిహారాలకు తావు. ఈ కథలో ప్రేమ భగ్నం కావడానికి నాయకునికి సంభవించిన ప్రమాదానికి అకారణవిరోధి ఒకడు పూర్వసహ విద్యార్థి తోడవుతాడు. పెండ్లి విషయాలు కూడా నిర్ణయించే గ్రామపంచాయితీలో నాయకునిపైన అపవాదు వేస్తాడు. ప్రమాదానికి లోనై ఆస్పత్రిలోఉన్న మోహన్, గాయం మాని ఇంటికి వచ్చేసరికి మంజూ వివాహం ఒక ముసలివానితో జరిగిపోతుంది. ముసలివానితో వివాహం ఏర్పాటుకు పై విరోధే కారకుడు. ఇంటి కొచ్చిన మోహన్ భగ్నహృదయంతో నిద్రాహారాలు మాని విరాగియై జీవితం గడుపుతాడు. తిరిగి నాయికానాయకులు కలుసుకోడానికి సన్నివేశాలు సృష్టించబడినాయి. ముసలి భర్త గతించిన కొంత కాలానికి మంజూ బాల్య సఖి వచ్చి మోహన్‌గుర్తి తెలుపుతుంది. ప్రేమను సాఫల్యం చేసకోమని ఉద్బోధిస్తుంది. మంజూమనస్సు అటూ ఇటూ ఊగులాడి చివరికి ఒక తుపాను రాత్రివేళ ప్రేమస్థావరం చేరుకుని నిత్యపరిచితగీతం ఆలాపిస్తుంది. మోహన్ పెతం విని అక్కడికి వడతాడు. అతను సమీగిస్తున్న కొద్దీ మంజూ వనక్కు అడుగులు వేస్తూ చివరికి అగాధంలో పడి ప్రాణాలు విడుస్తుంది. మంజూను హత్యచేసినాడనే నేరంపైన కారాగారవాసం చేస్తాడు. విడుదలఅనంతరం మోహన్ అక్కడికే వెడతాడు. ప్రియురాలి మాయారూపం అక్కడ గోచరిస్తుంది. ఆమెననుసరిస్తూ అతనుకూడా అగాధంలో పడి మరణిస్తాడు. ప్రేమ మృగతృష్ణవంటిదనీ, జీవితంలో మేళంలో (తీర్థంలో) వలె కృత్రిమ ఆనందం మాత్రమే లభిస్తుందనీ సూచించే గీతాలున్నాయి.

'నవజీవనం'
తమిళచిత్రంలో దృశ్యాలు

చిత్తూరు నాగయ్య, పి. కన్నాంబ, యస్. వరలక్ష్మి, శ్రీరామన్, జయలక్ష్మి, పంతులు, రామచంద్రన్ మొదలైనవారు నటించిన శ్రీ రాజరాజేశ్వరీవారి తమిళచిత్రం. దర్శకుడు కె. బి. నాగభూషణం.




మహదేవన్, అన్నపూర్ణ పాత్రలు నటించిన నాగయ్య, కన్నాంబ

గాంధీజీభక్తుడు మహదేవన్, (నాగయ్య) బీద కార్మికుల దుస్థితిని గురించి నాటకాలు వ్రాసి ఊళ్లో నాటక కంపెనీకి అమ్మి జీవితం గడుపుతున్నాడు. అతని భార్య అన్నపూర్ణ (కన్నాంబ) ఉత్తమ యిల్లాలు. మహదేవన్ తమ్ముడు ప్రభాకర్ (శ్రీరామన్) కాలేజీలో చదువుతున్నాడు. ఊళ్లో ఉన్న ధనలక్ష్మి మిల్స్ ప్రొప్రైటర్ రావుబహదూర్ దొరసామి మొదలియార్ కూతురు కమల, (వరలక్ష్మి) బాంకర్ నటరాజన్ కూతురు వనజ (జయలక్ష్మి) అతని సహాధ్యాయినులు. ఇద్దరూ అతన్ని ప్రేమిస్తారు. ధనవంతులతో బాంధవ్యం కూడదని అన్న మహదేవన్ చెప్తున్నా వినక ప్రభాకర్ కమలని పెళ్లి చేసుకుంటాడు. వివాహానంతరం దొరసామిమొదలియార్ చనిపోతాడు. మిల్లులవ్యవహారం అంతా ప్రభాకర్‌పైన పడుతుంది. వద్దంటున్నా బలవంతాపెట్టి అన్ననీ వొదినీ తీసుకొచ్చి తనవద్ద ఉంచుకుంటాడు. మిల్లుల్లో కార్మికుల్ని ప్రభాకర్ బాధలు పెడతాడు. కమల అన్నపూర్ణతో తగువులాడుతుంది. చివరికి ప్రభాకర్ అన్నపూర్ణని కొడతాడు. మహదేవన్, అన్నపూర్ణ ఇల్లు విడిచి వెళ్లిపోతారు. కమలకి భర్తపైన శ్రద్ధ తగ్గింది. క్లబ్బులలో అధికంగా కాలం గడపడం మొదలెట్టింది. ఇది చూసి తిరిగి వనజ ప్రభాకర్‌వద్దకి వచ్చి అతన్ని ఆకర్షించడానికి యత్నిస్తుంది. దీనితో కమల ప్రభాకర్‌తో దెబ్బలాడుతుంది. ప్రభాకర్ కమలని కొట్టి మేడమెట్లమీదకి పడ తోస్తాడు. అన్నపట్ల తన తప్పిదం గ్రహిస్తాడు. వారివద్దకు వెడతాడు. కమలకూడా తన తప్పిదాలు గ్రహించి అన్నపూర్ణను క్షమార్పణ కోరుతుంది.



హాస్యనటకులు నారాయణరావు, రామచంద్రన్



కన్నాంబ

'మారుతల్లి మాయ'

(13-వ పేజీ తరువాయి)

దూరం చాలా వుంది. ఇంకా వేగంగా తమ శక్తి అంతా ఉపయోగించి పోతున్నాయి పక్షులు. సూర్యుడస్తమించబోతున్నాడు. ఒకసారి క్రిందికి తొంగి చూచింది సౌదామిని. అంతా నీరే. ఇవ్వాళ తామంతా సముద్రానికే అర్పణం అనుకుంది. ఇంకా సముద్రం లోపల్లోపలికి చొచ్చుకు పోతున్నాడు సూర్యుడు. అప్పుడామెకు కను చూపు మేరలో పిట్టల పట్నం కనిపించింది.

"వేగిరం, వేగిరంగా పొండి. సూర్యుడస్తమిస్తాడు" అని అరిచింది సౌదామిని. ఆమె కిప్పుడు అల్లంత దూరంలో పెద్ద తెల్ల మేడలూ, వీధులూ కనబడుతున్నయి. కాని లాభం? ఏమౌతుందో!

అస్తమయ సూర్యుడి కడపటి కిరణం ఒకసారి ప్రసరించి పోతోంది...... పోయింది. వలలోని సౌదామినితో సహా, మానవ రూపం పొందిన రాజకుమారులు కిందికి పడిపోయారు. అమ్మయ్య! అదృష్టవశాత్తూ వాళ్లు సముద్రంలో పడిపోలేదు. సముద్రవొడ్డున ఇసకలో పడ్డారు. అంతట వాళ్లు మెల్లగా నడచి వెళ్లి, అనువైన చోట పడుతుని ఆ రాత్రి నిద్రతో గడిపారు. మెల్లిగా సూర్యోదయమైంది.

"ఇదా మీ దేశం?" అని అడిగింద వాళ్ళని. బదులు లేదు. ఆమె కెదురుగుండా పది పక్షు లున్నాయి.

ఆమె నలువైపులా చూసింది. అది చాలా సౌఖ్యమైన చక్కని దేశం. నేలంతా మంచి మంచి వాసనల పూలతో నిండిఉంది. అంత అందమైన 'లు ఆమె ఎప్పుడూ చూచి ఎరుదు. చుట్టూరా, చిక్కని నీడనిచ్చే చక్కని చెట్లు. ఎదురుగా ఒక చిన్న కొండ. ఆ కొండపై తెల్లటి మేడ. ఆ మేడకు కిటికీ లెన్నో వున్నయ్.

సౌదామిని అరణ్యంలో వొంటరిగా వుంది. ఆమెను వొంటరిగా వదలి పక్షు లెక్కడికో యెగిరి పోయాయి. పాపం, సౌదామిని అటూ యిటూ తిరిగి నాలుగు పుల్లలూ, ఆకులూ సంపాదించుకుంది. ఒక చిన్న పూరి యిల్లు కట్టుకుంది. ఆ యింటి నలంకరించేందుకు పూలు తేవడానికై ఆమె యెక్కడికో వెళ్లింది. ఆమె తిరిగి వచ్చి చూచేసరికి తనకై పెట్టివున్న ఆహారపదార్థాలు కనిపించినై.

ఎల్లెల్లో సౌదామినికి ఆపగలు గడిచింది. రాత్రి ఆమె సోదరులొచ్చారు. చల్లని పాల వెన్నెట్లో కూర్చుని పూర్వకాలపు కథలు చెప్పుకున్నారు వాళ్ళంతా. నిద్రొచ్చేసరికి "ఇక నిద్ర పోదాం సౌదామినీ" అని చెప్పి అందరూ చెట్లకింద నిద్రపోయారు.

సౌదామిని మాత్రం పూరింటిలోనే పడుకుని వుంది. ఆమె కో కల వచ్చింది. ఆనాడు అడవిలో కనిపించి సాయం చేసిన ముసిలామే కనిపించింది. కాని ఆవిడ ఇవ్వాళ ముసిలామెగా లేదు. ఈ రోజు యౌవనంలో ఉండే దేవతలా కనిపించింది.


"నీ సోదర్లకు మంచి గతి కలిగించాలనుకుంటున్నావా?" అని అడిగిందా దేవత.

"ఔను. చాల ఆశతో, పట్టుతో వున్నాను" అంది సౌదామిని.

"నీవు నీ సోదరులను రక్షించాలంటే చాలా సాహసించాలి. త్యాగం చేయాలి. మిక్కిలి ధైర్యం అవసరం."

"నా సోదర్లకై నేనెంతటికైనా సిద్ధమే."

"ఐతే విను. ఆ కనబడుతున్నవి చూడు—బంగారు పూల మొక్కలు. నీ వా మొక్కల పూలను తెచ్చి, నీళ్లల్లో నానబెట్టు. ఆ పూల్లో వుండే గట్టి గట్టి భాగాల్ని తీసెయ్. అనేక పర్యాయాలు వాట్ని కడుగు. అవి దూదిలా ఔతుంది. దాంతో దారం తీసి, గుడ్డ నేసి, పది కోట్లు తయారు చేయాలి. అలా తయారైన వాట్లో చెరి ఒక కోటు తొడిగితే యీ బుట్టువులకు ఇచ్చావంటే వాళ్లు మామూలు రూపు పొందుతారు. స్వయంగా పని నీ చేతుల్తోనే చేయాలి. ఈ కోటులన్నీ తయారయేదాకా నీవు మాట్లాడకూడదు. మాట్లాడావా—సర్వనాశనం— నీ సోదరులందరూ చచ్చిపోతారు." ఈ విధంగా చెప్పి ఆ దేవత అదృశ్య ఐంది.



శిశుశిల్ప చిత్రకళాప్రదర్శనంలో ప్రదర్శించబడ్డ ఒక జపాను శిశువుగీసిన చిత్రం.

సౌదామిని నిద్ర మేల్కొంది. తన మేలు కోరే ఈ దేవత తనకేదో దోవ చూపించింది. ఆ పూలచెట్లు ఎక్కడెక్కడ వుంటాయా అని వెతక సాగింది. ఎక్కడెక్కడున్నవీ ఆ పూలన్నీ సేకరించింది. ఆమెయింటి సమీపంలోనే ఒక నీటిబుగ్గ ఉంది. పగలల్లా శ్రమపడి ఆ పూలు తేవడం, నీళ్లల్లో తడిపి ఉంచడం, ఆ దూదిలోనుండీ దారం తీయడం ఈ పనిలోనే మునిగి వుండేది సౌదామిని

ఆ రాత్రి ఆమెసోదరులొచ్చారు. పలకరించారు. కాని ఆమె పలకలేదు. తమ సవతితల్లి మాయ-రాణీ ఒక దుష్టదేవతను పంపించిందేమోనసీ, ఈమె సౌదామిని కాదేమోనసీ, ఏమి ఆపద వస్తుందోనసీ మొదట వాళ్లు భయపట్టారు. కాని నెమ్మదిమీద, ఆమె పడే పాట్లన్నీ తమకోసమేనసీ, ఆమె తమ చెల్లే అనీ, తమగ్గానే మౌన వ్రతం పూనిందనీ తేలుసుకోగలిగారు.

విశ్రాంతి అనేమాట లేకుండా శ్రమపడి సౌదామిని ఆరు కోట్లు తయారు చేసింది.

ఒకరోజు సౌదామిని నీటిబుగ్గ పక్కన కూర్చుని తన పని చేసుకుంటూ వుంది. ఎక్కణ్ణుంచో ఉన్నట్లుండి ఒక కుక్క ఆకాశాన్నుండి ఊడిపడినట్టు ఆమెముందుకు దూకింది. దానివెంట ఇంకోటి; దాని వెనుక మరోటి. ఈలా ఎన్నో కుక్కలు ఆమె చుట్టూ మూగి 'భౌభౌ'మంటూ అరుస్తూ గోల పెడుతున్నాయ్. ఆమె చలించకుండా తనపని చేసుకుంటూనే వుంది. అప్పుడా చెట్ల లోంచి ఒకయువకుడు—రాజకుమారుడిలా ఉన్నాడు—వచ్చాడు. అతనివెంట ఎందరో సేవకులు. సౌదామిని తలెత్తి చూచింది. అతడు అపురూప మన్మథుడిలా వున్నాడు. చాలా మంచివాడుల్లా కన్పించాడు. మొదటి చూపుల్లోనే వాళ్ల హృదయంలో ప్రేమ అంకురించింది.

ఆ యువకుడు "ఈ ప్రదేశంలో ఎవరూ నివించలేరే? నీ విక్కడికెలాగ, ఎందుకు వచ్చావు?" అని అడిగాడు సౌదామినిని. కాని సౌదామిని నోరు తెరవలేదు.

ఆ యువకుడు ఆ ప్రాంత దేశానికి రాజు అది మొదలు అతడు రోజూ సౌదామినిని చూడ్డానికి వస్తూండేవాడు. వచ్చి సౌదామినిని పలకరించేవాడు. ఆమె పలికేదే కాదు. ఐనా అతడామెను గాఢంగా ప్రేమించాడు. ఈమె తప్ప ఇంకెవ్వరూ తనకు రాణిగా వుంటానికి తగరని నిశ్చయించుకున్నాడు. ఎల్లాగైనా ఈమెను పెళ్లాడాల్సిందే అనుకున్నాడు. సౌదామిని, బహుశా, ఏదో వ్రతంలో వుండి వుందొచ్చనీ, అది తీరాక మాట్లాడక పోదనీ పీర్మానించుకున్నాడు.

కాని కాలయాపనం సహించలేని ఆ యువకుడు ఓనాడు ఆమెను సమీపించి "నా రాణిగా వుంటావా?" అని అడిగాడు.

సౌదామిని తన వస్తువులన్నీ తీసుకుని, దూరంగా తొలగి. కూర్చుని ఏడవడం మొదలుపెట్టింది.

"నీకు కావాల్సిన ఈ మొక్కలూ, పూలూ అన్నీ నా యింటికే వచ్చేట్లు చేస్తాను. నీ పని కేమీ అభ్యంతరం ఉండదు. నాతో గూడా రాజధానికి వచ్చేస్తావా?" అని రాజు ప్రశ్నించాడు.

ఆమెకూడా అతణ్ణి లోపల్లోపల ప్రేమిస్తోంది. కాబట్టి అతని ప్రశ్నకు "రాను" అని మోటుగా బదులు చెప్పలేక పోయింది. గప్‌చిప్‌గా రాజు వెంట రాచనగరుకు వెళ్లింది సౌదామిని. ఆమె తయారు చేసిన కోట్లూ, ఆ పూలూ అవీ ఆమెకు తెప్పించిచ్చాడు రాజు. ఆమెసోదరులిదేదీ అర్థం కాకుండా అయోమయావస్థలో వున్నారు. ప్రతిరోజూ రాజభవనంమీద ఆకాశాన అల్లంత

ఎత్తులో ఎగురుతూ పక్షీరూపంలో కనబడేవాగు ఆమెసోదరులు. తనను గురించే తన సోదరులు విచారపడు తున్నారని తెలుసుకుంది సౌదామిని. తన పనిమాత్రం మానలేదు.

ఆమె భర్త ఐన రాజు పేరు చంద్ర కాంతుడు. అతను చాల మంచి స్వభా వం కలవాడు. కౌడూ, కపటం లేని హృదయం. అందువల్ల ఇతర్లను అంద రినీ మంచి వాళ్లే అనుకునేవాడు. అతడి కొక మారీచుడిలాంటి స్నేహి తుడుండేవాడు. అతడి పేరు కుటిలుడు.

కుటిలుడికి, చంద్రకాంతుడు సౌదా మినిని పెళ్లి చేసుకోవడం కంటకంగా వుంది. చంద్రకాంతుడి తర్వాత ఆ రాజ్యం తనకే వస్తుం దని ఆశ పడు తూన్నాడు ఇప్పుడు చంద్రకాంతుడికి సంతానం కలగొచ్చు. ఆ పుట్టబోయే వాకే ఈ రాజ్యం సంక్రమిస్తుంది, తనకు కాకుండా. కాబట్టి ఈ రాణీని ఎలాగైనా ముగించేయా లనుకున్నాడు. సమయం ఎదురు చూస్తున్నాడు.

ప్రతిరోజూ సౌదామిని కోట్లు తయారు చేస్తూనేవుంది. ఇంకో రెండు కోట్లు తయారయాయి. కాని ఇంతలో ఆ పూల మొక్కలన్నీ అయిపోయి నాయి. కొత్తవి తెప్పించుకోడానికి తన భర్త ఊళ్లో లేడు.

ఇక సాయంగానే సౌదామిని మొక్కలకోసం ఊరంతా గాలిం చింది. కాని కట్టకడకు కొన్ని మొక్క లొకచోట కనబడినాయి. కాని అవి శ్మశానలో వున్నాయి. ఆ చోటికి వెళ్లి పూలు తెచ్చుకోడం రాణీకి భావ్యం కాదు. అందువల్ల రాత్రి పూట వూరంతా మాటుమణిగిన తర్వాత రహస్యంగా, ఒక దీపం తీసుకొని అక్కడికి వెళ్లి ఆ పూలు తెచ్చుకునేది.

చంద్రకాంతు డూళ్లో లేని సమ యంలో అతని స్నేహితుడు రాజ్యం వెలగబెడుతున్నాడు. రాణీ ఈవిధంగా రాత్రిళ్లు ఎక్కడికో వెళ్లడం, రావడం చూచాడు. ఆమె ఎక్కడికి వెళు తోందో కూడా కనిపెట్టాడు. తను చేయదలచుకున్న పనికి మంచి ఒడుపు చిక్కిం దనుకున్నాడు.

ఆ నగరంలోని కొందరు పెద్దలను పిలిపించాడు కుటిలుడు "చూడండి! రాత్రిళ్లు రాణి ఏంచేస్తుందో గమనిం చండి" అని వాళ్లతో చెప్పాడు. ఆమె రాత్రిళ్లు ఒంటరిగా శ్మశానానికి వెళ్లి, రావటం వాళ్లంతా చూచారు.

అప్పుడు కుటిలుడు వాళ్లతో ఇలా అన్నాడు: "ఈమె ఏదో మంత్రసాధన చేస్తోంది. ఈమెవల్ల దేశానికి ఏదో చేటు మూడబోతోంది. ఓవేళ ఈమె మన రాజుఉసురుకే ఎసరు పెట్టిందో, ఏమో! అతను ఊళ్లో లేని సమయం చూచి ఈ పని పెట్టుకుంది. లేకపోతే రాణికి శ్మశానంలో ఏమి పని? ఎప్పుడూ నోరు కదలించి ఒక్క పలు కైనా పలకదే ఇవన్నీ చూస్తే ఈమె ఒక మాంత్రికురాలని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఈమెవల్ల ఏదో అనర్థం వుంది!" అన్నాడు.

ఆ గుమిగూడిన పెద్దలంతా అతని సిద్ధాంతాన్ని ఏకగ్రీవంగా ఆమోదిం చారు. మాంత్రికురాలిని చంపేయాలి సిందే అన్నారు.

"మన రాజుది చాల మెత్తని మనస్సు. ఎంత దుర్మార్గురాలైనా చంపడు. అందుచే అతను తిరిగి వచ్చే లోపలే మన మీా పని ముగించాలి" అని చెప్పాడు కుటిలుడు. సరేనన్నారు గ్రామపెద్దలందరూ.

అప్పుడు కుటిలుడు సౌదామిని చెంతకు చేరి "నీ వొక మాంత్రికురాల వని ఈ నగరపెద్దలంతా నిర్ణయిం చారు. కాబట్టి రేపు నిన్నీ రాజభవ నం ముందే, అందరూ చూస్తుండగా, బతికుండగానే కాల్చేస్తారు. ఇది రాజాజ్ఞ!" అని చెప్పాడు.

సౌదామినికి, ఇంత బతుకూ బతికి ఈ నాటికి ఇంతటి దుస్థితిపాలు కావలసి వచ్చింది. కాలప్రభావం! తనను దయ చూచేవా రెవ్వరూ లేరు. చంద్ర కాంతుడా వూళ్లో లేడు. తన సోద రులా పిట్టలు! ఆమె కేం గతి? ఇప్ప టికి తొమ్మిది కోట్లే అయినాయి. ఇంకా ఒక కోటు తయారువాలి.

రాజు చంద్రకాంతుడు గుర్రం మీాద ప్రయాణమై పోతున్నాడు. అత నికి, నెత్తికి పైగా ఆకాశంలో ఎగు రుతూ తెల్లపిట్ట కనబడింది. ఆ పిట్ట గభాలున కిందికి దిగి అతని గుర్రం తల మీాద వ్రాలింది. గుర్రం భయ పడి పోయి వెనక్కు మళ్లి రాచనగరు వైపుకే పోసాగింది. వెనక్కు మళ్లిన ప్పుడు పిట్ట ఏమీా చెయ్యడంలేదు ముం దుకు సాగినప్పుడల్లా ఆ పిట్ట గుర్రం తలమీాద వచ్చి కూర్చునేది. గుర్రం భయంతో వెనక్కు లాగేది. ఈలా అతని ప్రయాణం సాగకుండా చేస్తోంది పిట్ట. అప్పుడు రాజు ఆలోచించి చూచాడు: "ఈ పిట్టకు నెత్తిమీాద కిరీ టంలాంటి బంగారుగీత లున్నాయి. ఇది ఒక దేవతాపిట్ట. సామాన్యపక్షి కాదు. ఇది, వెనక్కు మళ్లి వూరికి చేరమని నాకు చెప్పడానికే వచ్చింది. ఇదీ, దీంతో ఇంకా కొన్ని పిట్టలూ సౌదా మినితో వచ్చాయి. అది మొదలివి రోజూ కనబడుతూనే వున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఈ పిట్ట, నా రాణీకి ఏదో ఆపద సంభవించిందనీ, ఆమెను కాపా డ్డానికి నన్ను వెనక్కు వెళ్లమంటోం దనీ తోస్తోంది. శీఘ్రంగా ఇల్లు చేరు కుంటా" అనుకుని వెనక్కితిరిగి బహు వేగంగా వస్తున్నాడు.

ఆ రాత్రంతా మేలుకుని రాణీ ఆఖరికోటు తయారు చేస్తూనేవుంది. రాజు రాత్రంతా గుర్రంమీాద స్వారీ చేస్తూనే వున్నాడు. ఆ పిట్టా అతని తలకు నేరుగా గుండ్రంగా చుట్టూ— 'క్వీక్లీ, క్వీక్లీ' (ఇప్పటికీ ఆజాతిపిట్టకూత అలాగే వినబడుతుంది. ఆ యింగ్లీషు పదానికి అర్థం 'వేగిరంగా' అని) అంటూ చంద్రకాంతుణ్ణి తొందర పెడుతూనే వుంది.

పొద్దు పొడిచింది. ఆమె తయారు చేస్తూన్న కోటూ సిద్ధమయింది.

ఆ నగరంలోవుండే జనమంతా రాజభవనానికి ముందు పోగుఅయారు. ఆకాశాన పిట్టలు గిరికీలు కొడుతూ గోలపెట్టున్నాయి. అవెందుకలా ఆక్రో శిస్తున్నాయో అర్థమవక విస్తుపోయి చూస్తున్నారు ప్రజలంతా.

సౌదామినిని— అంటే రాణీని, కాల్చేయడానికి అక్కడ కట్టెలతో ఒకచితి ఏర్పాటు చేయబడింది. దాన్ని మంట పెట్టడానికి ఒక్కడు నిప్పుతెచ్చాడు. ఒకపట్ట నిప్పుమీాద వాలి దాన్ని కిందికి తోసేసింది. అది ఆరిపోయింది. ఇంకోసారి మరొకడు వెళ్లి నిప్పు తెచ్చాడు. మళ్లీ పిట్ట మనుపు లాగే చేసింది. ఇలా ఎందరో, ఎన్ని సార్లో నిప్పు తేవడం పిట్ట తన్ని దాన్ని కిందికి తోసేయడం, ఆర్పేయడం జరిగింది.

ఇలా కాదని కట్టుగా కొంతమంది వెళ్లి అందరూ నిప్పు తీసుకొచ్చారు. కట్టెలకు అంటించారు. ఆ చితి అప్పుడే నిలువెత్తున మంట అందుకుంది. భయం కరంగా ఎర్రనాలుకలు చాపుకొంది అగ్గి. ఇంక ఒక్క నిమిషంలో రాణీ బూడిద ఐపోతుంది!

కుటిలుడూ, అతని పరివారమూ రాణిని ఆ మంట వద్దకు తీసుకొ చ్చారు. ఆమె తనతో తయారుచేసి ఉంచినపది కోట్లు మాత్రం తెచ్చుకుంది.

చంద్రకాంతుడు సరిగ్గా అదే సమయానికి నగరికి చేరుకున్నాడు. తనయింటి ముందు లక్షలకొలదీ జనం మూగివున్నారు. ఇదంతా ఏమిటా అని పాలు పోకుండా ఆశ్చర్యంగా చూస్తు న్నాడు. పిట్ట 'క్విక్-లీ, క్విక్-లీ' (వేగిరం, వేగిరం) అని అరుస్తూనేవుంది.

రాణీని రాజమహలునుండి నడిపిం చుకొని వస్తున్నారు. ఆమె తలకు సూటిగా కొంత యెత్తున తెల్లపిట్టలు ఎగురుతూనే ఉన్నయ్. వాటితో ఇప్పు డింకో పిట్ట కలిసింది. ఇప్పుడవి మొత్తం పది.

రాణీ మంటవద్దకు తేబడింది. ఆప దిపిట్టలూ ఆమెచుట్టూ చేరి నిలబడినవి.

ఇదంతా ఏదో గంద్రగోళంగా వుం దని, రాజు జనాన్ని తోసుకుంటూ ముందుకుపోయాడు. "ఆఁ! నా రాణి సౌదామిని!" అని అప్రయత్నంగా అతనినోట వెలువడింది. "ఇదేమిటీ మంట? ఈ నిప్పుతో ఏం చేయాలను కున్నారు?" అని కోపంతో గద్దించాడు.

అక్కడ కుటిలుడు కనబడ్డాడు. చంద్రకాంతుడికి విషయమంతా ఒక్క క్షణంలో తెలిసిపోయింది. ఇదేమి ద్రోహం' చంద్రకాంతుడి కళ్లు నిప్పులు కక్కుతున్నయ్. ఆ రౌద్రమూర్తిని చూచి జనం అంతా ఎక్కడివా రక్క డికి ఒక పిట్టా మిగలకుండా చెల్లా చెదరై పారిపోయారు.

"వేగిరం రాణిని నిప్పులోకి తోసె య్యండి" అని అరిచాడు కుటిలుడు.



ఢిల్లీలోని ప్రెస్‌ఫొటోగ్రాఫర్ శ్రీ కమలా కుమార్, దంపతులు. ఠాకూర్ సాబ్ గారి, కుమార్తె, శ్రీమతి నిర్మల వధువు.


అప్పుడు సౌదామిని తన చేతి ఉన్న పదికోట్లూ ఆ పిట్టలమీాదకు విస రేసింది. ఆ పదిపిట్టలూ రాజకుమా రులుగా మారిపోయినయ్. వాళ్లపుడు కుటిలుణ్ణి పారిపోకుండా పట్టుకున్నారు. అమాంతంగా అతణ్ణి ఆ అగ్గిలోకి తోశేశారు. కుటిలుడు త్రుటిలో భస్మం!

"నారాణీ, ఇకనైనా నాతో మాట్లా డుదువా?" అంటూ చంద్రకాంతుడు సౌదామినిని కౌగలిలోకి తీసు కుని "ఎలాగో అదృష్టవశాన నిన్నీ రోజు కాపాడుకోగల్గాను. సౌందర్య నిధీ, మనం చాలా ధన్యులం!" అంటూ ఆమెచెక్కిళ్లు మృదువుగా స్పృశిం చాడు.

ఇక వాళ్ల కష్టాలన్నీ గట్టెక్కాయి. వాళ్ల కిక స్వర్గానందం!

ఇప్పటికీ సముద్రప్రాంతాల్లో పిట్టలు 'క్విక్-లీ క్విక్-లీ' అంట కూక లేస్తూ ఎగురుతుంటాయి. అవెందు కలా అరుస్తాయో మీా కిప్పుడు తెలిసి వుంటుంది.

దేవుడు మేలు చేయదలచుకుంటే, మనుష్యమాత్రుడు కీడు చేయదలచు కున్నా అది సాగదు!



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

30

అన్నమయ్యాగారి రచన: (సంపు ౨; ప. ౧౨)

బౌళి రాగం - త్రిపుట తాళం

[పల్లవి]

(౧) , , గ ప ధ సా , సా | స సా ని స ని ధ ధ పా , | పా , గా ప ధా ని ధ పా | ప గ ధ ప ధా , ,
అ య్యా యే మ రి నా డ నే న ప్ప డే మై యుం టి నో

(౨) , , గ ప ధా రి స సా గ రి | రి సా స ని ధా ధ పా , | ప ధ గ గా ప ధా రి స స ని ధా | ప గ ప ధ ని ప ధా , ,
అ య్యా యే మ రి నా డ నే న ప్ప డే మై యుం టి నో

(౩) , , గ ప ధ స రి గా రి రి గ | రి స సా స రి ని ధ ప ని ధ పా | ప ధ గ గా ప ధ ధ గ రి స ని ధా | ప గ ధ ప ని ధ ధా , ,
అ య్యా యి , మ రి నా డ నే , , న ప్ప డే మై యుం టి నో

(౧) , , గ ప ధ స ని ధ ధ ప | పా గ గ ప గ గ రి సా | , స ధ స రి గా రి | గా , , , , ,
అ య్యొ డ నీ దా స నై తే ఆ ద రిం తు గా

(౨) , , గ ప ధ రి స రి స ని ధ ప | గ ప ధ స ని ధ ప గా రి సా | , సా స ధ స రి గ రి గ ప ప గ | గ ప ధ స రి గ రి రి స ని ధ ధ ప ప
అ య్యొ డ నీ దా స నై తే ఆ ద రిం తు గా
గ రి స రి గ ప ధా గ రి రి స సా , , ||
అ య్యొ

[చరణం]

, ప ధ పా , ప | పా , ప గ ధ ప ధా | , ప గ ప ప ధ ని ధ ప | ప గ పా ధ ప ప గ గ రి సా
అ ల్లనా డు బా లు డ వై ఆ వు ల గా చు వే ళ

, స రి గా గ రి | గ ప గ ప ధ ప గ రి సా | , ప రి గ పా గ | ప ధ ప ధ ని ధ పా , ,
గొ ల్ల ర దూ డ నై తే చే రి కా తు వు గా

(౧) , స స ని ధ పా | పా గ ప ధ ప పా ధ ప ధా | , ప గ పా ధ సా , | స రి గ రి , సా ని స ని ధ ధ ప ప గ
వ ల్లె గా వి టుం డ వై రే ప ల్లె లో నుం డే నా డు

(౨) ప ధ స రి స రి స ని ధా పా | ప ధ ప ధ ధ రి స ని ధా ప ధ | ధ ,, ,, ని స ని ధ ధా
వ ల్లె గా వి టుం డ వై రే నా డు

, ప ధ స రి గ ర గా | రి గ సా , ని స ని ధ పా | , ప గా ప ధ సా , ని ధ పా | ప గ ధ ప ధా ప గ ప ప ధ ధ ప ప
గొ ల్లె త నై నా న న్ను కూ డు కొం దు వు గా
గ రి స రి (అయ్యో)

ఇట్లే క్రింది చరణములు :

(౨) మేలిమి రామావతార - వేళ రాయిరప్పలైన
కాలు మోపి బ్రతికించి - కాతువుగా;
వాలిసుగ్రీవులవద్ద - వానరమై వుండినాను,
ఏలి నన్ను బనిగొని - యీడేర్తువు గా! || (అయ్యో)

(౩) వారిధిలో మత్స్యకూర్మా - వతారములైననాడు
నీరులో జంతువ నైన - నీవు గాతువు గా;
ఈ రీతి శ్రీవెంకటేశ - యేలితివి నన్ను నిట్టె
మోరతోపున నిన్నాళ్లు - మోసపోతి గా! || (అయ్యో)

లఘుటీక : దాసిని=దాసుడను. 'స్త్రీప్రాయ మితరత్సర్వం' అన్నట్లు భక్తులందఱు భగవదపేక్షయా దాసీలే; వల్లెగా=అంగీకారముగా, బుద్ధిపూర్వకముగా: ఈడేర్తువు=కృతార్థుని జేసియుందువు; మోరతోపు=పరాఙ్ముఖత్వము.

ముద్రితపాఠములు : యేమరి సేనా డప్పుడే; ఘోరతోపున.

గాలిమేడ

(11వ పేజీ తరువాయి)

బంగళా చూస్తే, ఆ పూలచెట్లు, ఆ పరిశుభ్రతతో రమణీయంగానే వున్నది... ఆ క్షణం ఆకుఱ్ఱవాడిని లోలోన మెచ్చుకున్నది... తన కొడుకు నేవిధంగా శశి పెంచుతున్నదో అడగాలి.

వెంటనే తనకొడుకుని విచిత్రంగా ఆమె చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి...గుర్తుకొస్తూనే కమలహృదయం కంపించింది ... కంపం చే హృదయంతో నడుస్తున్న కమలకు ఆ గృహాంతర వాతావరణం, ఆ చీకటి, ఆ నిర్మానుష్యత, భయం పుట్టించాయి... చటుక్కున్న తనవనక అడుగుల సవ్వడి వినవచ్చింది... కంపంతో కమల తిరిగిచూసే సరికి వొక ముసలమ్మ నిలుచుని వుంది.

"యెవరికోసం తల్లీ వెదుకుతున్నావ్? "అడిగింది ఆమె.

"శశిగారు వున్నారా?" కమల ప్రశ్నించింది.

"లేదమ్మా! యెవరో బంధురాల్ని కలుసుకునేందు కని యిప్పుడే బయటి కెళ్లింది... యిప్పుడే వస్తుంది... యిలా వచ్చి కూచో తల్లీ...! నేనీ యింట్లో దాశీని!

కమల మాట్లాడకుండా ఆ ముసలావిడ చూపించిన గదిలో ఒక కుర్చీలో ఆసీనురాలైంది... వెళ్లిపో బోతున్న ముసలావిడని పిలిచింది కమల.

"యీ యింట్లోవున్న పిల్లవా డేడీ?"

"యే పిల్లవా డమ్మా?"

"యింకెవరు?... మీ యాజమానురాలి బంగారు బిడ్డకు!"...

కొన్ని క్షణాలవరకు దాసీ మౌనంగా నిల్చున్నది, విగ్రహంలా... తర్వాత చెప్ప సాగింది:

"ఇదొక విచిత్రగాథ తల్లీ!... యజమానురాలు చెప్పే కథను నమ్మ రన్నమాట!... ఆమెకు తనభర్త చనిపోయిన నెల తర్వాత వొక అనాకారిబిడ్డడు కలిగాడు ... వాడుపెరిగి పెద్దవాడై తన ముసలితనంలో తనకు ఆసరాగా వుంటా డని ఆశించింది... అయితే పాపం ఆ బిడ్డడు పుట్టిన కొద్ది రోజులకే నిమోనియా జ్వరంతో చనిపోయాడు. ఆదెబ్బ నామె తట్టుకో లేకపోవడం మూలంగా మతి చెడింది. డాక్టర్లు ఆమె కేలాంటి ప్రమాదం లే దంటారు. అయితే విచిత్ర మేమిటమ్మా అంటే తన కొడుకు పోయాడని ఆమెకు గుర్తే లేదు! రోజూ కొడుకు నిమాస్తుంది; మాట్లాడుతుంది; యెలా ప్రవర్తించాలో చెబుతుంది; వాడినిగురించి తీయని కలలు కంటూ వుంటుంది... ఆ ఆశే లేకపోతే ఆమె జీవించేది కాదేమో— ఆ కొడుకును గురించి ఆమె రోజూ మాటలు చెబుతుంటే నాగుండె తరుక్కు పోతుంది తల్లీ!

ద్వారంలో యెప్పుడు వచ్చి నిల్చున్నదో మరి శశి... ఆమెను చూచి కమల నిర్ఘాంతపోయింది. శశి నవ్వుతూ అంది!" మీరు వచ్చారా? రండి— మా అబ్బాయిని చూపెడతాను...ఆటలాడానికి వెళ్లాడు... యెంత తెలివైనవా డనుకున్నారు— ప్రతి పరీక్షలో ఫస్టు! నా కష్టాలు గ్రహించి డబ్బు లిమ్మని మారాం చేయడు ... నిజంగా వాడు దేవతే. అదుగో రానే వస్తున్నాడు మాటల్లోనే!...కిటికీలోంచి చూడండి...యేదో పెద్దమనిషిలా దీర్ఘంగా యోచిస్తూ,యెంత ఠీవిగా వస్తున్నాడో...!

ఖాళీరోడ్డు కేసి శశి చూపెడుతోంది... కమల మనసులో యేదో చటుక్కున మెరిసినట్టయింది. యెవరిమాటా వినిపించికొనకుండా అతి వేగంగా యింటిదోవ బట్టింది, ఆ విచిత్ర వ్యక్తిని గురించి ఆలోచనలు అదేవేగంతో పరుగెడుతూంటే...

ఇల్లు జేర్తూనే తన పిల్లలమీద కలిగిన అసహ్యం వొక్కసారిగా మాయమైంది. . అందరినీ యెంతో ప్రేమదీర ముద్దాడింది, "నా బంగారు బిడ్డలూ," అని సంబోధిస్తూ—

* * *

నెలరోజుల తర్వాత కమల తన ఆఖరిబిడ్డను శశి కిచ్చివేసిం దని క్లబ్బులో అందరూ అనుకుంటున్నారు... శశి పూర్వంలాగే ఆ కుఱ్ఱవాడిని క్లబ్బులోకి తీసుకొచ్చి పొగడ్తూనే వుంది... అందరూ వింటూనే వున్నారు... అయితే శశికి తన పూర్వం "అపురూపం బిడ్డడు" లేడని యిప్పు డున్నవాడు వేరే నని మాత్రం తెలీదు!

["హార్" ఆంగ్లరచన ననుసరించి.]

'హరికథావతంస'

కీ. శే. ముసునూరి సూర్య నారాయణ భాగవతార్

శ్రీ ఏ. వి. ఎస్. రామారావు

'హరికథావతంస' బ్రహ్మశ్రీ ముసునూరి సూర్యనారాయణ భాగవతులు విషజ్వరం కారణంగా స్వర్గస్థులైనారని విని విచారించని ఆంధ్రు డుండడు. అందులోను శ్రీరామనవమి సందర్భంలో సంగీత కచ్చేరీలు, హరికథలతో ఆనందదాయకంగా కాలక్షేపం చేయుచున్న సమయంలో ఆయనమరణవార్త రసజ్ఞుల హృదయాన్ని మరింత కలత నొందించు నను తథ్యం. గత కొద్దిసంవత్సరములుగా, అనివార్యమైన కారణ ముంటేనే తప్ప, ఆయన హరికథ లేని శ్రీరామనవమి, గణపతి నవరాత్రమహోత్సవాలు ఆంధ్రదేశమందలి ఏపట్టణంలోను జరుగలేదు. ప్రతి సంవత్సరం, అధమం ఒక్కమారైనా, ఏదో ఒక సందర్భంలో, ఆంధ్రులున్న ప్రతి పట్టణమందు, ఆంధ్రులచే నిర్వహింప బడుచు సంస్కృతిగల ప్రతి సంస్థయందు ఆయన హరికథాక కాలక్షేపము విధిగా జరుగ వలసినదే! దక్షిణమున అటు చెన్నపట్నము మొదలు ఉత్తరమున ఖరగ్‌పూర్ వరకు, పశ్చిమమున నాగపురం మొదలు తూర్పున కాకినాడవరకు ఆయన కీర్తి వ్యాప్తినొందిన దనుటలో అతిశయోక్తి లేదు. ఆయనమృతి ఆంధ్రహరికథకలోకానికి గొప్ప లోటు!

ఆంధ్రావనిలో శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారు ఒక అపూర్వమైన వ్యక్తి. ఆయన ప్రతిభాసామర్థ్యములు, బహు భాషా పాండిత్యము, గభీర సంగీత పరిజ్ఞానము మరి యొక వ్యక్తిలో కనబోము. ఆంధ్రదేశములో హరికథ బహుళవ్యాప్తి గాంచుటకు ఆ మహనీయుడే కారణభూతుడు. ఆయన శిష్యకోటి ఆంధ్రదేశమం దంతట నేడు వ్యాప్తమై యున్నది. శ్రీ సూర్యనారాయణ భాగవతులు నారాయణదాసుగారి శిష్యులు కారు. కాని నారాయణదాసుగారి ఆశీర్వచనమును, మెప్పును పొందిన హరికథకులు. నారాయణదాసుగారు 'సూర్యనారాయణవంటి శిష్యుడు లభ్యపడ లేదు' అని పెద్ద కాలములో పలుమార్లు చెప్పినట్లు వినిన పెద్దలు వచింతురు. సరస్వతీ ప్రసన్నలగు నారాయణదాసుగారి మెప్పును పొందిన శ్రీ సూర్యనారాయణ భాగవతర్ గారి హరికథా కాలక్షేప ప్రతిభను గూర్చి వేరే వ్రాయవలసిన దేమున్నది?

నారాయణదాసుగారి హరికథా సంప్రదాయము రాగ, తాళ, నాట్య సమ్మిళితమై యుండును. ఆధునికులలో కొందరికీ పద్ధతి రుచింపదు. సూర్యనారాయణగారి గురువుగారైన పెద్దింటి సూర్యనారాయణ దీక్షితార్ గారు నవీనుల అభిరుచి ననుసరించి మృదు మధుర ము సరళము అయిన భాషలో ద్రాక్షాపాకశైలలో హరికథలు వ్రాయుటయందు నిపుణులు. వారు రచించిన హరికథలు చాల గలవు. వీరి సంప్రదాయపు హరికథలలో నాట్యమునకు ప్రాధాన్యత తక్కువ; అసలు లేదనియే చెప్పవచ్చు. దీక్షితార్ భాగవతార్ గారు గొప్ప హరికథా రచయితలు; సంగీత ప్రజ్ఞా సమన్వితులు. కాని పరమేశ్వరుడు వారికి మంచి గాత్రమును ప్రసాదించలేదు. ఆయన ప్రథమ శిష్యుడు—సహచరు డని దీక్షితార్ పలుకుచుందురు—ముసునూరి సూర్యనారాయణగారు గొప్ప హరికథకులు. సాధారణంగా కవి తనకు తానై కథ చెప్పనప్పటి ఆనందము ఇతరులు చెప్పినపు డుండదు. కాని సూర్యనారాయణగారి విషయంలో మనకీ లోటు కనిపించదు. ఆయన తనంతట తాను హరికథా రచయిత కాకపోయినను, కవియొక్క భావములను సమగ్రముగా అవగత మొనర్చుకొని, శ్రోతలకు వానిని, మనస్సునకు హత్తునట్లుగా వ్యక్తపరచి చెప్పుటలో అపూర్వమైన ప్రతిభ నార్జించినారు. సన్నమైనను ఇంపైన గాత్రము, పరిమితమైనను విమలమైన సంగీత జ్ఞానము, కవి గాకపోయినను చక్కని సమయస్ఫూర్తి, గొప్ప ఉపజ్ఞత, అన్నిటికిని మించి వచనము చెప్పుటలోని నిపుణత ఆయనను హరికథకునిగా విఖ్యాతుని గావించినవి. సంస్కృతరహితమైన పిట్టకథలు కథమధ్యలో ఆయన ఎన్నడూ చెప్పిఎరుగడు.

సూర్యనారాయణ, దీక్షిత, భాగవతారు లిరువురు సమకాలికులై, ఒకే ప్రాంతములో జన్మించుట వాస్తవంగా ఆశ్చర్యకరమైన విషయమే! వారి దొక అపూర్వమైన సమ్మేళనము. ముసునూరిని శిష్యునిగా బడసిన దీక్షితర్ గారు ఎంత అదృష్టవంతులు! దీక్షితరుగారి హరికథలను సూర్యనారాయణగారి ముఖతః వినని ఆంధ్రుల అదృష్టమును గూర్చి ఇంక వచింపనే అక్కరలేదు. అది వారి పూర్వజన్మ సుకృతం!

సూర్యనారాయణ భాగవతులు ఆంధ్రదేశమందలి పెక్కు పట్టణములలో భారతచరిత్రను సంపూర్ణముగా హరికథలుగా కాలక్షేపము చేసినారు. 'కృష్ణరాయబారము' ఆయనసొత్తు. దేశాభిమానము హృదయమునందు పెంచుకొని, బానిస ఉద్యోగమునకు స్వస్తిచెప్పి, స్వతంత్రమైన జీవనోపాధిని కాంక్షించి హరికథారంగమున ప్రవేశించిన మనిషి యగుటచే భారత స్వరాజ్య సమరగాథ ఏదో రూపంలో ప్రతిహరికథయందు ఆయననోట వినవచ్చుచుండెడిది. గడియారం వేంకటశేషశాస్త్రిగారు రచించిన శ్రీ శివభారతముపై ఆయనకు మక్కువ ఎక్కువ. శివాజీ చరిత్రను హరికథరూపంగా కాలక్షేపం చేసెదనని ఆయన ఇదివల పలుమార్లు వచించినారు గాని ఆంధ్రుల దురదృష్టకారణంగ ఆ కార్యక్రమం పూర్తి కాకుండగనే మృత్యు వాయనను పొట్టబెట్టుకొన్నది.

శ్రీ సూర్యనారాయణ భాగవతర్ గారికి నలుబది ఏండ్ల కంటె హెచ్చు వయస్సు లేదు. వృద్ధిలోనికి వచ్చి, తన కృషి ఫలించుచుండుట గాంచి ఆనందించుచున్న సమయంలో ఆయన జీవితం సమాప్తమైనది. స్థూలమైన భౌతిక దేహాన్ని త్యజించి ఊర్ధ్వగమనాన్ని పొందిన ఆత్మ, తదనంతరంకూడ ఇహలోకంతో సంబంధం పెట్టుకోవడమే నిజమైనట్లయితే, సూర్యనారాయణ భాగవతుల సూక్ష్మశరీరం రెక్కలు రాని పిల్లలు, భర్తృవిహీనయైన భార్య, పూటకు గడవక సంసారంలో ఇబ్బంది పడుటను గాంచి, పరితప్త ఎంత మగుచుండునో!

'అన్నీ ఉన్నాయి, అల్లునినోట్లో శని' యన్నట్లు ఆంధ్రదేశంలో డబ్బుకుగాని రసజ్ఞులకుగాని లోటు ఏమీ లేకపోగా అదేమి ఖర్మమోగాని సంగీత కళకు— అది ఏ రూపంలో అయినప్పటికిని— చేపట్టిన వ్యక్తి మన దేశంలో బ్రతికియున్నంతకాలం డబ్బుకు యిబ్బందిపడడం, చనిపోయిన తరువాత తనపై ఆధారపడిన పెద్ద సంసారమును ఇబ్బందిపాల్జేయడం దురదృష్టకరం. ఉత్తరోత్తరా పరిస్థితులు ఈ రీతిగనే నిరుత్సాహకరంగా ఉండినట్లయితే సంగీత విద్య మనదేశంలో సమూలంగా నాశనమయిపోవుట తథ్యం. కాగా సంగీతవిద్యని ఇంకా హెచ్చుగా పోషించి దానియెడల ఉదారంగా ప్రవర్తించడం మనం నేర్చుకోవాలి. ఇక శ్రీ సూర్యనారాయణగారి హరికథలను విని, తన్మయత్వమును పొంది 'ఓహో' యని ఆయనను పొగడిన రసజ్ఞులు తృణమో, పణమో ఈనాడాయనకుటుంబమునకు సహాయం చేస్తే, వారి రసజ్ఞత సార్థకపడుతుంది.

శాస్త్రసాధన

శ్రీ టి. వి. నారాయణరావ్

మానవుడు సంఘజీవి. మానవుల సముదాయమే సంఘం. అయితే ఆ మానవులకొక సహజమైన సామ్యలక్షణం ఉండాలి. అందరియొక్క సామాన్యలక్షణాలలో ఒకరకమైన శాస్త్రీయలక్షణం కలిగియుండడం పరమధర్మం. ఆ లక్షణం గతంగా వస్తున్న అనుభవాన్ని ఆక్రమణ చేసుకుంటుంది. ఎప్పటి కప్పుడు విశ్వాసమకంగా ఉన్నా శాస్త్రజ్ఞానం చేయకలిగిన మార్పుకు తావు ఏర్పడుతూంది.

మానవుడుచుట్టూ ప్రకృతి వుంది. మానవుడు ప్రకృతిలోనుంచి వచ్చాడుగనుక, మానవుడు ప్రకృతిలో నొక భాగమే. మానవుడు ప్రకృతిచే చుట్టబడియున్నాడుగనుక, ఎల్లప్పుడు ప్రకృతి మీద ఆధారపడియుంటాడు. మానవుడు తన సుఖంకోసం, కోర్కెలుకోసం ప్రకృతితో పోట్లాడుతాడు. ఆ పోట్లాట ఫలితంగా కొన్ని సూత్రాలు తెలుసుకుంటాడు. యీ సూత్రాల యొక్క సముదాయమే విజ్ఞానం. యీ విజ్ఞానం గురించి తెలిసికొనే శక్తి, తెలిసికోవాలనే జిజ్ఞాసకూడా ఉన్నాయి. శాస్త్రంగురించి తెలుసుకోవాలంటే విజ్ఞానాన్ని శాస్త్రీయంగా అలవరుచుకోవాలి. శాస్త్రమంటే ప్రకృతినిగురించి అనేకవిధాలుగా మానవుడు సముపార్జించిన జ్ఞానమే. ఈ జ్ఞానాన్ని (శాస్త్రం) అనేకశాఖలుగా విభజించవచ్చును. అవ్వే వివిధశాస్త్ర భాగాలు.

అయితే, పైచెప్పిన జ్ఞానం ఎందుకు సంపాదించవలసివచ్చింది? మానవునిచుట్టూ వున్న ప్రకృతినిగూర్చిన చైతన్య ముంది. యీ చైతన్యముండి, ప్రకృతి స్వభావాలుగురించి సరియైన జ్ఞానం లేనప్పుడు, మానవుడు ప్రకృతినిగురించి అనేకరకాలుగా భావిస్తాడు. ఉదాహరణకి వాన పడుతుంటే, ఆ వానను ఏ మానవాతీతుడో కురిపిస్తున్నాడనుకొనేవాడు. యిటువంటి పిచ్చి నమ్మకాలవల్ల మానవునకు లాభం లేదు. మానవుని సుఖం, కోర్కెలుకోసం జీవితపోరాటంలో నెగ్గడానికి ప్రకృతి స్వభావాలుగురించి తెలిసికోవడమూ, దానిని తన కవసరమైన పనులకు వినియోగించుకోవడమూ అవసరమయ్యె యి. అంగుచే ప్రకృతినిగురించి జ్ఞానం సంపాదించవలసివచ్చినది.

మానవుడికి తన చుట్టూ ఉన్న ప్రకృతినిగురించి తెలిసికోవాలనే కాంక్ష శాస్త్రాభివృద్ధికి కారణ మని, ఆ కాంక్ష తీర్చటం మీదనే శాస్త్రాభివృద్ధి ఆధారపడివుండాలని కొంతమంది అంటారు. మానవుడు ప్రకృతినిగురించి తెలిసికోవడం వట్టి జ్ఞానకాంక్షవలన కాక, జీవితావసరాలనుబట్టి శాస్త్రాభివృద్ధి జరుగు నని మరి కొందరు అంటారు.

మొట్టమొదట శాస్త్రాభివృద్ధి ఒక విషయాన్ని కనిపెట్టడం ఒక్కొక్కవ్యక్తిద్వారా జరగలేదు. అనేకమంది వ్యక్తులు తమ జీవితాల్ని సుఖప్రదంగా చేసుకొనే యత్నంలో ప్రకృతి గురించి జ్ఞానము సంపాదించేవారు. యీవిధంగా మానవజాతి చురుకుగా ప్రకృతినిగురించి జ్ఞానం సంపాదించింది. పశుపోషణ గురించిన జ్ఞానం మొదలయినవన్నీ ఇలాగ మొదటిలో వచ్చినవి. ప్రాచీనులు పైవిధంగా సముపార్జించిన జ్ఞానం, శాస్త్రజ్ఞానమా? కాదు. వ్యవసాయము చేయటానికి నేర్చుకొనిన మానవుడు కాలానుగుణ్యంగా వచ్చే మార్పులను గుర్తించడం అవసర మయింది. అంటే మనం శాస్త్రంగా భావించే జ్ఞానము కూడా మానవుని జీవితావసరాలవల్లనే వృద్ధయిందని తెలుసుకోగలము. శాస్త్రోక్తంగా వ్యవసాయం వృద్ధిపొందినకొలదీ, భూమికొలతలు, మొదలగు సమస్యలు వచ్చేయి. అవే జామెట్రీ మున్నగు గణితశాస్త్రభాగాలు బయలుదేరడానికి కారణ మయేయి. మానవుడు ఉత్పత్తిని ఎక్కువ చేసి వ్యాపారాలు మొదలుపెట్టేక ఒకదేశం నుండి మరోదేశానికీ ఓడలమీద వెళ్లడానికి చేసే యత్నంలో హైడ్రోడైనమిక్స్, యుద్ధాలు చేయడం మొదలుపెట్టేక డైనమిక్స్, విమానాలు, బాంబులు మొదలగు శాస్త్రాలన్నీ వృద్ధిచెందడం మొదలుపెట్టేయి. ఖనిజ పదార్థాలను, కొన్ని భూమిమీద నుండే పదార్థాలను సమ్మేళనంచేసిన బంగారం లభించగలదనే నమ్మిక, బంగారాన్ని ఇలా సృష్టించి, ఆర్థికపరిస్థితి బాగుచేసికుందామనే ఆశ రసాయనికశాస్త్రం ఉత్పత్తికి కారణ మయేయి. ఇలాగ మానవుని అవసరాలవల్లనే శాస్త్రజ్ఞానం పుట్టింది.

ఒక పనిని ఆచరణలో పెట్టడానికే జ్ఞానము సహాయపడును. అంటే జ్ఞానము ఆచరణలో పెట్టడానికే సముపార్జింపబడుతుంది. మానవుడు ఏవిషయంగురించి జ్ఞానాన్ని సంపాదించుకొన్నా, తన అవసరాలను తీర్చుకొనే నిమిత్తం ఆ పని చేస్తాడు. మానవుడు తన అవసరాలను తీర్చుకొనే నిమిత్తం ప్రకృతితో పోరాడి, దాని స్వభావంగురించి తెలిసికోవడం మొదలుపెట్టేడు. అదే శాస్త్రవిజ్ఞానం. ఇప్పుడున్న వివిధశాస్త్రాలు మానవుని జీవితావసరాలకొఱకే ఉద్భవించినాయని చెప్పవచ్చును. యంత్రయుగంతో మానవునికి లోహాలవాడుక ఎక్కువైనకొలదీ, ఈ శాస్త్రాలు విపరీతంగా వృద్ధిపొందాయి. నాల్గువేలసంవత్సరాల క్రిందట కూడా గాలి ప్రవాహాలు, నీటిప్రవాహాలు ఉన్నాయి. కాని అప్పుడు వాటిని గురించిన జ్ఞానం (శాస్త్రం) మానవునికి లేదు. మానవుడు తరుచు ప్రయాణములు చేయవలసివచ్చినపుడు, తుపానుల ప్రమాదమునుండి తప్పించుకోవలసిన అవసరం కలిగినప్పుడు వాటినిగురించిన జ్ఞానాన్ని సంపాదించేడు.

శాస్త్రజ్ఞానం నూటికి నూరుపాళ్లు పూర్తిగా మానవునిఅవసరాలకే వృద్ధిచెందింది. ఇతరత్రా వృద్ధి చెందలేదా - అనే ప్రతిప్రశ్నకి ఉదయించక తప్పదు. ఇతరత్రా వృద్ధిచెందలేదని అనుకోడం పొరపాటు. మొదటిలో వివిధశాస్త్రాలు మానవుని అవసరాలవల్లనే బయలుదేరినా, కొంతవరకు వృద్ధిచెందాక, శాస్త్రాలు మానవుని జీవితావసరాలతో సంబంధం లేకుండా, మానవుని జిజ్ఞాస తీర్చడానికి కూడా వృద్ధిచెందే యని చెప్పక తప్పదు. మానవుడి తొలిఅభిప్రాయము జ్ఞానేంద్రియముల జోక్యం వలనే కలుగుతాయి. కొంత అనుభవము ముదిరినాక జ్ఞానేంద్రియములతో సంబంధం లేకుండా చేయగలడు. అంటే మొట్టమొదట, మానవునికి భౌతికఅవసరాలనే శాస్త్రోద్భవానికి తీసేయి. తరువాత భౌతిక అవసరాలతో సంబంధంలేకుండా జ్ఞానతృష్ణ శాస్త్రాన్ని వృద్ధిపొందించింది. అయితే జీవితావసరాలతో సంబంధం లేకుండా జిజ్ఞాసను తీర్చడానికే వృద్ధిపొందిన శాస్త్రం జీవితంలో ఉపయోగంలేనిదని అనటానికి వీలులేదు. జిజ్ఞాసతో వృద్ధిపొందిం దన్న పరమాణువు గతయుద్ధంలో పరమాణుబాంబు వుపయోగంలోకి దారితీసింది. కొద్దిరోజుల్లో పరమాణువు జీవితసమస్యలను తీర్చడానికి ఆ శాస్త్రభాగం వుపయోగపడుతుం దనుకోటానికి అవకాశాలున్నాయి. యీజిజ్ఞాసశాస్త్రభాగం మొట్టమొదట మానవుడికి నిరుపయోగం గావున్నా, ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగమవక తప్పదు. ఈ పరీక్షలో మానవుడు ప్రయత్నించిన జయమొందక తప్పదు. మానవుని అవసరాల కనుగుణ్యంగా వృద్ధిపొందిన శాస్త్రభాగమూ, జిజ్ఞాసను తీర్చడానికి వృద్ధిపొందిన శాస్త్రభాగమూ రెండింటిని కలిసి సాధించినపుడే శాస్త్రాభివృద్ధి జోరుగా జరుగుతుం దనటానికి సందేహము ఏమాత్రమూ లేదు.

వింతలు - విశేషాలు

బరువు - తిండి

ఏనుగ తాని బరువులో నారవవంతు గడ్డి తింటే పక్షులు వాటికంటే ఎన్నో రెట్లు బరువుగల ఆహారమును ఒక దినమున తినగలవు. పక్షు లన్నిటిలో పిచ్చుక ఎక్కువ రెట్లు బరువుగల యాహారమును తింటుందట. మానవుడు వాని బరువులో ఏభైయవవంతు ఆహారమును తినును.

పిట్టకు ఈక లెందుకు?

1. దేహవేడిని బయటకు పోనివ్వకుండ ఉంచుటకు. 2. తడి దేహమునకు సోకకుండ నుంచుటకు. 3 ఎగురుటకు వీలు ఏర్పరచుటకు. 4. ఈక రంగువలన చుట్టుప్రక్కలలో లీనమై శత్రువారి నుండి తప్పించుకొనుటకు. 5. శబ్దముచేయకుండా ఎగురుటకు వీలు కల్పించుటకు. 6. వేరే పిట్టల వేష మేసుకొని తప్పించుకొనుటకు. 7. ఉపసర్పణ సమయమున ఆకర్షించుటకు. 8. గూడు వెచ్చగ నుంచుటకు బాతులు గూటి చుట్టు ఈకలమరుస్తవి. 9. బంధువులను గుర్తించుటకూ ఉపయోగిస్తవి

పండ్లు

బాలచేపలకు పండ్లుంటవి. కప్పలకు, పాములకు, కొన్ని శిలాజిత పక్షులకు పండ్లుండేవి. వివిధ విధానాలకు అనుకూలించు ప్రత్యేకతి, పాలుత్రాగెడు జంతువుల పండ్లలోనే చూడనగును. కొరికే పండ్లు; నమిలే పండ్లు బాగుగ గుర్తించవచ్చు.

వసతి గృహాలు

ఉన్ని శాలువలు దారములమధ్య ఇరికిన గాలి వలననే చలి నాపగలుగుచున్నవి. తాటాకు కప్పు, గెల్లు, వరిగడ్డికప్పు, ఎండాకాలపు వేడిని లోనికి ఎక్కువగ రానివ్వవు. మట్టిగోడలూ వేడి నెక్కువగా రానివ్వవు ఇప్పుడు సిమెంటుతో గోడలు, కప్పూ, చిన్న గాలిగదు లుంచి పోత పోస్తున్నారట. ఆ ఇండ్లు శాలువ ఆసినట్టు చలినీ ఆపుతవట, గడ్డికప్పువలె ఎరినినా రానివ్వవట

పంచేంద్రియాలు - విజ్ఞానము

గాలిలో వచ్చు కొద్ది అణువులను వాసన ద్వారా గ్రహిస్తుంది ముక్కు. ఇంతకన్నా తక్కువ పదార్థాన్ని గ్రహింపగల తూనిక విధానాలను చేతనుంచింది విజ్ఞానము. చిటికంత వస్తువును నాలుక రుచిద్వారా గ్రహిస్తుంది. నాలుక గుర్తింపలేని రుచిని రసాయనిక శాస్త్రవిధానాలలో గుర్తింపగలిగారు. మన దేహము వేడిని, వత్తిడిని గ్రహిస్తుంది. వేడిమాపకాలతో కొద్ది వేడినుండి మహోష్ణోగ్రతను కచ్చితంగా కొలువ గలుగుతుంది భౌతికశాస్త్రము. స్పర్శనలో అతి సూక్ష్మభేదములు మాపగలుగు బారమితులున్నవి. మన చెవికి అందుబాటులోలేని మూపు శబ్దాలనూ వినిపిస్తుంది రేడియో. చిన్న శబ్దాలను గుర్తిస్తుంది మైక్రోఫోను. కట్టికంటితో ఏరా ఒక మైలుదూరము చూడగలిగాము. దూరదర్శినితో లక్షలాదిమైళ్లు మాడగలిగాము. కంటికగపడని నలుసు జ్వరప్రక్రియలను పదిహేడు సేలంతలుగా చూపిస్తుంది ఇప్పటి సూక్ష్మదర్శని. ఈ యంత్రాలవలన మనకు పంచేంద్రియ సూక్ష్మతి చేకూరిందనవలెను.

చెట్ల వయస్సు

రెండువందల సంవత్సరముల వయస్సున్న చెంచితట్లుండవచ్చు. వీటికిమించిన వయస్సున్న జువ్విచెట్లుండవచ్చు. మూడువందల సంవత్సరములనాటి మఱ్ఱిచెట్లు కనిపించవచ్చు. వెయ్యి సంవత్సరముల క్రితము మనదేశమునుండి కొని పోయి వేసి పెంచిన బోధిచెట్టు ఇప్పటికీ లంకలోనూ, సయామ దేశమునను చూడవచ్చుట. అమెరికాలో ఎఱ్ఱ చెక్క చెట్లున్నవట. అవ్రాను చాల లావట. ఒకదానిలోనుండి తొఱ్ఱచేసి కారులను నడిపించు రోడ్డు వేసినా అది చావలేదట. ఇవి రెండువేల సంవత్సరముల వయస్సు గలవని ఊహ. చెట్టుమానుకు అడ్డము కోత వేసిన చక్రాలు కనపిస్తవి. ఆ చక్రాలు ఎన్ని ఉంటే అన్ని సంవత్సరముల వయస్సనవచ్చు.

పువ్వుటైమ్

ఒక్కొక రకపువ్వు, ఒక్కొక టైముకు తెరుచుకుంటుంది, మరొకటైముకు మూసుకుంటుంది. కొన్నిపూలు ప్రొద్దుననుండి మధ్యాహ్నమువరకూ తెరుచుకుంటాయి. మరికొన్ని పగలంతయు తెగచి అట్టానేకుంటాయి. రాత్రులే తెరచుకొని సువాసన వెదజల్లేయి కొన్నున్నాయి. రాత్రంతా తెరచుకొని ప్రొద్దునకు వాడిపోయేవీ ఉన్నాయి.

కోత!

అమెరికాలో సంయుక్త రాష్ట్రములలోని కోలరేడోనది రాతికుండి, పన్నెండుమైళ్ల లెపల్పున ఒకమైలులోతున, మార్గమును కోసిన దట.

పాములు

పాము ఎసమువిసరు దాని ఆరోగ్యస్థితిని మాపును. జబ్బుపాము ఎసము విడుచుట కష్టము.

లోకమంతటిలో పాములు లేని దేశము ఐర్లెండే!

గొప్ప, మోతలే!

లోకమంతటిలో పెద్దశబ్దము-1883వ సంవత్సరము, ఆగస్టు 27వ తేదీన వినిపించింది. ఆరోజు క్రకోలుద్వీపమునందుగల అగ్నిపర్వతము బద్దలైంది; ఆద్వీపములో మూడవభాగము మిగిల్చి; రెండు భాగాలను గాలిలోనికి తన్ని వేసింది. ఆశబ్దము మూడువేలమైళ్ల దూరమున నున్నవారికి వినిపించింది. మరి లోకమంతటి విస్తీర్ణతలో ఎనిమిదవంతుకు వినబడ్డది.

డబ్బు — డబ్బు

గవ్వనాణ్యము లిప్పటికీ ఆఫ్రికాలో కలవట. ఒకప్పుడు అమరావతిప్రాంతమున సీసపునాణ్యము లుండేవట. కంచు, ఇత్తడి, రాగి నాణ్యములటులుంచి, నికెలు, వెండి, బంగారునాణ్యములు చాల శతాబ్దములనుండి మనుష్యులు వాడిరి. రష్యాలో ఒకప్పుడు ప్లేటినమ్ నాణ్యముల వాడిరట. దాని ధరకనుగొని మనవలె తదితర నాణ్యములకు దిగిరట వారు. తోలుముక్కలు తుగ్లక్ చెలామణీచేస్తే, ఇప్పుడు నోటు లను నవి నాణ్యమైనవి.

దూయుట — దురద

దురదగొండితకును మెల్లగ పట్టుకొన్నచో, దురద జాస్తట! త్వరితముగ దూసిన, అంతగా దురద దనిపించదట.

"వలపర్ల"

వేదయుగమునాటి భారతావని

(6 వ పేజీ తరువాయి)

26. నిషధ—ఇది నలమహారాజేలిన దేశము దీని ముఖ్యపట్టణము అలకానగరము - అలకానందయను నదీతీరమునం దున్నది ఉత్తరహిందూస్థానమందలి ప్రస్తుతము కోమాన్ (*Kumoan*) అయియుండవచ్చునని చరిత్ర పరిశోధకులు వ్రాసియున్నారు.

27. పాంచాల— గంగా, యమునల మధ్య ప్రదేశము అని రాజశేఖరకవి, బాలరామాయణమునందు విశదీకరించియున్నాడు. ద్రుపదుని పరిపాలనాకాలములో, చార్మన్వతీ తీరము కి, ఉత్తరదిశగా గంగాముఖద్వారమువరకు వ్యాపించియుండెడి దని ప్రతీతి. భాగీరథీ నదికి వుత్తరముగా నుండే ప్రదేశమును వుత్తరపాంచాలమనియును, దక్షిణముగా నుండు ప్రదేశమును దక్షిణపాంచాల మనియు పేర్కొనుచుండెడి వారు. ద్రుపదుని మరణానంతరము, దక్షిణపాంచాలము హస్తినాపురమునకు చేర్చబడినట్టు చరిత్రకారులు వ్రాసియున్నారు.

28, పద్మపుర—ఇది మహాకవియగు భవభూతిజన్మస్థానము. నాగపూర్ జిల్లాలో భాంధాప్రాంతమునం దుండెడిది.

29. పద్మావతి—మాళవదేశములోని, నార్వారు అనే ప్రాంతము సింధునదీతీరమునం దున్నది. పార్వతీ, లూనా, మధువార్ అను నదుల నీటిచే తడుపబడుచున్నది. వీటికే, పారా, లవణ, మధుమతి అను నామాంతరములు కూడ కలవు ఈ ప్రాంతమును మనస్సునం దిడుకొనియే భవభూతి మహాకవి మాలతీమాధవీయ మను మహాకావ్యమును రచించినాడు.

30. పాటలీ పుత్రము—ఇది మగధదేశాంతర్భాగమునందలి ముఖ్యనగరము. బీహారునకు దక్షిణముగా నుండెడి గంగా - సాన్ నానదుల సంగమస్థానమందు నిర్మింపబడినది. దీనికి కుసుమపురము, పాలిహోత్ర మను నామాంతరములు కలవు -క్రీ. శ. 8 వ శతాబ్ది మధ్యకాలములో వరదలవల్ల యీనగర మందు ప్రదేశము నీట గలసిపోయిన దని చెప్పుదురు.

31. పాండ్య—హిందూదేశము యొక్క దక్షిణాగ్ర ప్రదేశము. చోళదేశమునకు ఆగ్నేయ దిశయం దుండెడిది. మలయపర్వత శ్రేణియు, తామ్రపర్ణినదియు యీదేశపు సరిహద్దులు. ఈ ప్రాంతమే ప్రస్తుతపు తిరునల్వేలిజిల్లా భారతీయుల దివ్యక్షేత్రములలో నొకటియగు రామేశ్వర మీ పాండ్యదేశములోనిదే. దీని ముఖ్యపట్టణము నాగపట్టణము (పాములనగరము) అని కాళిదాసమహాకవి వర్ణించియున్నాడు. బహుశా ఆధునికమునందు, నాగపట్నం అని పిలువబడే పట్టణమే యైయుండనోపును. ఇది మద్రాసునకు దక్షిణమున 160 మైళ్ళదూరమునం దున్నది

32. ప్రతిష్ఠాన-చంద్రవంశపురాజులగు పురూరవులకు రాజధాని - ప్రయాగ అనగా యిప్పటి అలహాబాదు నగరమున కెదురుగా నున్నది. గంగానది వొడ్డున వుండెడి దని హరివంశమునందు వర్ణింపబడినది. గంగా యమునల సంగమస్థానమం దుండెడి దని విక్రమోర్వశీయ మను నాటకమునందు వర్ణింపబడినది

33 పారియాత్ర—ఇదియొక పర్వతమయ ప్రదేశము - బహుశా యిది సేవాలిక్ పర్వతశ్రేణియై యుండనోపును. హిమవత్పర్వతముల కెదురుగా వ్యాప్తిగాంచియున్నది. యీశ్రేణి గంగానదీమైదానము సంరక్షించుచుండును.

34. మగధ—బీహారునకు దక్షిణముగా నుండు దేశము మాగధులకు నివాసస్థానము. దీని ప్రాచీన ముఖ్యపట్టణము గిరివ్రజనగరము దీనికే రాజగృహ మను పేరుకూడ కలదు. ఈ నగరము, విపులగిరి, రత్నగిరి, శోణగిరి, ఉదయగిరి వ్యాహారగిరి అను అయిదు పర్వతములమధ్య నున్నది. దరిమిలాను దీనిని పాలించు రాజులు పాటలీపుత్రమును రాజధానిగా జేసికొనిరి. మగధదేశమునకే కీకటదేశము అని కూడా పలువబడుట కలదు.

35. మత్స్య లేక విరాట—ధోల్పూరునకు పడమరగానున్న ప్రదేశము రోహితాక్షుల దేశమునుండి, యమునాతీరముగుండా పాండవులీ ప్రాంతమునకు వచ్చినా రందురు. దశార్ణవమున కుత్తరదిశనుండి శూరసేనులు ప్రవేశించినట్లు భారతమునందు వివరింపబడినది. జైపూరునకు ఉత్తరముగా నలభైమైళ్ల దూరమం దుండే బైరాట్ నగరమే అప్పటి వైరాట్నగరమై యుండ నోపును.

36. మలయ—భారతభూమియందు వినుతిగాంచిన సప్తకులశ్రేణులలో నిది యొకటి. పడమటి కనుమలయొక్క దక్షిణభాగము. మైసూరు రాజ్యమునకు దక్షిణముగాను, తిరువాన్కూరు సంస్థానము తూర్పుపరిహద్దుగాను వ్యాప్తిచెందుచున్నది. భవభూతి తనచే రచియింపబడిన మహావీరచరిత్రమందు వీటి విఖ్యాతిని విపులముగ వర్ణించియున్నాడు. ఈ పర్వతములు మిరియాలు, ఏలకులు, పోకలు, మంచిగంధపు తోటలకు ప్రసిద్ధ యని సుప్రసిద్ధ ప్రాచీన కవిపుంగవులు వర్ణించియున్నారు. మలయ, దార్దురా పర్వతశ్రేణులు రెండును, పాలనిచ్చు స్తనద్వయమువంటివి వని మహాకవి కాళిదాసు వర్ణించియున్నాడు.

37. మహోదయ—దీనినే కన్యాకుబ్జమనియు, గాధినగరమనియు పేర్కొనెడివారు- ఇప్పుడు కనూజ్ అని పలువబడే ప్రాంత మా కాలపునాటి కన్యాకుబ్జమే - ఇది గంగానదీతీరమం దున్నది - క్రీ. శ. 7 వ శతాబ్దమునం దీ దేశమత్యంతవైభవోపేతమై యుండెడి దని ప్రాచీన చరిత్రకారులు వర్ణించియున్నారు.

38. లాధ—నర్మదానది పడమర దిశనుండు ప్రదేశము - ఆధునికమునందు బ్రోచ్చి, బరోడా అహమ్మదాబాద్ ఖైరా అని పిలువబడే ప్రాంతము లిందులోనివై యుండునోపు నని చరిత్రకారుల అభిప్రాయము.

39. బాహ్లిక—పంజాబులో వుండే కొన్ని తెగలవారికి నిలయమగు ప్రాంతము - ప్రస్తుతము బాక్ట్రియా అని పిలువబడే బాక్ ప్రాంతము - సింధునదియొక్క అయిదు వుపనదులమధ్యనుండు ప్రదేశ మనియును, ఇది వుత్తమాశ్వములకును, ఇంగువకును ప్రసిద్ధియని వర్ణింపబడినది.

40. విదర్భ—ఇప్పటి బీహారు. ఉత్తరమున కుంతలనదిమొదలు, నర్మదానదీ తీరమునంటి, కృష్ణానదివరకు వ్యాప్తమైయుండెడి - దీని విస్తీర్ణాధిక్యతచేత, మహారాష్ట్ర మనే పేరు కలిగినది అని బాలరామాయణమునందు వర్ణింపబడినది - ఒకానొకప్పుడు దీని ముఖ్యపట్టణము కుండిన నగరము - ప్రస్తుతపు బీడారు అయియుండనోపును - వార్ధానది దీనిని రెండుభాగములుగా విడదీసినది. ఉత్తరభాగమునకు అమరావతి రాజధాని; దక్షిణభాగమునకు ప్రతిష్ఠానపురము ముఖ్యపట్టణము.

41. విదేహ—మగధదేశమున కీశాన్యమూలగా నుండెడి దీని రాజధానినగరము మిథిలాపట్టణము - మధువతికి ఉత్తరదిశగానుండే నేపాల్ దేశములోని కొంతభాగము, సీతామార్హి, సీతకుండ పురాతన తిర్హూత్ జిల్లాలోని ఉత్తరభాగము, చాంపరాన్ జిల్లాలోని పశ్చిమోత్తరభాగము యిందు లీనమై యుండెడివని చరిత్రపరిశోధకుల అభిమతము.

42. సౌరాష్ట్ర—దీనిని అనర్త దేశమని వాడుటకూడ కలదు. ద్వారకానగరమును అనర్తనగరమని వాడుటకూడ కలదు. ప్రాచీన ద్వారక, నవీనద్వారక అనునవి రెండు. నవీనద్వారకకు 95 మైళ్ళదూరమందుండే మధుపుర మనే పట్టణసమీపమం దుండెడి దని ప్రతీతి. జనాఘడ్ సంస్థానసమీపమునందుండే గిరినార్ పర్వతశ్రేణియందే రైవతక మనే పర్వతరాజ మున్నది. ద్వారకానగరమునకు తరువాత వల్లభీనగరమీ రాష్ట్రమునకు ముఖ్యపట్టణముగా నుండెడిది. భావనగరమునకు సమీపమున వాయువ్యమూలగా 10 మైళ్లదూరమందున్న బిల్చినగరమందు కప్పెట్టబడిన శిథిలములీ నగరము భావతేయని, భూగర్భపరిశోధకులవలన గుర్తింపబడినది. ప్రభాసతీర్థమను యాత్రాస్థలము యీ రాష్ట్రముయొక్క సముద్రతీరమందే యున్నది.

43. సుఘ్న—పాటలీపుత్రమునకు సమీపమందుండే ఒక చిన్నరాష్ట్రము. యమునానదీ గర్భమునం దుండెడిది. ప్రస్తుతము "సుగ్" అని పిలువబడే దదియే యైయుండనోపును.

44. హస్తినాపురము— ఇది హస్తిన్ అను రాజుచే నిర్మింపబడిన దని చరిత్రవలన దెలియనగును. గంగానదినుండి త్రవ్వబడిన ఒక ప్రాచీన కాలువయొక్క గట్టున ప్రస్తుతము 'ఢిల్లీ' అని పిలువబడే నగరరాజమున ఈశాన్యముగా రమారమి 56 మైళ్ల దూరమునం దున్నది.

45. హేమకూటము—ఇది హిమాలయములకు ఉత్తరదిశయందుండెడి పర్వతశ్రేణి. వీటి శిఖరములు బంగారుకాంతు లీనుచుండు నని ప్రతీతి. అప్పటికి గుర్తింపబడిన భూవలయమును సప్తద్వీపములుగా విభజించుటకే పర్వతశ్రేణియే మూలాధార మనియును, కిన్నరులకు నిలయమైన కింపురుషవర్షమునకును, భరతవర్షమునకును, మేరుపర్వతము సరిహద్దు అనియును, మేరు పర్వతమీ శ్రేణిలోనిదే యనియును, బాణవిరచితమగు కాదంబరిలో వివరింపబడినది. ప్రాచ్య ప్రతీచి దిశలయం దుండు మహాసముద్రముల ద్వారా, ఈ పర్వతశ్రేణియే స్వర్ణవాహినులను వెలువరించుచుండునని కాళిదాస మహాకవి విరచితమగు అభిజ్ఞానశాకుంతలయందు వర్ణింపబడినది

చీనాలో క్రొత్తపరిపాలన

(8-వ పేజీ తరువాయి)

తొలగిపోయి పరిపాలన రాజకీయవేత్తల చేతుల్లో పడినప్పుడు అసలురంగు బయటపడుతుంది.

విదేశీయులు:

పీపింగ్, టీంట్సిన్, ముక్డెన్, మొదలైన నగరాల్లో విదేశీయులపట్ల కమ్యూనిస్టులు నిర్లక్ష్యంమాత్రం చూపుతున్నారు. వారక్కడ ఉండవలసిన అవసరంలేదనీ, వారు లేకుండా దేశాన్ని నిశ్చింతగా పరిపాలించుకోగలరనీ చెప్తున్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఎక్కడా విదేశ ప్రభుత్వాల వాణిజ్యవ్యవహార కేంద్రాలలో (కాన్సలేట్)వారు వ్యవహారాలు జరపడంగాని సంప్రదించడంగాని లేదు. విదేశాల వాణిజ్య సంఘాలు, బాంకులు, పత్రికావిలేఖరులు కమ్యూనిస్టులతో వ్యవహారాల నిమిత్తం, సంప్రదింపులకి సంసిద్ధత కనపరిచినప్పటికీ వారు నిర్లక్ష్యం చేశారు. నాయకుల ఉపన్యాసాల్లోనూ, వార్తాపత్రికల్లోనూ ప్రచారంలో అమెరికన్ సామ్రాజ్యవాదాన్నిగురించి విమర్శలు అధికంగా ఉన్నాయి. అమెరికా తరువాత వారి విమర్శలకు గురైనది బ్రిటిష్‌వారు. ఎక్కడా ప్రకటనల్లోగాని, పేర్లపలకలమీదగాని, షాపుల్లోగాని, చీనా పరిశ్రమల్లోగాని విదేశీ పేర్లు, భాష ఉపయోగించరాదని ప్రభుత్వం నిషేధించింది. పూర్వకలసప్రతిపత్తి పీసమైనా ఎక్కడా కనిపించకూడదని చెప్పారు. అయితే విదేశాలనించి ఇంజనీరింగు నిపుణులు మొదలైనవారు రాదలిస్తే ఇష్టంలేకపోయినా రానిస్తారట. విదేశనిపుణుల్తో, విదేశయాజమాన్యంకింద పరిశ్రమల్ని నడుపుకోడానికి కూడా ఒప్పుకుంటారట. అయితే ప్రభుత్వం నిత్యం ప్రతిదానికీ అజమాయిషీ చేస్తుంది.

వ్యవసాయంపై ఆధారం:

ఉత్తర చీనాలో ఇటీవల మార్పుల్ని ఆందోళనతో గమనిస్తున్న విదేశవర్తకులు, చీనాకి విదేశంతో వర్తకబాంధవ్యం లేకపోతే రోజులు గడవ్వని చెప్పుకుని తృప్తిపడుతున్నారు. కాని విప్లవం తెచ్చినవారిలో అతివాదులు ద్వేషవృత్తులు నాయకత్వం వహిస్తే కనీసం ఆరంభంలోనైనా వారే వైఖరి అవలంబిస్తారో తెలుసుకో లేకపోవడంవల్ల ఇటువంటి వృథాఆశలకి అవకాశం కలుగుతోంది. చరిత్రనుబట్టి చూసినా ఇటువంటి ఆశకి తావులేదు. చీనాదేశం పరాయి దేశాల వర్తకంతో నిమిత్తంలేకుండా అనేక శతాబ్దాలు గడిపింది. అప్పుడు దేశం మునిగి పోలేదు.

సిద్ధాంతాలే సర్వం అని అంటిపెట్టుకునే అతివాద కమ్యూనిస్టులు, తమ సిద్ధాంతాల కోసం దేశాన్ని త్యాగం చెయ్యవలసినా వెనుదియ్యరు. ఇదివరలో అలా జరిగింది. పూర్తిగా దేశాన్ని తిరిగి వ్యవసాయార్థిక వ్యవస్థకు బలవంతాన తిప్పి, ప్రజల్ని బలవంతంగా ఈ స్థితిలోనే దీర్ఘకాలం అణిచిపెట్టగలిగితే, ప్రజలింకా ఇప్పటికంటె హీనస్థితిలో జీవించడానికి అలవాటుపడవచ్చును. అప్పుడు విదేశీయుల సహాయం అక్కరలేకుండా వారు దేశీయార్థికవ్యవస్థని పునర్నిర్మించడం సాధ్యమయి తీరుతుంది.

కాని ఇక్కడే సిద్ధాంత చాదస్తులు తాము తవ్విన గోతిలో తామే పడతారు. కొమింటాంగ్ ప్రభుత్వం ప్రజల హితాన్ని నిర్లక్ష్యం చేసిందని ప్రచారంచేసి కమ్యూనిస్టులు పరపతిని ఆర్జించారు. ప్రజల జీవనప్రమాణాన్ని వృద్ధిపరచగలరనీ, పాశ్చాత్యదేశాలలోని ప్రజలతో సమానంగా సుఖాలు అనుభవించడానికి ఏర్పాట్లు చెయ్యగలరనీ కమ్యూనిస్టులు ప్రచారంచేశారు. ఇదింతవరకూ ఎందుకు సాధించలేకపోయినారని అడిగితే, ఇంకా అంతర్యుద్ధం జరుగుతూ ఉన్నందువల్లననీ, దేశం అంతా తమ అధీనంలోకి వచ్చినప్పుడు గాని ప్రజల ఆశలు ఫలించవనీ చెప్తున్నారు. వారికీ ఒక పది సంవత్సరాల ప్రణాళిక ఉంది. అయితే అనుభవంవల్ల పరిస్థితిని గ్రహించిన చీనాకమ్యూనిస్టులు 30 సంవత్సరాల్లో మాత్రమే నెరవేరే ప్రణాళికను అమలుపరుస్తున్నట్లు చెప్తున్నారు. అయిదు సంవత్సరాల ప్రణాళికనుగురించి ఇప్పుడు వారు మాట్లాడటంలేదు.

చీనాలో జీవన ప్రమాణం వృద్ధిపరచాలంటే గనుల్ని, పరిశ్రమల్ని, రవాణానీ చాలా వృద్ధిపరచవలసి ఉంటుంది. వాని వృద్ధికి విదేశాలతో వర్తకం బాగా పెరగాలి. చీనాపరిశ్రమల వృద్ధికి ఎంతో యంత్ర సామగ్రి సప్లై అవసరం. చివచివరికి ముడిపదార్థాలుకూడా దిగుమతి చేసుకోవాలి. విజయగర్వంతో ఇప్పుడు కమ్యూనిస్టు సిద్ధాంత చాదస్తులు విదేశీయుల ప్రవేశాన్ని నిషేధించడం, చీనా స్వయంసహాయకం, స్వయం సంపూర్ణం కావడం మొదలైన నినాదాలు చెయ్యవచ్చును. కాని చీనా స్వయం సమృద్ధంకాదన్నది నికరసత్యం. చీనాలోని రైల్వేలు, గనులు, పరిశ్రమలు ఇంకా ఇక్ష్వాకుల యుగంలో ఉన్నట్లున్నాయి. అవసరమైన ముడిపదార్థాలు బొత్తిగా కొరత. ఉక్కు, నూనెలు, కలప, పత్తి రబ్బరు మొదలైనవి బొత్తిగా లోపం.

రైల్వేమార్గాలు క్రొత్తవి చాలా నిర్మించవలసిన అవసరం ఉంది. పాతవి బొత్తిగా పాడైనాయి. దాదాపు అన్నిటినీ తీసేసి క్రొత్తవి నిర్మించాలి. నౌకానిర్మాణ సౌకర్యాలు చీనాలో అసలు లేనేలేవని చెప్పవచ్చును. యుద్ధానంతరం చీనా నౌకాబలం అపారంగా పెరిగిపోయిందన్నారు. కాని ఇదంతా అమెరికా బ్రిటన్‌లు దానంచేసిన పాతఓడల బలంమాత్రమే. కమ్యూనిస్టులకి వీనిలో లభించినది బహు స్వల్పం. దీనితో రష్యా మొదలైన మిత్రరాజ్యాలతో వ్యాపారం చేద్దామనుకున్నప్పటికీ, రష్యా చెయ్యగల వ్యాపారం ఎంత అల్పమో అందరికీ తెలిసినదే. రష్యాకు కావలసిన వస్తువుల్ని చీనా సప్లై చెయ్యలేదు.

చీనా ఆర్థికభవిష్యత్తుగురించి పత్రికల్లో వాదోపవాదాలు నడుస్తున్నాయి. ఆధునిక సంఘవ్యవస్థకి సరిపడేది మార్క్సిస్ట్ ఆర్థికవిధానం ఒక్కటేనని కమ్యూనిస్టు నాయకులు చెప్తున్నారు.

చీనాప్రజల్లో మార్క్సిస్టు సిద్ధాంతాలు గట్టిగా పునాదిపడితేగాని అటువంటి వ్యవస్థ స్థాపించడం సాధ్యం కాదు. అందువల్ల పాశ్చాత్యదేశాలతో సంపర్కం పూర్తిగా తెగ్గొట్టకపోతే, విదేశవ్యాపారసంస్థలు, మతప్రచారసంస్థల్ని దేశంనుంచి వెళ్లగొట్టకపోతే, అటువంటి వ్యవస్థా స్థాపనకి భంగం కలుగుతుందని చెప్తున్నారు.

ఇవన్నీ చూస్తే పాశ్చాత్య ప్రజాస్వామ్యాలతో చీనావ్యాపార సంబంధాలు, అన్ని సంబంధాలు తెంచివేస్తుందనీ, అవసరమైతే పురాతన వ్యవసాయార్థికవ్యవస్థకు మళ్లుతుందనీ తెలుస్తున్నది.

మనరాష్ట్రం మనదేశం

(9 వ పేజీ తరువాయి)

భారతప్రభుత్వం తిరిగి ఒకసారి ఆలోచించుకోవాలి. ఇది వారు తెలుసుకోడానికి ముందు బహుశా ప్రజలు ఇంకా ఎన్నేళ్లు బాధపడాలో తెలియదు. ఎంత కాలానికి వారికి అనుభవజ్ఞానం కలుగుతుందో, తెలియదు.

డాలర్లు:

డాలర్ల కొరతవిషయమై దౌలత్ రాంగారి వాదన విచిత్రంగా ఉంది. సాలుకి నూరుకోట్ల రూపాయల చొ॥ ఆహారం దిగుమతి చెయ్యవలసివస్తోంది కాబట్టి, నూరుకోట్లరూపాయలు పదిహేనుసంవత్సరాల్లో వచ్చినదిగుమతి చేసుకోనక్కరలేదు కదా అని ఒకరు ప్రశ్నించారు. నూరుకోట్ల రూపాయలూ ప్రభుత్వం భరించడంలేదు. నిజమే. అందులో కోటి లేక రెండుకోట్లు నష్టాన్ని ప్రభుత్వం భరించి మిగతా ధరకిఆ ఆహారాన్ని అమ్ముతోంది. కాని నూరుకోట్లరూపాయల మాట చెప్పినప్పుడు, అది డాలర్ల మారకం గురించి మాత్రమే అనే మాట ఆయన మరిచిపోయారు. భారత ప్రభుత్వం వెచ్చించవలసింది. ఆరంభంలో కంట్రాక్టుకి కొంత, ఆరంభఖర్చులకి కొంత పోగా మిగతాది సాలుకి, పదికోట్లు రూపాయలు మాత్రమే. దీనికి డాలర్ మారకం కావాలి. సంవత్సరానికి 190 మిలియన్ల డాలర్ల మారకం అంతర్జాతీయ ద్రవ్యనిధినుంచి అప్పు తీసుకున్న భారత ప్రభుత్వం. దేశంలో ఆర్థికస్థితిని పదేళ్లలో పూర్తిగా మార్చివెయ్యగల ప్రాజెక్టుకోసం ఈ మారకానికీ, ఈ ఖర్చుకీ అంగీకరించలేదా?

కులవిచక్షణ:

దేశం రాజకీయజీవనంలో విషప్రాయంగా ఉన్న యువకుల విచక్షణావిధానానికి రాజ్యాంగపరిషత్సభ స్వస్తి చెప్పింది. ఉద్యోగనియామకంలోనూ సంఘజీవనంలోనూ దాదాపు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలూ ఈ వివక్షతలకి స్వస్తి చెప్పాయి.

రాష్ట్రాలలోకి చెన్నరాష్ట్రం, సంస్థానాలలోకి మైసూరు, తిరువాన్కూరుమాత్రం పెడదోవలోననే ఉన్నాయి.

మనదేశంలో ఈ వివక్షతలకి స్వస్తి చెప్పి, రాజకీయజీవనంలోని విషబీజాన్ని మొదలంట చంపాలనే ఉద్దేశంతో ఆర్. ఆర్. దివాకర్‌గారు (ఇప్పుడు భారతప్రభుత్వ ఉపమంత్రి) గతసంవత్సరం రాజ్యాంగపరిషత్సభలో ఒక తీర్మానం ప్రతిపాదించారు. ఆ తీర్మానాన్ని సర్దార్ పటేల్ అంగీకరించి, దేశంలో పరిస్థితుల్ని పరిశీలించడానికి దివాకర్‌గారి అధ్యక్షత కింద ఒక కమిటీని నియమించారు. దివాకర్ కమిటీ ఈసందర్భంలో ఒక ప్రశ్నావళి తయారుచేసి, ఆ యాప్రభుత్వాల అభిప్రాయ ప్రకటన కోసం అన్నిరాష్ట్ర, సంస్థానప్రభుత్వాలకూ పంపారు. ఆ ప్రభుత్వాల సమాధానాలు ఇటీవలనే కమిటీకి చేరాయి. కమిటీ సమాధానాలన్నిటిని పరిశీలిస్తోంది చెన్నరాష్ట్రం తప్ప అన్ని రాష్ట్రాలూ కులవివక్షతల రద్దుకే సుముఖంగా ఉన్నాయి.

చెన్నరాష్ట్రంలోనే కులభేదాలు ఈనాటికీ సాంఘికజీవనంలో ప్రాధాన్యత వహించడానికి కొన్ని చారిత్రక హేతువులున్నాయి. ఆంధ్రదేశంలో ద్వేషాలు అంతగా లేవు. రాజకీయ, ఆర్థిక, సాంఘికజీవనంలో నిమ్నజాతులకు తప్ప ఇతర కులాలన్నీ ఒకే స్థితిలో ఉన్నాయి. వ్యాపారాదుల్లో కులాలవారి మధ్య సహకార సఖ్యతే ఉన్నాయి. ఇప్పుడేపాటి ద్వేషాలు కనిపిస్తున్నప్పటికీ చెన్నపట్నంలో ప్రభుత్వోద్యోగాలనుంచి పాకినవే. వీనికి మూలం తమిళ్నాడులోని కులద్వేషాలే. తమిళ్నాడుతో కలిసిఉండడంవల్ల కులద్వేషాల గాలి కొద్దిగా సోకక తప్పిందికాదు. కాని మన జిల్లాలలో వాణిజ్య, వ్యాపార, పాలనాది వ్యవహారాల్లో (అక్కడక్కడ కొద్దిమంది వ్యక్తులలో ద్వేషాలు మినహాయిస్తే) వివిధ కులాల మధ్య సహకార సఖ్యతా లేనిదే రోజు గడవదు. కాంగ్రెస్, జస్టిస్ పార్టీల రాజకీయాల ఏర్పడి తమిళ్నాడునుంచి తగలడంవల్ల ప్రభుత్వోద్యోగాల విషయంలో ఇంకా అక్కడక్కడ కులద్వేషాలు మిగిలాయి. కులనిష్పత్తి పద్ధతిని రుచిమరిగి, చదువూ, పరిశ్రమా లేకుండా సుఖమైన ఉద్యోగాలు ఆర్జించుకోనగోరే వారిలో తప్ప వ్యాపార పరిశ్రమాదుల్లో కులభేదాలే కనిపించవు. పండుగల్లో కాని ఉత్సవాల్లోగాని అందరూ ఏకమే. తమిళ్నాడులో పరిస్థితి భిన్నంగా ఉంది. పూర్వకాలంలో సాహిత్యానికీ, ఆర్థికాభివృద్ధికీ పాటుపడినవారి ప్రాబల్యం, బ్రిటిష్‌ప్రభుత్వం ఉద్యోగాల దానంతో పడిపోయింది. సాంఘిక జీవనంలో అక్కడ అగ్రవర్ణాలకీ అన్యవర్ణాలకీ మధ్య సన్నిహిత సంబంధం లేదు. బ్రాహ్మణేతరుల్లో దైవభక్తి, హిందూధర్మాచారనిరతి అధికం. కులాధిక్యత మొదలైనవానిలో బ్రాహ్మణేతరులకు పట్టుదల హెచ్చు. వివిధకులాలవారి మధ్య సహపంక్తి భోజనాలు, ఉత్సవాలు మొదలైనవానిలో కలిసిమెలిసి తిరగడం ఆంధ్రదేశంలో కనిపిస్తుంది కాని తమిళదేశంలో కనిపించదు. ఈ విషయంలో తమిళ్నాడులో బ్రాహ్మణేతరులు కులవ్యత్యాసాలను పట్టుదలతో పాటిస్తారు. అందువల్ల తమిళప్రాబల్యంగల సమిష్టి భాషారాష్ట్రంలో, కులభేదాలకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఆశ్చర్యంలేదు. తమిళులతో సన్నిహితంగా ఉన్న ప్రాంతాలైన ఆంధ్ర కన్నడ ప్రాంతాల్లో ఆ గాలి సోకింది కాని తమిళ్నాడులోవలె కులద్వేషాలు మనదేశంలో లేవు.

అయితే ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే, మత కుల ద్వేషాల్ని రూపుమాపి, సాంఘిక రాజకీయ జీవనంలో కులవ్యత్యాసాలు పాటించకుండా సర్వసమత్వ సిద్ధాంతాన్ని ప్రజల్లో అలవరచగలరని కంకణంకట్టుకున్న కాంగ్రెస్ సంస్థే ఈ రాష్ట్రంలో కులవిచక్షణ నీనాడు చావకుండా ప్రాణంపొయ్యడానికి యత్నిస్తోంది. వాస్తవానికి ఈనాటి పరిస్థితులు చూస్తే ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాలలో కులాల హెచ్చుతగ్గులేమున్నాయి? అందరూ ఒకే రీతిగా కష్టాలు పడుచున్నారు. ఒకరు విద్యాసంస్కృతులలో హీనస్థితిలో ఉంటే మర్కొకరు ఆర్థికంగా హీనస్థితిలో ఉన్నారు. సాంఘికంగా హీనస్థితిలో ఉన్న హరిజనులు, నిమ్నజాతులవారే ఇప్పుడు సహాయానికి అర్హులు.

కాంగ్రెస్ ఉద్యమంలో కాని, దేశం అభి

నేటి ప్రపంచం

బ్రిటన్ వ్యాపారరాజకీయాలు

ఆసియా వలసలు పోతే యూరోపియన్ దేశాలు ఆర్థికంగా తేరుకోవడం అసంభవం. వలసదేశాల్లోని ముడిపస్తుసంపద చౌకకూలీపరిశ్రమతో చౌకగా లభించకపోతే యూరోపియన్ దేశాల లాభార్జనకు వీలే ఉండదు. యూరప్ ఆర్థికవ్యవస్థ అంతా మధ్యప్రాచ్య దేశాల పెట్రోల్ పైనా, తూర్పుఆసియా ఆఫ్రికాల సహజసంపదపైనా ఆధారపడిఉంది. ఈ వలసల్ని కాపాడుకోడానికి బ్రిటిష్, ఫ్రెంచి, డచ్చిదేశాలు యావచ్ఛక్తీ వినియోగిస్తాయి. ఆసియా దేశాల్లో జీవనప్రమాణం వృద్ధిపరచడం కోసమే లోకోపకారంకోసమే అమెరికా మొదలైన దేశాలు ప్రపంచంలో పరిశ్రమాభివృద్ధి కార్యక్రమాలు అనుసరిస్తున్నాయని ప్రచారం చేస్తున్నారు. కాని ఇది అంతా బూటకం. వలసదేశాల్లో ప్రజల జీవనప్రమాణం పెరిగితే పాశ్చాత్య పారిశ్రామికుల లాభప్రమాణాలు తగ్గిపోతాయి.

భారతదేశంలో యుద్ధం ధర్మమా అని ప్రజల జీవన ప్రమాణం కొద్దిగా పెరిగింది. సామాన్య తరగతులవారి కొనుగోలుశక్తి, మధ్య తరగతుల వారిలో పేదవారి కొనుగోలుశక్తితో సమానమయింది. కార్మికులవేతన ప్రమాణం రెట్టింపు పైగా పెరిగింది. దీనివల్ల బ్రిటిష్‌వారి లాభప్రమాణం తగ్గిపోయింది. రెండో ప్రపంచయుద్ధం ముగిసిపోగానే, భారత దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లిపోవాలని బ్రిటిష్‌వారు నిశ్చయించుకోకముందే, అనేక బ్రిటిష్ వ్యాపార పారిశ్రామిక సంస్థలు భారతీయులకు అమ్ముడైనాయి. దీనికి తోడు భారతదేశంలో దొరికే ముడిపదార్థాల విలువచూస్తే, బ్రిటిష్ ప్రభుత్వం ఈదేశంలో నిలిచి మిలిటరీబలం ప్రయోగించి, మిలియన్ల కొద్దీ పౌనుల ధనం వెచ్చించదగినదిగా గోచరించలేదు. అందువల్లనే బ్రిటిష్ సోషలిస్టులు దేశాన్ని సులువుగా విడిచివెళ్లారు.

ఆర్థికరంగంలో క్రమపరిణామాన్ని కోరే బ్రిటిష్ సోషలిస్టులలో జాతీయభావం అధికంగా ఉంది. యూరోపియన్ సమాఖ్యలో బ్రిటన్ పొందికగా ఉండటం ఒకవిధంగా కష్టమే. అయినా ప్రపంచ రాజకీయాల దృష్ట్యా యూరోపియన్ రాజ్య సమాఖ్యలోనూ, అట్లాంటిక్ పాక్టులోనూ ముఖ్యపాత్ర వహించక తప్పింది కాదు. ఆసియాలోనూ, యూరప్‌లోనూ కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టవలసిన అగత్యం పశ్చిమదేశాలకు కలిగింది.

కమ్యూనిజాన్ని నిరోధించడానికి ప్రజల ఆర్థికదుస్థితిని నివారించడం ఒక్కటే మార్గమని ఇప్పుడిప్పుడే పాశ్చాత్యదేశాలు గుర్తించాయి. దక్షిణఅమెరికాలో పారిశ్రామికాభివృద్ధికి అమెరికా మొదటినుంచీ సహాయపడుతూనే ఉంది. పశ్చిమ యూరప్‌కి మార్షల్ ప్రణాళిక అమలు పరిచింది.

ఆసియా వలసదేశాల్లో బ్రిటన్ తన వైఖరి మార్చుకోక తప్పింది కాదు. ఇంతవరకూ ఆర్థికంగా అణిచిపెట్టి ఉంచిన దేశాల్లో. బ్రిటిష్ సోషలిస్టులు ఆర్థిక కార్యక్రమాల్ని మార్చుకుంటున్నారు. వలసదేశాల్లో వర్తక వ్యాపారాల్ని తన ఇష్టం వచ్చిన గతిలో నడిపిన బ్రిటన్ భారతదేశం మొదలైనవానిని స్వేచ్ఛావ్యాపారానికి విడిచిపెట్టవలసి వస్తోంది.

ఆఫ్రికాలో ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు కొన్ని ప్రారంభించింది. బ్రిటన్ తన అదుపులో ఉన్న దేశాల్ని అంతర్జాతీయ వ్యాపారంలో స్టెర్లింగ్ మారకానికే బంధించి ఉంచడం ఒక ఎత్తు, స్వేచ్ఛావ్యాపారానికి అవకాశం ఇవ్వడం ఒక ఎత్తూ అయింది. స్టెర్లింగ్ మారకానికి బంధించి ఉంచి స్వేచ్ఛావ్యాపారాన్ని సాగనియ్యడం అట్టే దూరం సాధ్యంకాదు. స్వాతంత్ర్యం పొందిన భారతదేశం త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించవలసి వస్తుంది. అంతర్జాతీయ వ్యాపారరంగంలో భారతదేశ సంబంధాలు దేశవిభజనానంతరం మారిపోయాయి. భారతదేశానికి కావలసిన పారిశ్రామిక యంత్రసామగ్రిని బ్రిటన్ సప్లై చెయ్యలేకపోతోంది. భారతదేశంలో ఆర్థికజీవనప్రమాణం పెరగాలంటే వ్యాపార పారిశ్రామికాభివృద్ధి కొత్తపంథాలో నడవాలి. ఈ పరిస్థితులకి అనుగుణంగా భారతదేశం తన వ్యాపార పారిశ్రామిక వ్యవహార సంబంధాలను ఎంత త్వరలో మార్చుకుంటే అంత త్వరలో ప్రజల ఆర్థికస్థితి చక్కబడుతుంది. స్టెర్లింగ్ రూపాయిని ముడిపెట్టి ఉంచినందువల్ల ఈ మార్పుకి బ్రిటన్ తోడ్పడాలి; లేదా భారతదేశం స్టెర్లింగ్ మారకం, స్టెర్లింగ్ నిలవల బంధనాలకి భయపడకుండా వ్యాపార రంగంలో స్వతంత్రించాలి. భారతప్రభుత్వ వాణిజ్య శాఖామంత్రి ఇటీవల మాట్లాడుతూ, దేశవిభజనవల్ల మనదేశ ఆర్థిక వ్యాపారవ్యవస్థలో కలుగుతున్న మార్పులింకా ఇప్పుడిప్పుడే కొద్దిగా కనిపిస్తున్నాయని చెప్పారు. భారతప్రభుత్వం పరిస్థితుల్ని పరిశీలిస్తోంది. బ్రిటన్ వైఖరినికూడా గమనిస్తోంది. బ్రిటన్‌తో ద్రవ్యవ్యాపారసంబంధాల్ని బట్టే భారతదేశ ఆర్థిక భవిష్యత్తు ఆధారపడిఉంది. ఆర్థిక దుస్థితి క్లిష్టతరమైతే కమ్యూనిస్టులకి తావిచ్చినట్లవుతుంది. హిందూ ముస్లిం మతి ద్వేషాల బలంవల్లనైనా పాకిస్తాన్ భారతదేశాలలో జాతీయశక్తులు బలపడతాయనీ, అప్పుడు కమ్యూనిజానికి ఈ దేశాల్లో అవకాశమే ఉండదనీ బ్రిటన్ తలిస్తే, అది అపోహమాత్రమేనని ఇటీవలి పరిస్థితుల్ని బట్టి తెలుస్తుంది. భారతదేశం కమ్యూనిజాన్ని అరికట్టాలంటే ఆర్థికపరిస్థితి చక్కబడాలి. ఇది చాలవరకు బ్రిటన్ వైఖరి పైనా, పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడగల అమెరికాపైనా ఆధారపడి ఉంటుంది. (సూర్యం)

వృద్ధికోసం పాటుపడిన తదితరుల్లోకాని అన్ని కులాలవారూ సమానమైన పాత్ర నిర్వహించారు. స్వాతంత్ర్యసాధన అన్ని మతకుల వర్ణాల వారి సమష్టికృషికి ఫలితం.

ఇంకా ఉద్యోగ విద్యాది విషయాలలో కుల విచక్షణలు పాటించాలనడం, దేశహితానికి విరుద్ధంలేని ద్వేషాల్ని సృష్టించినట్లవుతుంది. తమిళ్నాడులో ద్వేషాలు అంతరించే అవకాశాల్ని చేతులారా పాడుచేసినట్లవుతుంది. దేశం స్థితిగతుల్ని గ్రహించి ఇప్పుడీ కుల విచక్షణల్ని అంతరింపచెయ్యకపోయినట్లయితే తమిళ బీడులో నాభత్సం తప్పదు. ఆంధ్రదేశానికీ జాడ్యం అంటే అవకాశం కూడా ఉంది. విద్యావంతులు, విజ్ఞానశాస్త్రనిపుణులు చాల మంది కావలసిన ఈతరుణంలో పోటీతో పరిశ్రమచేసి విద్య లభ్యసించి జ్ఞానాభివృద్ధికి తోడ్పడాలి కాని, సోమరులకి, అనర్హులకి అవకాశాలిచ్చి, ఇతరులకి అవకాశాలిచ్చే కులవిచక్షణ విధానంవల్ల దేశానికి అనర్థకం ఉంది. ఉద్యోగ నియామకంలోనే కాక విద్యాలయాల్లోకూడా కులవిచక్షణలు పాటించడంవల్ల సంఘజీవనంలో విషం పోసినట్లవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈవిషయాన్నెప్పుడు గుర్తించగలుగుతుంది?

కులవిచక్షణ కోరే దెవరు?

కులవిచక్షణకోరేదెవరు? కులనిష్పత్తి సౌకర్యం వల్ల శ్రీసంకూడా మానసిక శారీరక పరిశ్రమ లేకుండా ఊరికే కూర్చున్నా ఉద్యోగాలు, కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నవారు కోరుతున్నవారనుకోవాలా? కాని ఈ కుల నిష్పత్తివల్ల బ్రాహ్మణేతరులకి వాస్తవంగా ఒలికేదేమీ లేదు. బ్రాహ్మణేతరుల్లో వందలాది కులాలున్నాయి. వీనిలో ఏ కులాన్ని తీసుకున్నా-మచ్చుకి రెడ్లసంగతి చూదాం-హిందువుల్లోనే కాదు బ్రాహ్మణేతరుల్లో వారు అల్పసంఖ్యాకులే. కులనిష్పత్తివల్ల ఉద్యోగాల్లోకాని కళాశాలల్లోకాని వారికి దొరికే స్థానాలెన్ని? అవి మొత్తంలో ఎన్నోవంతు? ఇది చూస్తే కులనిష్పత్తిలో బ్రాహ్మణేతరులకున్న ఏడుస్థానాల్లోనూ (మొత్తం పధ్నాలుగు) రెడ్లుకి ఒక స్థానమైనా ప్రత్యేకించాలని నిర్ణయించుకోవాలి. లేకపోతే ఈ స్థానాల్లో అల్పసంఖ్యాకులైనవారికి చోటెక్కడ దొరుకుతుంది. అందువల్ల ఏవైనా లభిస్తే [ఈ లభించడానికి కులవిచక్షణ, కులపక్షపాతాలు ఆధారమని భావించే పక్షంలో] అవి నియామకాధికారుల్లో ఎవరైనా స్వకుల స్థులుంటేనే లభిస్తాయి. లేదా ఆ అధికారులు ఏ కులానికిచెందినవారో, వారి కులానికి అధికస్థానాలు వెడతాయి ఈ వాదాన్ని చూస్తే కులనిష్పత్తివల్లే ఏ కులానికి (అన్ని కులాలు అల్పసంఖ్యాక వర్గాలే అవుతాయి కాబట్టి) లాభం లేదనీ, పైపైన ప్రాపు ఉన్నప్పుడే లాభిస్తుందనీ రుజువవుతోంది. ప్రాపువల్ల ఉద్యోగాదులు ఆర్జించుకోవడంలో కులనిష్పత్తి అడుగున పడిపోతుంది. ఇదేరీతిగా మిగతా కులాలుకూడా.

ఇంక వాస్తవంగా కులనిష్పత్తివల్ల లబ్ధిపొందగోరేవారెవరు? ఆత్మవిశ్వాసం లేనివారని చెప్పుకోవాలి. వాస్తవంగా కులనిష్పత్తివల్ల లబ్ధి ఉందో లేదో, దానివల్ల వివిధకులాలవారికి న్యాయం జరుగుతోందో లేదో గ్రహించకుండా, కుల నిష్పత్తి లేకపోతే ఉద్యోగాలూ, కళాశాలలూ అన్నీ బ్రాహ్మణులపరమైపోతాయని భయపడేవారు మాత్రమే కులనిష్పత్తి ఉండాలంటారు. కులనిష్పత్తి అనేది హరిజనులవంటి వారికే, ప్రత్యేక సహాయసౌకర్యాలు లేనిదే ఇతరులతో, సమానంగా తూగలేనివారికే ఉపయుక్తంగా ఉండాలి. ఆర్థిక, రాజకీయ, సాంఘికరంగాలలో బ్రాహ్మణుల్తో సరితూగుతున్న అగ్రవర్ణ బ్రాహ్మణేతరులు కోరదగినది కాదు. కులనిష్పత్తి మనోవృత్తి వంటిది. ఆత్మవిశ్వాసం లేనివారు నిస్సహాయులు కోరవలసిందే కాని జాతీయ చైతన్యం, ఆత్మగౌరవం కలవారు కోరవలసింది కాదది. కులనిష్పత్తి నింకా అమలులో ఉండాలని కోరేవారిలో ఆత్మవిశ్వాసం నశించిందన్నమాట. ఇది జాతీయ గౌరవానికి భంగకరం. బ్రాహ్మణేతరుల్లోని సాహిత్యసేవకులు, విద్వాంసులు, దేశనాయకులకుఅవమానకరం, అల్పసంఖ్యాకవర్గాలకి ప్రజాస్వామ్యపరిపాలనావిధానమే చాలు. వేరే ప్రత్యేకసౌకర్యాలు అవసరం లేదు. ఇటువంటి ఆత్మవిశ్వాసాన్ని కనీసం భారత క్రైస్తవుల వద్దనైనా నేర్చుకోవాలి. జాతీయ చైతన్యం, ఐక్యజాతీయభావమే సర్వమత కులవర్గాలకూ అంగరక్ష. ఇంకా ఈ భేదాలను, విచక్షణలను పాటిస్తున్నారంటే, ప్రజల్లో జాతీయగౌరవభావం, ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం అలవడలేదన్నమాట. (సూర్యం)

నాకబలి

(5 వ పేజీ తరువాయి)

(5 వ పేజీ తరువాయి)

వరాండాలు మలుపులు తిరిగి వస్తూంటే, ఎటు వచ్చిందీ, ఎట్లు వెళ్లిందీకూడా తెలియటంలేదు.

ఒక గదికి చేరి బండివాడిని పంపించేశారు.

"ఎక్కడైనా, స్నానానికి వీలుంటుందా?" అని అడిగాడు శర్మని.

"తొమ్మిదిదాటినట్లుంది. ముందు తిండి ఉంటుందో లేదో చూసుకోవాలి, పదపోదాం.

సామానులు గదిలో చేర్చి, తలుపుతాళం వేసి మళ్లీ వెనక్కి బయలుదేరారు. ఎక్కాలో వచ్చిన దూరం కన్నా ఎక్కువ దూరంలాగుంది. శర్మ అందర్నీ పలకరిస్తూ హాస్టలువరాండాలు దాటుకొంటూనే వస్తున్నాడు.

"హల్లో! దుపాన్ బాబూ! మీ మెస్సు ఉందిటోయ్?" అనిశర్మ ఆగాడు. ఒక పొట్టి అతనుకీచుగొంతుకతో జవాబిస్తున్నాడు "ఆ! ఉంచమని చెప్పా. మనవాళ్లు వస్తూంటారని, ఇంకా ఉంచమనే మహారాజ్‌తో చెప్పా."

"రైట్! అయితే ముందు భోంచేసివస్తాం, నీ అక్కౌంటులోనే" అని నవ్వాడు శర్మ.

"కానియ్‌వోయ్; తర్వాత యిద్దుగానిలే. వెళ్లండి, సార్ వెళ్లి భోంచేసిరండి. శర్మా, కొత్త తెలుగువాళ్లకు అన్నం ఎక్కువ పెట్టమని మహారాజ్‌తో చెప్పాను.

"శహబాష్, థాంక్స్ వస్తాం!" అంటూ శర్మ రాఘవరావుచేతిని కలుపుకొని మళ్లీ వరాండాలు దాటిస్తున్నాడు.

"తెలుగుఅతను కాదా?" అని అడిగాడు రాఘవరావు. శర్మ నవ్వుతూ తెలుగువాడే "ద్వైపాయనుడు దుపాన్‌బాబు అయింది."

మాట్లాడక కొంతదూరం నడిచాడు.

"ఇందాక ఇది తిరిగినట్లున్నామే!"

"అబ్బే, అది సెకండు హాస్టల్. ఇది ఫస్టు హాస్టల్. మలుపులన్నీ ఒక మాదిరిగానే కనబడుతాయి. ఇదిగో మెస్సు కొచ్చేశాం.

హాస్టలు దొడ్లో గుర్రాలశాలలులా గున్నాయి మెస్సులు

ఒక గదిలో పొయ్యిదగ్గిర మాసిపోయిన గావంచా, బనీనుతొడిగిన ఒకపిలకమనిషి పొయ్యిదగ్గిర రొట్టెలు కాలుస్తున్నాడు. అతన్ని "మహరాజ్" అని పిలుస్తూ, చుట్టూ కంచాలు, కంచాలదగ్గిర రెండురెండు మంగలిగిన్నెల్లాంటి గిన్నెలూ పెట్టుకొని విద్యార్థులు కూర్చుని జావలాగ ఉన్న పప్పులోనూ, రసతర్కారీలోనూ నంచుకొని తింటున్నారు. కొల్లాయి కట్టుకొన్న కుఱ్ఱవాడొకడు రొట్టెలు వత్తుతున్నాడు. మహారాజ్ ఒక్కొక్క రొట్టే పెనంమీద రెండు నిమిషాలు ఆరపెట్టి, సరాసరి పొయిమంటలో పడవేసి, తిప్పుతూ, అల్లాపటకారుతోనే వరుసగా ఒకళ్లొకళ్ల కంచంలోకి విసిరేస్తున్నాడు. కుఱ్ఱవాడు ఇద్దరికీ రెండు కంచాలు పెట్టాడు. కంచాలలో కూరకన్నా తక్కువ తక్కువగా అన్నం వడ్డించి ఉంది. బండపచ్చడి, నాలుకకు రుచి తెలిపేందుకు చేసినట్లు కొద్దిగా ఉంది.

మహారాజ్ "మద్రాసీ"లకు మరికొంత అన్నంపెట్టమని కుఱ్ఱవాడికి పురమాయించాడు.

విచక్షణలూ, రుచులూ పూర్తిగా మానుకొని ఆకలి తీర్చుకొన్నాడు.

మళ్లీ అంతదూరం నడవాల్సి వచ్చింది.

సాంబం లైటుముందర చదువుకొంటూ కూర్చుని ఉన్నాడు. ఎక్కడైనా జేరగిలబడితే తప్ప నడుం నిలిచేటట్లు లేదు. ఒళ్లంతా హూనమైనట్లుంది. గదిలో అంగారం గడియారం పదిన్నర చూపిస్తోంది.

శర్మ సాంబంతో బాతాఖానీ వేస్తూ కూర్చున్నాడు.

సాంబానికి పడుకొందామని ఆతృతగాఉంది.

"టీ పెట్టున్నాను, తాగి పడుకొందాం ఆగండి" అని సాంబం ఆతిథ్యం చూపిస్తున్నాడు. తనకి టీ అలవాటులేదు. కాని అతనిమాట తీరు స్నేహపాత్రంగా ఉంది. కాదనలేకపోయాడు.

టీ త్రాగాక, అలవాటు లేకపోయినా, అసమయమయినా, కొంత సేద దేరినట్లే ఉంది.

ఈతనిమీద వృథాగా మనస్సులో చికాకుపడ్డానేఅని పస్తాయించాడు. ఆ అరమార్గంలో, జన్మఅంతటికీ ఉపయోగించే ప్రజ్ఞాచిహ్నమూ, యూనివర్సిటీ ఫస్టుమెడల్ అతనికి చెయిజారిపోయిందే అన్న సానుభూతి అప్పటికి కల్గింది.

లైట్లు ఒకసారి తగ్గిహెచ్చాయి.

"ఇక పడుకొందాం. పావుగంటలో లైట్లు ఆరుతాయి" అంటూ సాంబం, తన పక్కచుట్ట తీసికొని డాబామీదికి బయలుదేరాడు.

పక్కమీద నడుంవాల్చి నక్షత్రాలుచూస్తూ పడుకొన్నాడు. ఏ క్రొత్తలకూ అలవాటు పడని మనస్సు కొత్తఊరు, కొత్తజీవితం, ప్రవేశించడానికి ఉబలాటపడింది. అప్రవేశం అయింది. అన్నీ తెలియని కొత్తదనాలే, మహాస్థూల పరిమాణాలలో బెదిరిస్తున్నాయి. నక్షత్రాల వంకచూస్తూ ఇట్టే నిద్రపోయాడు.

నిద్రపోయినట్లే లేదు.

"స్నానాలకు మళ్లీ పంపు దొరకదు, లేవండి" అని సాంబం నిద్ర లేపాడు.

తెల్లగా తెల్లవారింది. సూర్యోదయంకూడా కాబోతోంది. పరుపు చుట్టుకొని గదిలోకి వచ్చాడు. గడియారంలో ఐదుకాలేదు.

ఐదు కాకుండానే సూర్యోదయమా? ఇచటి ప్రకృతిలోని ఈకొత్తదనానికి మరింత తెల్లపోయాడు.

ఒక ఏడాది గడిచేటప్పటికి, ఈమాదిరి కొత్తదనాలకన్నిటికీ అతీతుడై, విశ్వవిద్యాలయ విద్యార్థిత్వానికి పాతకాపు అయిపోయాడు.

లేఖలు



"అపాయము"

అయ్యా,

గుంటూరునుండి నారాకోడూరు. జాగర్లమూడి గ్రామముల మీదుగా తెనాలి పోవు రోడ్డు అంతులేని ట్రాఫిక్కు గలది. నారాకోడూరు నుండి మై. 6/3 లో అనగా అంగలకుదురు గ్రామమునకు పడమటి వైపున వున్న బ్రిడ్జి షుమారు 5, 6, మాసములనుండి గుంటలు పడి ప్రమాదములో నున్నది. ఈ బ్రిడ్జి ప్రమాదములో నున్నదని, లారీలుగాని, బస్సులుగాని ఈ వంతెనమీదుగా పోవుట అపాయకర మని రెండు పెద్ద బోర్డులమీద వ్రాసి ప్రభుత్వమువారు చాల రోజులక్రిందనే వంతెనకు రెండు వైపులను ఆ బోర్డులను పాతించియున్నారు. కాని ఎన్నాళ్లు చూచినను ఆ బ్రిడ్జి బాగుచేయించినట్లు లేదు సరిగదా, యింకను చెడిపోయి పెద్దగోతులు కూడా పడియున్నది. ఇట్టి ప్రమాదావస్థలో నున్న వంతెన ద్వారానే నిత్యము అనేక లారీలు, బస్సులు, బళ్లు ప్రయాణము చేయుచున్నవి. వేరే మార్గము లేనందున యీ విధముగా ప్రయాణము తప్పనిసరి యైనది. కాని ఎప్పటి కప్పుడు ప్రయాణీకులును ఆ గ్రామస్థులును ప్రాణములను గుప్పెట్లో పెట్టుకొని ఆ వంతెనమీదుగా పోవుచున్నారు. గుంటూరు - తెనాలి రాకపోకలు జరుపు ప్రతి చిన్నకారు కూడా యీ రోడ్డు ద్వారానే పోవును. ఐనప్పటికీ యీ వంతెన గతి యట్లే యున్నది. "అపాయ" మని వ్రాయబడినబోర్డులు గూడా ఆ విధముగనే వ్రేలాడుచున్నవి ఇంత ప్రమాదముతో గూడిన వంతెన విషయమై అందుకు సంబంధించిన వుద్యోగులేల ఉదాసీనులైయున్నారో బోధపడుట లేదు. కనుక యిప్పుడైనను ఏ అపాయము జరుగక ముందే వెంటనే ఉద్యోగులీ వంతెనవిషయమై తగు జాగ్రత్తలు తీసుకోవలెనని హెచ్చరించుచున్నాను.

పాటిబండ్ల నాగేశ్వరరావు,
తెనాలి.

తెలుగుషార్టు హాండ్ పరీక్షలు

ఆర్యా,

మద్రాసుప్రభుత్వమువారు ఏటేట తెలుగు సంక్షిప్త లేఖనములో రెండు పరీక్షలు జరుపుచున్నప్పటికిని విద్యార్థులకు పాఠ్యగ్రంథము లభింపజేయలేక పోవుట ఆశ్చర్యము. ఈ పాఠ్యగ్రంథము 30 ఏండ్ల క్రితము ప్రచురితమైనది. ఇంతవరకు వుత్తీర్ణులయిన విద్యార్థు లెందరో లేరు. పాఠ్యపుస్తకము ప్రతులు లేక లభించనందున కుతూహల మున్నను విద్యార్థులకు అవకాశము లేకపోవుచున్నది. ఆంధ్రరాష్ట్రము ఏర్పడి ప్రభుత్వ వ్యవహారములు తెలుగులో జరుగుటకు ఎక్కువ కాలము పట్టదు గనుక, తెలుగు మంత్రులు ప్రభుత్వముచే ఈ గ్రంథమును ప్రచురింపజేయవలెను. అంతేగాక ఈ గ్రంథములోని సంక్షిప్తలేఖన విధానము 33 ఏండ్ల నాటిది. కనుక ఇప్పటి అవసరములకు అనుగుణముగ దానిని సంస్కరించుటకు తెలుగు ఇంగ్లీషు సంక్షిప్త లేఖనములో ప్రవీణులైనవారి కమిటీని నియమించవలెను. ఈ విషయప్రాముఖ్యమును ఆంధ్రశాసనసభ్యులు, నాయకులు, రాష్ట్ర కాంగ్రెస్ సంఘము గుర్తించెదరుగాక.

కె. వి. రత్నం.

ఆంధ్ర మెట్రిక్ పరీక్ష

ఆర్యా,

ఆంధ్ర మెట్రిక్ పరీక్ష ఫలితములు వెలువడి చాలా ఆశాభంగము కల్గించినవి. నూటికి 23 గురను మాత్రమే పాసుచేసి 77 గురను ఉంచివేసినారు. ఫలితము లెంత దారుణముగా ఉన్నవో గమనించి విశ్వవిద్యాలయమువారు ఇంకొక జాబితా తయారు చేసి మరి కొంతమంది విద్యార్థులకైనా మోక్ష మిమ్మని మీ ద్వారా కోరుచున్నాను. ఈ మధ్యను దాని తోడి పరీక్షయగు S. S. L. C. యందు నూటికి 40-50 మధ్యను ఆంధ్రయూనివర్సిటీవారే పాసుచేయుచున్నారు. అటువంటిది వారి స్వంత పరీక్షయగు మెట్రిక్ నందు ఎందు కింత కఠినముగా నున్నారో వారికే యెఱుక. ఇది చాల అన్యాయము.

మరియు ఆంధ్ర విశ్వ విద్యాలయము వారు వారి పరీక్షలన్నియు సంవత్సరమునకు రెండు సార్లు జరుపుచున్నారు. ఈ ఒక్క మెట్రిక్ పరీక్ష మాత్రమే అట్లుగాక సంవత్సరమున కొక్క సారి మాత్రమే జరుపుచు విద్యార్థులకు చాల కష్టము కల్గించుచున్నారు. నియటినుండి S. S. L. C. వారుకూడ రెండు పరీక్షలు జరుపుచుండ వీరు ఉపేక్ష చేయుట చాల శోచనీయము. వీరుకూడ మెట్రిక్ పరీక్ష సెప్టెంబరులో జరిపి మార్చి పుస్తకములతో విద్యార్థులకు యింకొక అవకాశమిచ్చుట మిక్కిలి న్యాయము. ఇందుకై ప్రజలు యూనివర్సిటీ వారిని ఒత్తిడి కల్గించి సెప్టెంబరులో ఇంకొక పరీక్ష పెట్టునట్లు చేయుట విధియై యున్నది. విద్యార్థుల యిక్కట్లు ప్రజలు, యూనివర్సిటీవారు గమనించి న్యాయము జరుపుదురుగాక!

మారెళ్ల చలపతిరావు,
కాకినాడ.

విశాఖజిల్లాలో ధాన్యసేకరణ అమలు

అయ్యా,

మదరాసు ప్రభుత్వము ఆహార పదార్థములపై తిరిగి సంపూర్ణముగ కంట్రోల్సు నిర్ణయించి రాష్ట్రమంతటను నిర్బంధ ధాన్యసేకరణ అమలు జరుపుటకు నిశ్చయించినది. 19-12-48 తేదీని ఆహారశాఖా మంత్రి గా॥ డాక్టర్. రాజన్ గారు రేడియోలో ప్రసంగించుచు "ఇదివరకు కంట్రోల్సు సంపూర్ణముగా అమలు జరిగిన కాలములో ఎన్నో దురాచారాలు, అవినీతి ప్రబలినవి. ఎక్కడెక్కడ దురాచారాలు ప్రబలడానికి అవకాశం కలదో ప్రభుత్వం గుర్తించి మున్ముందు అలాంటి దురాచారాలు ప్రబలకుండా చేయడానికై ఉద్యోగు లందరికి ఉత్తరవులు జారీచేసి యున్నారు.

ధాన్యాదులను ఉత్పత్తిచేసిన రైతుకు ఆతని కుటుంబీకులకు తలకు రోజుకు పూర్తిగా ఒక పౌను చొప్పున ఆహారధాన్యాలు కేటాయించాలి. ధాన్యసేకరణ సందర్భములో రైతులు విత్తనాల నిమిత్తము - ధాన్యరూపములో కూలీలకు వేతనా లివ్వడం నిమిత్తం వారివద్ద మిగుల్చుకోడాని గత సంవత్సరము నిర్ణయించిన పరిమాణాన్ని నూటికి 25 వంతులు చొప్పున హెచ్చించాలి. దీనికి భిన్నముగా నడచుకొని ఏ ఉద్యోగి అయినా ధాన్యాన్ని సేకరిస్తే అతడు అక్రమముగా ప్రవర్తించినట్లే పరిగణించ బడుతుందని చెప్పారు. ఆహార శాఖామంత్రిగారి ప్రకటన ప్రకారము వెనకటి దురాచారాలు అవినీతి అరికట్టబడుననియు రైతుల తిండిగింజలకు - వ్యవసాయ ఖర్చులకు ధాన్యం మిగుల గలవనియు ఆశించింది ప్రజాసామాన్యము.

తరుగు జిల్లాయగు విశాఖజిల్లాలో ప్రస్తుతము అమలు జరుపుచున్న ధాన్యసేకరణ విధానము లోపభూయిష్టమై-దురాచారములకు - అవినీతికి ఆకరమై పేదరైతులకు - కూలీలకు కడుపు కోతయై - వ్యవసాయపోషణ కుటుంబ పోషణ కుంటుపడు చున్నది. అధిక నిల్వలుగల పలుకుబడి భూస్వాములు ధాన్య సేకరణనుండి తప్పించుకొని తమధాన్యమును అధికధరలకు దొంగ మార్కెటులో విక్రయించు కొనుచున్నారు. ధాన్య సేకరణ ఉద్యోగులు తిండిగింజలు మాత్రమే గల పేదరైతులనుండి - కూలీలనుండి తమకు తోచినన్ని ధాన్యములు బెదరించి ప్రభుత్వ సూచనలకు వ్యతిరేకముగా సేకరించుచున్నారు. పందలు బస్తాల ధాన్యం రాబడిగల ధనిక భూస్వాములనుండి తిండికిపోను మిగత ధాన్యమునంతా నిర్బంధముగానైనా ప్రభుత్వం ఎందుకు సేకరించదో సామాన్యునకు సందేహముగా నున్నది. విశాఖజిల్లాలో ధాన్య సేకరణ అమలు కొఱలను కొట్టి - గద్దలకు వేయునదిగా నున్నది. భూస్వాములను ధనిక రైతులను రక్షించడం బీదరైతులను - కూలీలను నెత్తికొట్టడం అన్యాయము.

అచ్చటచ్చట సాహసించి తిండి గింజలైన విడిచిపెట్టమని కోరుచున్న పేదరైతులను అక్రమ కేసులతోను - వారంట్లతోను సత్కరించుచున్నారు. నానాటికి పేదరైతుల-కూలీల జీవనము దుర్భరమగు చున్నది.

కొలతలు - తూనికలు జరిగించడములో శిలింగురేట్లు చెల్లించడములో ధాన్యసేకరణ ఏజంట్ల వలన ఎంతో మోసము జరుగుచున్నది.

ఇలా ధాన్యసేకరణ విధానము అమలు జరిగించటములో అక్రమాలు అవినీతి నానాటికి పెచ్చు పెరుగుచున్నవి. ప్రభుత్వము వెంటనే గుర్తించి పైలోపములు సవరించలేనపుడు కంట్రోల్సు పూర్తిగా రద్దుచేయడం అవస్యకర్తవ్యం. ప్రభుత్వము ఉపేక్షించిన సామాన్య కుటుంబస్థులు కష్టపడటం. ధాన్యం ఉత్పత్తి క్షీణించటం తథ్యము. ప్రభుత్వ ప్రకటనలు అక్షరముల అమలు జరుగ నపుడు ప్రజలకు ప్రభుత్వముపై విశ్వాసము సన్నగిలుట నిశ్చయము.

యమ్. బాబు పరాంకుశం.

"తెలుగు టైపురైటర్లు"

ఆర్యా,

నేను 29-5-49 ఆదివారము "ఆంధ్ర పత్రిక" లో "తెలుగు షార్టుహాండ్" అను విషయము సంపాదక లేఖను చదివితిని. నాకు చాల సంతోషమైనది. మరియు నాబందరు మిత్రునకు ధన్యవాదములు.

తెలుగు టైపురైటర్లు వున్నవి కాని ప్రజ ప్రజలకు అందుబాటులో లేవు. కారణములు (1) ఉత్పత్తి (2) ఖరీదు ఎక్కువ (3) తరిఫీదు పొందిన వారు బహుకొద్ది జనము (4) దొరుకుట కూడ చాల కష్టము. ఈ పైకనపవచిన కారణములచే, మన మాతృభాష తెలుగు టైపురైటర్లు వాడుకలో చాల అరుదు. ఈ మధ్య వార్త పత్రికలలో *Advertisement* లు కూడ కానరావు.

ప్రజలకు తెలుగు టైపురైటర్లు వున్నవో లేవో అను సంశయము ఎందరో ప్రజలకు వున్నది, ఏల ననగా వున్నవి కొద్ది అయినను పెద్ద సంస్థల యందు, మరియు సంఘముల యందు వాడుకలో వున్నవి. నేను "ఆంధ్ర కాంగ్రెసు" ఆఫీసు విజయవాడనుండి గాంధినిధి వసూలు నిమిత్తము ప్రకటనలు, సైక్లోస్టైలు వుండెను. విదేశములో చిన్న, పెద్ద సంస్థలు యందు వారి మాతృభాషయందు వాడుకలో నున్నవి. మన రాష్ట్ర నిర్మాణసమయము నందు తెలుగు టైపురైటర్లు ఎక్కువ ఉత్పత్తి చేసి రాష్ట్ర, జిల్లా, తాలూకా కాంగ్రెస్ సంస్థలు, మంత్రులు, M. L. A., M. L. C. లు స్టాంప్‌వెండర్లు, వర్తకులు, తెలుగుఅభిమానులు, ప్రతివారు వాడు చుండునట్లు ప్రజలకు సప్లయి చేయుటకు ప్రభుత్వమువారు యిట్టివాటి మీద ఎక్కువ శ్రద్ధతీసుకొని ఎక్కువ ఉత్పత్తి చేసి ప్రజల అందుబాటులో చేయవలయునని మనవి.

జి. యం. గంగన్న.

దయ రాకనా? దాతృత్వము లేకనా?


ఆర్యా,

మార్కాపురం తాలూకాలో 21.5.49 తేదీ మొదలుకొని తే 22.5.49 గీ మధ్యాహ్నము వరకు మంచివర్షము కుర్సి వాగులు బాగుగా పారుచున్నవి. తాలూకాలో చెర్వులు అన్నిటిలో మొత్తముపై 99 పాళ్లచెర్వులకు 75 పాళ్లనీరు యిప్పుడే వచ్చినది. యిక వర్షాకాలం రాలేదు. యీసంవత్సరము తాలూకాలో చెర్వులక్రింద రెండు కార్లపైరు పండుతుంది. బీదతాలూకా ఆహార వుత్పత్తి కరువు తీరుతుంది అని బీద తాలూకా ప్రజలు చాలాసంతోష పడుచు యున్నారు. కానికొన్ని చెర్వులకు మాత్రం వాగులద్వారా కాల్వలు తీసియుండిరి. ఆకాల్వలకప్పుడు తాళాలుబిగించి యున్నారు. వాగులుపారు యీరోజులలో తాళాలుబిగించి నారంటే కాల్వలు బాగుగా లేకనా? లేక బీద రయితుల మొరవినరాకనా? అని చాలచిత్రము వుతూ యున్నది. యీ నాడుదేశము ఆహార ఉత్పత్తిలో వెనుకబడి యితర దేశములపై ఆధారపడు రోజులలో ప్రభుత్వ ఉద్యోగులు ఆహార ఉత్పత్తికి తోడ్పడాలికదా? ఎక్కడ వీరి తోడ్పాటు? కాల్వలు బాగుగా లేకపోతే త్వరలో రిపేరి చేయించడమో లేక బీదరైతుల మొరవిన రాకపోతే వారి మొరనైనా త్వరలో వినటమో చేశి 'స్థానిక ఉద్యోగులు బీదరయితులకు తోడ్పడి మార్కాపురం, త్రిపురాంతకం, మొదలగు చెర్వులకు నీటి సప్లయిచేశి వాగులద్వారా నీటిని అనవసరముగా పోనివ్వవలదు అని కోరుచున్నాను—


గోను పాపిరెడ్డి

మిడతలదండ్లు


మిడతలొక్కొక్కప్పుడు లక్షలాది ఎగిరివచ్చి పంటల్ని, తోటల్ని నాశనంచేస్తాయి. ఈ మిడతల దండుల్ని నాశనం చెయ్యడానికి అనేకదేశాల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాలో వీటి బాధని దాదాపు నివారించుకున్నారు.




మిడతలు ఆకుల్ని ఇట్టే తినేస్తాయి. దండు వచ్చిందంటే పంట క్షణంలో నాశనం అవుతుంది. ఇక్కడొక్క మిడత ఆకుకూరని తింటోంది.




దగ్గరనుంచి చూస్తే మిడతలు గొల్లభామలవలె ఆకుపచ్చగా ఉంటాయి.




ట్రక్కుల్ని నడిపే యంత్రం.
బ్రిటిష్ రైల్వేలలో ఖరీదైన షంటింగ్ ఇంజన్లకి బదులు ఉపయోగిస్తారు.



ఈ ఆకులో పోయినంత మేరా ఈ ఒక్క మిడతే తినేసింది.
తిన్న తరవాత మత్తుగా నేలపడి ఉంటుంది.



మిడతల దండుని దూరంనించి చూస్తే నల్లగా మేఘం ఎగిరి వస్తున్నట్లుగా ఉంటుంది.



చిన్న మైక్రోఫోన్ ఒక బ్రిటిష్ కంపెనీ తయారుచేసింది.
పక్కనున్న మూడు పెన్నీల నాణెం అంతే ఉంటుంది.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1